ఆంధ్ర సచిత్ర వారపత్రిక

28-9-84

రూ. 2/-


కొత్త శీర్షిక

పిల్లలు మానసిక ప్రవృత్తులు

డా॥ జయా నాగరాజు

(మానసిక వేత్త)







అధిక రుచికరం అధిక సంపూర్ణం

ప్రేమతో మీరు పెట్టే ప్రతి చెంచాడు పాపాయి పెరుగుదలకు మంచిది.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.

కలపడం సులభం. పాపాయికి తినిపించడం సులభం.

పాపాయి పెరుగుదలకు అత్యావశ్యకమైన ప్రోటీన్‌తో సమృద్ధం. ఆరోగ్యవంతమైన రక్తం కోసం అదనంగా ఐరన్ కలిగినది. గట్టి పళ్లు, ఎముకలకోసం సరియైన నిష్పత్తిలో కాల్షియం మరియు ఫాస్ఫరస్ కలిగినది. పాపాయి సున్నిత జీర్ణశక్తికి అనువుగా ముందుగానే పచనం చేయబడినది.

పాలతో కూడిన ఫారెక్స్ ఘన ఆహారం.
అధిక సంపూర్ణ ఘన ఆహారం.

మంచి ఆరోగ్యానికి మూలస్థానం–**గ్లాక్సో**

ఉచితం! పాపాయి మొదటి ఏడాది పుస్తకం మీ ప్రతి కోసం, తపాలు మరియు ఇతర ఖర్చుల కోసం రూ. 1/– తపాళా బిళ్లలు జతపర్చి ఈ చిరునామాకు వ్రాయండి. **పో.అ. బాక్స్ నం. 19119, (FCM-25) బొంబాయి 400 025.**


CLARION/B/GX/4/234 TEL

దేశ విఖ్యాతిగాంచిన విమల్ చీరల్లో సరిక్రొత్త శ్రేణికై
విచ్చేయ్యండి నేడే మంగళ్ దీప్ కి.



VIMAL®
A RELIANCE PRODUCT

మంగళ్‌దీప్	మంగళ్‌దీప్
కోఠీ	దాస్‌పల్లా కాంప్లెక్స్
హైదరాబాద్	జగదాంబ సెంటర్
ఫోన్: 45786	విశాఖపట్నం



బంద్

'బంద్' కథ బాగుంది.

రాష్ట్ర భాష పేరిట సాగుతున్న దుష్కృత్యాలు, తత్ఫలితంగా అమాయక ప్రజల బలి, మరెన్నో దుస్సంఘటనలూ అతి సమర్థంగా ఒక్క పేజీలో (ప్రింటులో) ఇమిడ్చి చెప్పగలిగిన రచయిత ఆనంద్ గారికి నా అభినందనలు!

కె. సుబ్రహ్మణ్యం, బెంగుళూరు

నిత్య సత్యాలు

విదేశాల్లో దుబాషీ శీర్షిక ద్వారా ఎన్నో రాజకీయ, సాంఘిక విషయాలు, అద్భుత వ్యక్తులు, శీర్షిక ద్వారా ఎన్నో విజ్ఞాన దాయకమైన కొత్త విషయములు,'ఇ'వేమన పద్యాలు శీర్షిక ద్వారా చక్కని వ్యంగ్యముతో కూడిన నిత్య సత్యాలు మాకు అందజేస్తున్నారు.

బండి సత్య నారాయణ, ఇతరులు, విలస (రావిగుంట చెరువు)

గమనార్హం

కాంగ్రెసులో గవర్నరో. ఆంధ్ర దేశంలో "అప్రజా స్వామిక చర్య" గైకొన్నారు. నిజమే. అయితే తర్వాత పరిణామాలు గమనార్హం.

1. నాడు ఫిరాయింపుదారుడు చరణ్ మెజారిటీని పార్లమెంటు వెలుపల నిర్ణయించిన నీలం వారు ప్రజాస్వామ్యం గూర్చి మాట్లాడ్డం హాస్యాస్పదం.- అది గురువింద గింజవలెనున్నది.

2. ఇందిరమ్మ మాటపై జనతాను చీల్చి ప్రధానిగా పార్లమెంటు మొహమే చూడక ఆమె అధికారంలోకి రావడానికి సాయపడిన చౌధురికి – ఈ నిరసనలకు నాయకత్వ మీయటం ప్రతిపక్షాల దౌర్భాగ్యం. ప్రజల దౌర్భాగ్యం. తోక పట్టి గోదారి యీదటమే.

3. త్యాగాలకు తయారవమన్న యన్టీఆర్, తన గూర్చి మరణించిన అభిమానులకు వ్యక్తిగా, లేక పార్టీ నుండి ఏ సహాయం చేశారు? అమాయకులు అందర్నీ రెచ్చ గొట్టే, వారినీ గమనించాల్సిందిగా మనవి. మతవాదులూ, మితవాదులూ యిదే మేలని కొమ్ము గాస్తున్నారు. వామ పక్ష ప్రజా స్వామ్యమే శరణ్యం.

ఆర్. పెంచల రెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం

అద్భుత వ్యక్తులు

శ్రీ బి. వి. పట్టాభిరామ్ గారి "జీవులలోని జీవకాంతిని కనుగొన్న కిర్లియన్" వ్యాసంలో రచయిత, జీవుల చుట్టూ ఉండే ఈ జీవకాంతిని 1939 వ సం. ములో కిర్లియన్ అను వ్యక్తి కని-పెట్టినట్లుగా వ్రాసారు. కానీ ఈ జీవకాంతిని మొదటి సారిగా గమనించిన వ్యక్తి కిర్లియన్ కాదు. క్రీ. శ. 1900 లో లండన్‌లోని సెయింట్ థామస్ ఆస్పత్రిలో పని చేయుచున్న డా. వాల్టర్ కిల్నర్, డయి సయనీన్ అనే పదార్థం పులుమబడిన అద్దాల ద్వారా జీవుల చుట్టూ ఉండే తేజస్సును గమనించుటయేగాక, ఈ తేజస్సులో వచ్చెడి మార్పులను బట్టి రోగిలోని రుగ్మతను కనుగొను పద్ధతులను గూర్చి అధ్యయనం చేసారు.

శ్రీ పట్టాభిరామ్ తమ వ్యాసంలో 1939 వ సం. లో కిర్లియన్ ఎలక్ట్రికల్ పని ముట్లు కొనడానికి వెళ్ళి, అక్కడ తాను చూసిన ఒక సంఘటన ఆధారంగా ఈ జీవ కాంతికి ఫోటో తీసే పద్ధతిని కనుగొన్నారని వ్రాశారు. అయితే కిర్లియన్ ఫోటోగ్రఫీకి నాంది ఈ విధంగా జరుగలేదు.

రష్యాలో కుబాన్ ప్రాంత రాజధాని క్రాస్నొడార్ క్రాయ్‌లో ఒక శాస్త్రవేత్త తన సాంకేతిక సామగ్రి యొక్క రిపేర్ కొరకై వెదుకుచుండగా, సైమన్ డేవిడో విచ్ కిర్లియన్ పేరు ఆయనకు సూచింపబడింది. ఆ ప్రాంతంలో పేరు గాంచిన కిర్లియన్, ఆ శాస్త్ర-వేత్త యొక్క శాస్త్ర గారానికి పిలిపించబడ్డారు. శ్రీ పట్టాభిరామ్ గారు వ్రాసిన హయి ఫ్రీక్వెన్సీ ఎలెక్ట్రో థెరాపీని మొదటి సారిగా, కిర్లియన్ క్రాస్నొడోర్‌లోని పరిశోధనా గారంలో చూసారు. శ్రీ పట్టాభి రామ్‌గారు, కిర్లియన్ తన చేతి క్రింద ఫోటో ఫిల్మ్ పెట్టి, పైన ఎలక్ట్రోడ్ పెట్టి కరంట్ తగిలించాడు అని వ్రాసారు. అయితే ఆ కాలంలో ఉపయోగింపబడుచున్న ఎలక్ట్రోడులు గాజాతో తయారు చేయబడు-చుండెడివి. గాజాలోంచి వెలువడే కాంతి మూలంగా ఫోటో ఫిల్మ్ పాడవుతుందన్న ఉద్దేశ్యంతో సైమన్ కిర్లియన్, లోహంతో చేయబడ్డ ఎలక్ట్రోడ్‌ను ఉపయోగించారు.

శ్రీ పట్టాభి రామ్ గారు తెలిపినట్లు, కిర్లియన్ ప్రయోగాలు పరీక్షించడాన్కి ప్రజలు భయపడలేదు. కిర్లియన్ మరియు ఆయన భార్య వాలెంతినా క్రిస్మోఫానా కిర్లియన్‌ల ప్రయోగాలు తిలకించడానికి పేరు గాంచిన వైద్యులు, అకాడమీ ఆఫ సైన్స్ సభ్యులు, వివిధ రంగాలలో పేరు పొందిన శాస్త్ర-వేత్తలు, కిరోవ్ వీధిలోని కిర్లియన్ గృహాన్ని సంద-

(66వ పేజీ చూడండి)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభు ప్రసాద్
సంపాదకుడు :
(1938-1972)

శుక్రవారం : 28-9-'84
శ్రీరక్తాక్షినామ సం. ఆశ్వయుజ శు. చవితి

సంపుటము 77 : సంచిక 4

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు. 2-00
ఆరు మాసాల చందా	రు. 55-90
పోస్టులో ఏడాది చందా	రు. 111-80

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం, విజయవాడ-520 003.

విషయానుక్రమణిక

నటి "విజ్జి"
(ఫోటో : కె ఆర్ వి. భక్త)

కథలు :

సీరియల్ నవలలు :

వ్యాసాలు, శీర్షికలు :

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

తర్వాత అక్కడా?

ఒకనాటి ఉదయం - అది అంత మంచి ఉదయం కాదని శ్రీమతి గాంధీ తర్వాత అనవచ్చు అది వేరే విషయం – 1, సఫ్దర్‌జంగ్ రోడ్డు ఇంట్లో టెలిఫోన్ మోగింది

"హలో! రాష్ట్రపతిగారు ప్రధానమంత్రిగారితో మాట్లాడాలి. చాలా అర్జెంటు!"

"క్షమించాలి" అన్నారు ధవన్. "ప్రధానమంత్రి ఇప్పుడే మాస్కో నుంచి వచ్చారు. అలిసిపోయి ఉన్నారు. విశ్రాంతి తీసుకుంటున్నారు" అవతల వయిపు టెలిఫోన్ పెట్టేశారు.

సాయంత్రం బూటాసింగ్ టెలిఫోన్ చేశారు శ్రీమతి గాంధీకి. రాష్ట్రపతి ఎందరో కాంగ్రెసు (ఇందిర) వారిని తమ భవనానికి పిలిచారుట. ఆహ్వానించబడిన వారందరూ మంత్రులు కారుట "ఏమిటి చేస్తున్నా డీయన? తెలుసుకుందా మనుకున్నాను కాని ఆయన కార్యదర్శి మాట్లాడనన్నారు" అని బూటాసింగ్. "మీరు ఆయనతో మాట్లాడరాదూ?"

శ్రీమతి గాంధీ వెంటనే రాష్ట్రపతి భవన్‌కి వెళ్ళిపోయారు. ఆమె అక్కడికి చేరుకునేసరికి ఆమె పార్టీ సభ్యులు వెళ్ళిపోతున్నారు. తమ మామూలు ధోరణిలో ఆమె వాళ్ళని పట్టించుకోలేదు కాని ఆమె కోసం రాష్ట్రపతి కాచుకుని ఉన్నారన్న మాట విని వాళ్ళు గట్టిగా నవ్వారు.

"మీ ఆటకట్టు!" అన్నారు రాష్ట్రపతి. "మీ మెజారిటీ పోయింది! రాజీనామా ఇవ్వండి!"

రాష్ట్రపతి పరాచికాలు ఆడుతున్నారనుకున్నారు శ్రీమతి గాంధీ "ఏమిటి మీరనేది! ఇంకా కర్ణాటక ప్రభుత్వాన్ని పడగొట్టలేదు. ఎన్నికలు జరగలేదు. అప్పుడే మెజారిటీ అంటా రేమిటి?"

"ఎన్నికల సంగతి మర్చిపొండి! చవాన్, ఇంకా కొందరు వచ్చారు. 162 మంది సంతకాలు పట్టుకు-వచ్చారు. అంతా పార్టీ మనుష్యులే. వీళ్ళంతా మీ మీద నమ్మకం పోయిందంటున్నారు మీరు రాజీనామా ఇవ్వక తప్పదు."

"చవానా? ఏ చవాన్?" అని అడిగారు ప్రధానమంత్రి.

"ఇంకెవరు, మీ రక్షణ శాఖ మంత్రి!"

"అదెలాగ? ఆయనని ఇప్పుడే చూశానే! నాతో మాస్కో వచ్చారే ఆయన!"

"ఆ చవాన్ కాదు లెండి ఈయన యశ్వంతరావు చవాన్. మీ మాజీ రక్షణ శాఖ మంత్రి మీరేమో ఊరికే మంత్రులని మారుస్తూ ఉంటారు! ఎవరు ఏ శాఖ మంత్రో చెప్పటమే కష్టమయి పోతూ ఉంటుంది."

య. చవాన్ ఒక పెద్ద పార్లమెంటు సభ్యుల జాబితా పట్టుకుని రాష్ట్రపతి దగ్గిరికి వెళ్లారుట. రాష్ట్రపతికి పెద్ద జాబితాలు చదవటమంటే విసుగు. కానీ "శ్రీమతి గాంధీ ఆటకట్టు" అనిపించింది ఆయనకి.

ఇలాంటిది ఏదో జరుగుతుందని శ్రీమతి గాంధీకి అనుమానంగానే ఉండేది కాని ఇలాగ తాము ఊళ్లో లేనప్పుడు, ఆరోగ్యం బాగా లేనప్పుడు జరుగుతుందని ఆమె అనుకోలేదు "మీ (రాష్ట్రపతి) అధ్యక్షుల సలహాదారులు పిచ్చివాళ్లయిపోయారు వాళ్లని తరిమి వెయ్యాలి" అన్నారు ఆవిడ. నేను రాజీనామా ఇవ్వనంటే ఇవ్వను. నెహ్రూ వంశం వాళ్ళకి ఆ అలవాటు లేదు ." అన్నారు శ్రీమతి గాంధీ.

"యశ్వంతరావు చవాన్‌ని ప్రధానమంత్రి కమ్మని, మిమ్మల్ని రాజీనామా చెయ్యమనటం కన్నా నేను చెయ్యగలిగింది ఏమీ లేదు....." అన్నారు రాష్ట్రపతి. ఈ వార్త విని తొంబలు తొంబలుగా రాష్ట్రపతి భవనానికి రావటం మొదలు పెట్టారు జనం. వీళ్లలో శ్రీమతి గాంధీ మనుషులు కూడా ఉన్నారు. వీళ్లందరినీ ముందు బయటికి పొమ్మనవలిసి వచ్చింది.

చవాన్ ప్రధాన మంత్రిగా పదవీ స్వీకారం చేశారు. చాలా నిరాడంబరంగా ఈ పని చేశారు ఆయన. ఆయనతో బాటు ఆరుగురు తోటి సభ్యులు వచ్చి మంత్రులుగా చేరారు. 30 రోజులంటే 30 రోజులే గడువు యిచ్చారు శ్రీ చవాన్‌కి తమ మెజారిటీని నిరూపించుకోవటానికి రాష్ట్రపతి. ఈ గడువు ఇచ్చినప్పుడు ఆయన తన తర్జని ఆడించి మరీ ఇచ్చారు. నెల ఎందుకు, వారం చాలు, అన్నారు చవాన్.

పత్రికలలో కొందరు కోపంగా సంపాదకీయాలు రాయనే రాశారు. రాష్ట్రపతిని అభిశంసించాలి, అన్నది టయిమ్స్ ఆఫ్ ఇండియా. "ఈ దేశం విడి పోకుండా చూసుకోగలిగిన వ్యక్తి శ్రీమతి గాంధీ ఒక్కరే. తమ తండ్రిగారిలాగే ఈవిడ కూడా కేంబ్రిడ్జిలో చదువుకున్నారు. కేంబ్రిడ్జి వాళ్లకి తెలివి ఎంతో ఎక్కువ అని మనందరికీ తెలుసు. ఈ దేశం ఇంత సంక్షోభంలో ఉండగా అందరికన్నా ఎక్కువ జనాభిమానాన్ని చూరగొన్న ఒక వ్యక్తిని ఇలాగ ఒక పిప్పి పన్నుని తీసి వేసినట్టు తీసి వెయ్యటమేనా?" వగయిరా వగయిరా..

ఈ సంఘటన వెనుక అమెరికా గూఢచారి సంస్థ (సి. ఐ. ఎ) ఉందని కొన్ని పత్రికలు అన్నాయి. పేట్రియాట్ పత్రిక మాత్రం ఇలాగ అనలేదు ఎందుకంటే ఇంకా మాస్కో నుంచి కబురు రాలేదు కనుక. ఒకప్పుడు చవాన్ కూడా మాస్కో అనుగ్రహాన్ని పొందిన వాడే కాబట్టి ఆయన రావటం ఈ పత్రికకి మొత్తంమీద ఇష్టమే. మర్నాడు సందిగ్ధావస్థ పోయింది మాస్కో కబురు రానే వచ్చింది. పేట్రియాట్‌లో శ్రీమతి గాంధిని బ్రహ్మాండంగా విమర్శించేశారు. "ఏమిటా మారు?" అని అడిగారు కొందరు. "ఇది మామూలేకదా? కమ్యూనిస్టులు ఎవరు అధికారంలో ఉంటే వాళ్లని బలపరుస్తారు బ్రిటిష్ వాళ్లని యుద్ధం సమయంలో బలపరచలేదూ?" అన్నారు మరికొందరు.

చరణ్‌సింగ్‌లాగే చవాన్ కూడా పార్లమెంటులో మెజారిటీ నిరూపించుకోను అన్నారు. పార్లమెంటుని రద్దు చేసి ఎన్నికలు జరిపించమన్నారు రాష్ట్రపతి అలాగే చేశారు చవాన్ ప్రధాన మంత్రి ఆయె. ఆయన సలహా పాటించవద్దూ?

ఎన్నికలు ఫలితాలు గందరగోళంగా ఉన్నాయి చిన్నా, పెద్దా 20 పార్టీలు రంగంలోకి దిగాయి. శ్రీమతి గాంధీ పార్టీ అన్నిటికన్నా పెద్దదిగా రాలేదు మహారాష్ట్రలో, దక్షిణాదిలో మొత్తంమీద, ఆమె మెజారిటీ తగ్గింది చివరికి అబ్దుల్ రెహమాన్ అంతులే కూడా ఆమె పార్టీని వదిలి వెళ్ళిపోయారు "నా రొట్టెకి ఏ వయిపు వెన్న రాసి ఉందో నాకు తెలుసు" అన్నారు ఆయన. శ్రీమతి గాంధి బొంబాయి-నుంచి పోటీ చెయ్యవలిసి వచ్చింది. కృష్ణమీనన్ ఇక్కడినుంచే గెలిచారుకదా? చరణ్‌సింగ్ తనే ప్రతిపక్షాలన్నిటినీ కలిపి నాయకుడుగా ఒకే ఒక పార్టీని నిర్మించుకుందామనుకున్నారు కాని అదీ జరగలేదు అసలు ఎందుకు ఇలాంటి నిర్మాణం, అన్నారు తక్కిన వాళ్ళు

చవాన్ కాంగ్రెసు (దాని పేరు కాంగ్రెసు–సి) హఠాత్తుగా బలపడిపోయింది. టయిమ్స్ ఆఫ్ ఇండియా కూడా ఆయనని "ఫిరాయింపుదారు"డని పిలవటం మానివేసింది. రాజీవ్ గాంధీకి సీటు దొరకలేదు. ఆయన ఎక్కడికి వెళ్ళినా మేనకా గాంధి వెంట వచ్చేది! ఇక లాభం లేదనుకుని ఆయన పోటీ నుంచి విరమించుకున్నాడు. ఇంకా ఎందరో అదృశ్యులయ్యారు. వారిలో బూటాసింగ్, నరసింహారావులు ఉన్నారు వీళ్ళు తమ స్వంత రాష్ట్రానికి వెళ్ళలేరు కదా? నరసింహారావు సాహిత్య సేవ (అదేమిటో నాకు తెలీదు)కి అంకితం అయిపోతే బూటాసింగ్ జెనీవాలోని ఒలింపిక్ ఆటల కార్య-క్రమంలో చేరారు

నాకు పూర్తి వివరాలు తెలియటం లేదు. నాకూ పని ఉండి విదేశాలకి వెళ్లాను జూరిక్‌లో ఒక బాంకు వద్ద చెక్కు మార్చుకుందామని నుంచుంటే నాకు డబ్బు ఇవ్వవలసిన మనిషి పరిచితుడులాగ కనిపించాడు. అరుణ్ నెహ్రూ కాదు కదా? అనుకుంటే ఆయనే!

"మీ రిక్కడేమి చేస్తున్నారూ?" అని అడిగాను.

"మేము ఒక బాంకు పెట్టుకున్నాము లెండి!" అన్నారు ఆయన "మేము" అంటే? ఏమో నేను చెప్పమలేను కాని నా స్విస్ ఫ్రాంకులు లెక్క పెట్టుకుంటూ ఉన్నప్పుడు నాలో ఒక ఆలోచన తళుక్కుమని మెరిసింది ..... □

విధి ఒక విషవలయం..

నాలుగు రోజుల్నుంచీ ఎడతెరిపి లేకుండా కురుస్తోంది వర్షం....

కన్ను ముయ్యకుండా గస్తీ తిరిగే భద్రతా దళాల్లాగా సూర్యుడిని బయటకు రానివ్వకుండా కాపలా కాస్తోందా అన్నట్లు, వర్షం మబ్బుల్ని కూడా వెంటేసుకుని, ఒక్క క్షణం కూడా కను మరుగవటల్లేదు. . .

ఫామిలీతో...మొక్కుబడి తీర్చుకోటం కోసం ద్వారకా తిరుమల వచ్చాడు జయాకర్.


అతను ఒక ప్రయివేటు ఫరంలో, మంచి పొజిషన్‌లో ఉన్న ఉద్యోగి. భార్య, చెల్లెలు, కొడుకు, కూతురుతో కలిసి అక్కడికి వచ్చాడు.

ఇంత వర్షంలో ప్రయాణం ఎలా చెయ్యాలో....- దారిలో ఎక్కడా చిక్కుకోకుండా గమ్యస్థానం ఎలా చేరాలో అర్థం కావటంలేదతనికి.

ఎలాగో ఏలూరయినా చేరుకోగలిగితే అక్కడనుంచి ఏదో మార్గం ఆలోచించొచ్చు అనుకుంటూ ధైర్యం తెచ్చుకుని ప్రయాణం సాగించటానికే నిశ్చయించుకున్నాడు....

స్వామిదేవిపల్లి వచ్చేసరికి గాలి వాన ఉధృత రూపం దాల్చింది. కమ్యూనికేషన్స్ తెగిపోయాయి.

-ఆదూరి సావిత్రి



అక్కడనుంచి ఏలూరు చేరుకోటానికి దార్లో రోడ్డు గళ్ళు పడటంవల్ల అక్కడే ఆగిపోవలసొచ్చింది.

సాయంత్రం నాలుగు గంటలయింది. గాఢమైన మబ్బులు, వర్షం వల్ల అప్పటికే చీకటి పడ్తున్నది.....

"తిరుపతిలో నన్నా ఉండవలసింది. అప్పుడీ పరిచయంలేని పల్లెలో... పిల్లలతో ఎలా అవస్థ పడతాం?" భయంగా అన్నది జయాకర్ భార్య అరుంధతి.

"ఈ ఊరిలో లాడ్జిలో రూంలు దొరుకుతాయా?" అన్నాడు జయాకర్ అక్కడ పాత హోటల్ యజమాని దగ్గరకు వెళ్ళి.

"లాడ్జిలో రూంలు ఇచ్చేపాటి పెద్ద ఊరు కాదు బాబూ ఇది. అంతేకాదు ఈ పల్లెలో కాఫీ హోటల్ తప్ప, భోజన హోటల్ కూడా లేదు" అంటూ, జయాకర్ పరిస్థితి గురించి విని, "అయ్యో! వెంట ఆడోళ్ళు, పిల్లలూ కూడా ఉన్నారే! ఇంకా నాలుగు రోజులన్నా పడుతుంది, రోడ్లు బాగయి, ఏలూరు వెళ్ళటానికి." అన్నాడు పాక హోటల్ యజమాని పానకాలు.

మై గాడ్! ఎలా?

చేతినిండా డబ్బు ఉండి కూడా ఒక్కోసారి మనిషి ఎంత నిస్సహాయుడుగా మారతాడో అలాంటి పరిస్థితిలో వో దా: డబ్బు కూడా ఎలా చిన్న మొత్తు విలువయినా చెయ్యవో ప్రత్యక్షంగా అర్థమవు-తోంది జయాకర్‌కి.

"ఓ పని చెయ్యండి" అన్నాడు పానకాలు.

ఆశగా చూశాడు జయాకర్

"ఈ వూరి కరణంగా రింటి కెళ్ళండి. అక్కడయితే మీరు ఎన్ని రోజులయినా నిశ్చింతగా ఉండొచ్చు. ఏమీ ఇబ్బంది కూడా ఉండదు" అంటూ ఓ మనిషిని తోడిచ్చి, కరణంగారింటికి పంపాడు పానకాలు వాళ్ళని

* * *

తెల్లని పంచె, పొట్టి చేతుల తెల్ల చొక్కా వేసుకుని, పచ్చగా ఉన్న యాభై సంవత్సరాలు పైబడ్డ వ్యక్తి వాకిట్లో కొచ్చాడు.

"వీరే మా కరణంగారు" అన్నాడు పానకాలు పంపిన కుర్రాడు.

"నమస్కారమండీ నాపేరు జయాకర్....." అంటూ వివరాలు చెప్పి, "ఇక్కడ అడిగితే మీ ఇంటికి వెళ్ళ-మన్నారు" మొహమాటంగా అన్నాడు జయాకర్.

"లోపలికి రండి. రండమ్మా" అంటూ వాళ్ళని ఆదరంగా లోపలి కాహ్వానించి భార్యకు, పిల్లలకూ పరిచయం చేశాడు కరణం.

ఆయన భార్య కామేశ్వరమ్మ. సగం నెరిసిన జుట్టు, చామన ఛాయ, ఆప్యాయత కలబోసుకున్న కళ్ళు, చిరు నవ్వును వదలని పెదవులు... .

ఆమెను చూస్తూనే నమస్కారం చేసింది అరుంధతి అప్రయత్నంగా.

"స్నానాలు చెయ్యండమ్మా వేడి నీళ్ళున్నాయి" అంటూ తాటాకుల దడి వున్న పాకలో నీళ్ళు తోడించి పెట్టిందావిడ

పెద్ద మండువా లోగిలితో... పురాతనమైన, గంభీరమైన ఫర్నీచర్‌తో ఉన్న ఇల్లు. ఆ ఇంట్లో కృత్రిమ నాగరికతకు దూరంగా, అమాయకత్వం, ఆప్యాయతల అద్భుతమైన కలయికతో ఉన్న మనుషులు జయాకర్ కుటుంబాన్ని బాగా ఆకట్టుకున్నారు:

బాత్రూంలో షవర్ కింద గోరు వెచ్చని నీళ్ళ స్నానం చేస్తూ. డైనింగ్ టేబుల్‌మీద వెండి కంచాలలో రక రకాల కూరలతో భోజనం చేస్తూ .మొజాయిక్ ఫ్లోరింగ్ ఉన్న బిల్డింగ్‌లో స్లిప్పర్స్‌తో తిరుగుతూ.... ఎ సి రూంలో ఫోమ్ బెడ్‌మీద నిద్ర పోయే ఖరీదైన మనుషులు జయాకర్ వాళ్ళు.

ఇక్కడ అవేం లేకపోయినా.....మట్టి నేల అయినా, "దేము డింట్లోకి, భోజనాల గదుల్లోకి చెప్పులతో రాగూడదమ్మా" అని కామేశ్వరమ్మ చిరు నవ్వుతో మందలిస్తే, ఉట్టి కాళ్ళతో తిరిగినా ఇబ్బందిగా.....ఎబ్బెట్టుగా ఫీలవలేదు వాళ్ళు.

వాళ్ళ లగ్జరీస్ నన్నిటినీ డామినేట్ చెయ్యగలిగింది ఆ ఇంట్లో వాళ్ళ ఆప్యాయత....

నేలమీద పెద్ద పెద్ద పీటలు వేసి, ఇత్తడి మర చెంబులతో మంచి నీళ్ళు పెట్టి, అరిటాకులలో అన్నం వడ్డించారు.

కంది పచ్చడి, ఆవకాయ, పచ్చి పులుసు, పెరుగు, అన్నంలోకి ఆధరువులు.

నెయ్యి వేస్తూ "కూరలేం లేవు బాబూ. ఎలా-తింటారో." నొచ్చుకుంటూ అన్నది కామేశ్వరమ్మ.

"ఇంకానయిం. మీరు అభిమానంగా ఒడ్డిస్తుంటే ఈ భోజనం ఎంత అద్భుతంగా ఉందో తెలుసా? మీరు ఈ సమయంలో ఇలా మమ్మల్ని ఆదుకోకపోతే ఏమయిపోయే వాళ్ళమో!" అన్నారు జయాకర్, అరుంధతి.

అన్నం తిన్నాక, సావిట్లో నవ్వారు మంచాలు మగ వాళ్ళకి, నులక మంచాలు ఆడవాళ్ళకీ వేశారు....-నిశ్చింతగా నిద్ర పోయారు జయాకర్ కుటుంబం.

అలా వాళ్ళింట్లో నాలుగు రోజులుండాలి సొచ్చింది....జయాకర్ గిల్టీగా ఫీలవుతుంటే.....

"నువ్వంతగా బాధ పడాల్సిం దేముంది నాయనా ఇందులో? నేను గ్రామాధికారిని. అంటే....గ్రామం-మీద ఉధికారం చలాయించడమే కాదు....ఇలా గ్రామానికి పిలిచిన, దేవుడు పంపిన అతిథు లెవరైనా వస్తే. గ్రామ ప్రజలందరి తరుపున సాధ్యమైనంత వరకూ ఆదుకోవలసిన బాధ్యత కూడా నాదే.

ఇక్కడ కొచ్చిన మా రెవెన్యూ డిపార్ట్‌మెంటు అధికారులకే కాదు ఎలక్షన్ డ్యూటీ కొచ్చిన ఉద్యోగులు, టీకాలినస్పెక్టర్లు, మలేరియా నివారణకు చర్యలు తీసుకునే ఆఫీసర్లు, ఇలా ఎవరొచ్చినా మా ఇంట్లోనే భోజనం ఏర్పాటు చేస్తాను. ఉన్నంతలో అతిధికి అన్నం పెట్టకుండా పంపే అలవాటు మాకు లేదు.

మీ రెన్నాళ్ళున్నా మాకేం ఇబ్బంది లేదు.

మాకు కాసిని వడ్లు పండుతాయి పాడి ఉన్నది రైతులకూ, షావుకార్లకూ, ఊళ్ళో ఉన్న మిగిలిన వాళ్ళకూ చిన్న పనికీ, పెద్ద పనికీ మేము అండగా ఉంటాం. వాళ్ళు వాళ్ళకు పండిన కాయో కసరో, కంది గింజ, పెసర గింజ, తృణమో, పణమో ఇస్తుంటారు ఆడంబరాలు లేకుండా... నిలవెయ్యాలనే కాంక్ష లేకుండా ఉంటే ..!

ఉండటానికి, తినటానికి, అతిధి అభ్యాగతి వస్తే ఉన్నంతలో పెట్టటానికి మాకు ఏవిధమైన ఇబ్బందీ లేకుండా మనుగడ సాగిపోతూ ఉంటుంది.

మీరే సంకోచాలూ పెట్టుకోవద్దు" అన్నాడు కరణం.. .

అయిదు రోజుల తరవాత, వాళ్ళ దగ్గర వీడ్కోలు తీసుకుని, వాళ్ళ స్మృతుల్ని మనసునిండా నింపుకుని, ఊరు దాటారు జయాకర్, అతని కుటుంబం.

ఆరు సంవత్సరాలు కాల గర్భంలో కలిసి పోయాయి...జయాకర్ చెల్లెలికి పెళ్ళయింది. ఆమెను ద్వారకా తిరుమల వేపు ఇచ్చారు.

ఒకసారి చెల్లెలిని చూడటాని కొచ్చాడు జయాకర్. తిరుగు ప్రయాణంలో మద్దులూరులో బస్సు కోసం వెయిట్ చేస్తూ నిలబడ్డాడు.


స్వామిదేవిపల్లెకు సమీపంలో ఉన్న పెద్ద ఊరు, కూడలి మద్దులూరే

అరవయ్యేళ్ళ వృద్ధుడు జయాకర్ వద్దకొచ్చి సంకోచిస్తూ "పళ్ళ పొడి కొంటారా బాబూ? మీరు కొనే పొట్లాలకన్నా చాలా చవక. ఇంత పెద్ద ప్యాకెట్టు ఒక్క ముప్పావలా మాత్రమే" అన్నాడు.

యాదాలాపంగా ఆ వ్యక్తి కేసి చూసిన జయాకర్ కళ్ళు, చురుగ్గా అయ్యాయి. అతని మనసు శర వేగంతో ఆరు సంవత్సరాలు వెనక్కి వెళ్ళి, అక్కడే పెనుగులాడుతూ సందేహంగా ఆగిపోయింది.....

"మీరు. . మీరు స్వామిదేవిపల్లె కరణంగారు కదూ?" విభ్రాంతిగా అడిగాడు జయాకర్.

"ఇంకెక్కడి కరణంలే బాబూ! కరిణీకాలు పోయాయిగా!" అన్నాడాయన నిర్లిప్తంగా. జయాకర్ వేపు నిశితంగా చూస్తూ, "మీరు నన్నెరుగుదురా?" అన్నాడు మళ్ళీ.



"నేను జయాకర్‌నండీ. ఆరేళ్ళ క్రితం నేను, నా భార్యా పిల్లలతో గాలి వానల్లో మీ ఊరులో చిక్కుబడితే....అయిదు రోజులపాటు మీరు మాకు ఆతిథ్య మిచ్చారు. మీ ఇంటికి అనేకమంది వస్తుంటారు. మీకు గుర్తు లేదేమో గానీ....మాకు మాత్రం....." అంటున్న జయాకర్ మాటలకు అడ్డు వస్తూ "ఔను. గుర్తొచ్చింది. అమ్మాయీ, పిల్లలూ బావున్నారా?" అన్నాడు కరణం.

"మిమ్మల్ని ఈ స్థితిలో చూస్తున్నా నేమిటి? నేను కలగనటం లేదు కదా?!" అన్నాడు జయాకర్.

"కరిణీకాలు పోయాయి. నాకు వయ సుడిగి పోయింది. ఏ పనీ చెయ్యలేను. సంసారం ఈదాలి.....

నా కొడుకూ కూడా కరణమే. వాడికి ఏజ్ బారయి-పోయింది. గవర్నమెంటు ఉద్యోగానికి పనికిరాడు. కరిణీకం చేసుకుంటే ఉన్న ఊరికి దగ్గరలోనే కుదురుగా బతకొచ్చు అనే ఉద్దేశ్యంతో వాడి నాట్నే చదివించలేదు. నైన్త్ వరకే చదివాడు. ఇప్పుడు వాడి గతేమిటి? ఇంటి నిండా చిన్న చిన్న పిల్లలు. పొద్దున లేస్తే ఏదో ఒకటి అడుగుతుంటారు. ఇంట్లో ఇబ్బందులు గమనించగల వయసు కాదు వాళ్ళది.

తిండి గింజలు కాసిని ఉన్నా... పై ఖర్చు కావాలి-గదా. వేరే ఆదాయ మొచ్చే మార్గం లేదు....

ఇప్పుడు ప్రతి చిన్న వస్తువూ కొనుక్కోవాలిసిందే. ఊళ్ళో వాళ్ళకి మా అవసరం ప్రస్తుతం ఏం లేదు కాబట్టి వాళ్ళు చూసీ చూడనట్లే నిర్లక్ష్యంగా ఉండిపోతారు......

పరాయివాడు పాలించినప్పుడే నయం బాబూ నిశ్చింతగా ఉన్నాం. కరణం రెవెన్యూ డిపార్ట్-మెంటుకు పునాదిరాయి వంటివాడు అనే స్పృహతో వాళ్ళు ప్రవర్తించేవాళ్ళు.

గాంధీగారు కూడా సహాయ నిరాకరణ గ్రామాల-నుంచే ....గ్రామోద్యోగుల సహాయంతోనే ప్రారంభం కావాలన్నారు....మేం ఎవరినన్నా పీడిస్తున్నామా? ఎవరి పొట్టలైనా కొడుతున్నామా? ఈ సానుభూతి ప్రజలకే ఉండదు. మాలో మాకే ఉండదు. పొరుగు-వాడు పచ్చగా ఉంటే ఓర్వలేని జాతి మనది.....-కేవలం రెండు వందల ఇరవై అయిదు రూపాయలతో గవర్నమెంటు కింత గాడిద చాకిరి చేసేది ఎవరు చెప్పు? మా స్థానంలో వచ్చిన వాళ్ళు మా లా రెండు వందలకే చేస్తారా?

చెయ్యరు. చేస్తే మాడి చస్తారు.....

వాళ్ళకు ఫుల్ టైం జీతం ఇవ్వాలి. అంటే...మాకన్నా నాలుగు రెట్లు అధికంగా ఇవ్వాలి.

ఇది పొదుపా?

హఠాత్తుగా మమ్మల్నిలా లాగి పారేస్తే పరిస్థితి ఎంత అస్తవ్యస్తంగా ఉంది?

ఎవడైనా లోన్ పెట్టుకోవాలంటే....వాడి సర్వే నెంబరు, ఎంజాయ్‌మెంటు ఈ కొత్త ఉద్యోగికి తెలుస్తుందా ఖచ్చితంగా?

గ్రామంలో ఎవ రెలాంటి వారు? ఎవరి పొలం ఎవరు అన్యాయంగా ఆక్రమిస్తున్నారు? ఎవడు ఎంత పన్ను కడుతున్నాడు? ఎవడి సర్వే నెంబరు ఎంత? లోన్ వగైరాలు కావాలంటే శాంక్షన్ చెయ్యటానికి వాడి ఎంజాయ్‌మెంటెంత?

విధి ఒక విషవలయం

ఫలానా పొలం గల గవరయ్యను నేనే అంటూ ఒకడొస్తే....వాడి ఐడెంటిఫికేషను, నిజంగా ఆ పొలం గల గవరయ్య వాడేనా?....

ఇవన్నీ ఆ గ్రామంలో పుట్టి..... ఆ మనుషుల మధ్య పెరిగి....వాళ్ళతో మసలే గ్రామ కరణానికి తెలిసినంత ఖచ్చితంగా కొత్తగా వచ్చిన వాళ్ళకి తెలుస్తుందా?

అయినా..... కొత్త వాళ్ళకు ఉద్యోగాలు కల్పించి మనుగడ ప్రసాదించటం గొప్ప గానీ.... అది ఉన్న వాడి కడుపుమీద కొట్టి, నడి రోడ్డు మీదకు లాగి, వాడు కుటుంబంతో మల మల మాడి చస్తుంటే....-ఆ ఉద్యోగం నీ కిస్తానంటూ వాడి కన్నీటితో తడిసిన గుడ్డతో అవతలి వాడి కళ్ళు తుడవటం ఏం న్యాయం?

నా కొడుకేం చేస్తున్నాడో తెలుసా బాబూ?

బ్రతకటానికి వేరే మార్గం లేక.....రోడ్డు మీద తారు పోస్తుంటే ఈ మద్దులూరులోనే ఆ కూలీలలో ఒకడుగా మారాడు. వాడిని చూస్తుంటే నా కడుపు తరుక్కు పోతుంది.

ఏదైనా బిజినెస్ చేసి నిశ్చింతగా సంపాయించుకో-గల ఆస్తి ఏ కరణమూ సంపాయించుకోలేదు

ఫలితం....

కన్ను పొడుచుకున్నా కానరాని
చీకటిలో
గాలికన్నా వేగంగా పరుగెత్తాలని
ప్రయత్నిస్తే
ఫలితం ఎదురు దెబ్బలే!

ఉచ్చం నీచం తెలియని
మూర్ఖునితో
వాదనలో గెలవాలని ప్రయత్నిస్తే
ఫలితం పరాభవమే!

అవినీతి అన్యాయం, అధర్మం
రాజ్యమేలుతున్నంత కాలం
ఈ స్వార్థ సమాజాన్ని
సంస్కరించాలని ప్రయత్నిస్తే
ఫలితం పరాజయమే.

– కె. శివకుమారి.

నలుగురిలో గౌరవంగా బ్రతుకుతూ గ్రామంలో ఒకరిగా కలిసిపోయి, 'పరపతి సంపాయించుకునే చతురతే కరణానిది.

"వాళ్ళకేం? గాదె కింద పందికొక్కుల్లా గ్రామంలో చెలాయించి, తెగ సంపాయించారు" అంటారు బయట వాళ్ళు.

అదొక అలవాటు. మమ్మల్నే కాదు. ఎవరినైనా.....-నిస్సహాయ స్థితిలో ఉన్న వాళ్ళను చూసి ఇలా అనటమే మన కలవాటు. నడి ఏట్లో మునిగిపోతున్న వాడికి చెయ్యందించి సహాయం చేసే వాళ్ళకన్నా......-మా బాగా అయింది అని సంతోషంతో నవ్వుకునే వాళ్ళే మనలో ఎక్కువ.

ప్రజల సంక్షేమంకోసం పాటు పడుతున్నా-మంటుంది ప్రభుత్వం. కరణాలు, వాళ్ళ కుటుంబాలూ ప్రజలలో ఒక భాగం కాదా? యువకులకు ఉద్యోగాలిస్తామంటోంది.....

నా కొడుకు, వాడిలాంటి ఇతరులు యువకులు కారా? వాళ్ళ సంక్షేమం ప్రభుత్వానికక్కర్లేదా? మేమంతా వేగా? ప్రజలనుంచి విడిపోయి, వేరే జాతికి చెందిన వాళ్ళమా?

ఏమిటో బాబూ...ఏదేదో చెప్పి నిన్ను విసిగిం-చేస్తున్నాను. కడుపులో ఆవేదన అణుచుకోలేక. ..-పిల్లల మొహాల్లో దీనత్వం చూడలేక . పువ్వు లమ్మిన ఊరిలో కట్టె లమ్మలేక, వాటిని తీసుకుని ఇంత దూరం నడిచి రాలేక....రాక తప్పక...ఇంత మెంటల్ టార్చర్‌ను హరాయించుకోగల వయసు బలమైనా లేక...అప్పు డప్పుడిలా బరస్టయిపోతుంటాను" అంటున్న కరణం మాటలకు కదిలిపోయాడు జయాకర్.

"మీరేం అనుకోకపోతే....." అన్నా డతను సంకోచంగా.

"చెప్పు బాబూ."

అయిదు వంద రూపాయల నోట్లు తీసి ఆయన చేతుల్లో పెట్టబోతూ "ఆ రోజు మీరు చేసిన సహాయానికి ఏ మిచ్చినా మీ రుణం తీరదు. అమ్మగారికీ, పిల్లలకీ ఏమైనా కొనివ్వండి. నేను మీ కొడుకులాంటి వాడి ననుకోండి" అన్నాడు జయాకర్.

ఆ నోట్లు తిరిగి అతని జేబులో పెట్టేస్తూ, "ఆ రోజు నీకు ప్రతిఫల మాసించి ఆతిథ్యమివ్వ లేదయ్యా నేనే ముష్టివాడిగా, మారాలనుకుంటే . నా కీ వయసులో ఈ పళ్ళపొడి వ్యాపారం, నా కొడుక్కు కూలీ పనీ ఎందుకు?

ఒకనాటి గ్రామాధికార్లమనే ఇమేజ్‌తో ముష్టి అయితే బాగనే ముడుతుంది

కానీ, మేము బిచ్చగాళ్ళం కాదు. ఎప్పటికీ కాబో ము కూడా

"విధి ఒక విష వలయం విషాద కథలకు అది నిలయం ." అన్నాడు కవి ఆ వలయంలో మాదో సరికొత్త కన్నీటి కథ" అంటూ వెళ్ళిపోతున్న కరణాన్ని చూస్తుంటే జయాకర్ కళ్ళలో నుంచి అశ్రు బిందువులు జలజలా రాలాయి కర్చీఫ్‌తో వాటిని అద్దుకుంటూ వికలమైన మనసుతో, అప్పుడే వచ్చి, ఆగిన బస్సులోకి ఎక్కాడతను. ☐

కొత్త శీర్షిక ప్రారంభం!

పిల్లలు వారి మానసిక ప్రవృత్తులు



డాక్టర్ (శ్రీమతి) జయానాగరాజ
మానసిక వేత్త

పిల్లలు - అవిధేయత

"అబ్బాయి బొత్తిగా మాట వినడంలేదండి... కొడితే మరీ బరితేరి పోతున్నాడు." అనడమో, లేక వాడిని సగర్వంగా చూస్తూ, "మా రఘు చాలా పెంకి.. ఇల్లుపీకి పందిరి వేస్తాడు... అల్లరి అంతా యింతా కాదు." అని పెంకితనం, అల్లరి, అతి తెలివి తేటలకు నాంది వాక్యం అన్నట్లుగా మరి కొందరు తల్లి దండ్రులుంటారు. కాని అది పెంపకదోషమని.

పుట్టకతోనే పిల్లలు "అల్లరి "గా పుట్టరని, క్రమ శిక్షణ లోపమని చాలా మంది పెద్దలకు తెలియదు. ముద్దు ముద్దుగా చంటాడు చదువుతున్న పేపరు చేతి నుండి లాగేసుకొని చింపినప్పుడు, చేతిలోని బంతి మీదకు విసిరి నాన్న తలబొప్పి కట్టిననాడు-కేరింతలు కొడుతున్న కొడుకును చూచి అనునయంగా ఆ వయస్సుకు తెలిసేటట్లు చంటాడు చేసిన పని మంచిది కాదని అతనికి తెలియ జెప్పే బదులు కొందరు తల్లి దండ్రులు యిలాంటి పనిచేసినప్పుడు పిల్లవాడిని ఎత్తుకొని ముద్దులాడుతారు. వాడి బాల్య క్రీడలను చూచి మురిసి పోతారు. అప్పటి నుంచి ఆ పిల్లవాడు యిటువంటి ఆగడం చేస్తే తల్లి దండ్రులు మెచ్చుకుంటారని పదే పదే అలాంటి పనులే చేసి "అల్లరివాడు" అనే బిరుదును పొందుతారు "తొండ ముదిరి వూసరవెల్లి అయినట్టు" ఏ విధానాలకు లొంగనిదై అందంగా వున్న ఈ "అల్లరి" ఎక్కువై, భరించరానిదై ఒక సమస్యగా తయారవుతుందీ అంటే అతిశయోక్తి కాదు. "మంచి చెడు," "చెయవచ్చు, చేయకూడదు" అనే విచక్షణా జ్ఞానాన్ని ఈ పిల్లలకు కలగ జేయక పోవడం తల్లి దండ్రుల పెంపకంలో లోపం...

మరో రకం తల్లి దండ్రులు, శైశవంలో చేసిన ప్రతి పనినీ విమర్శిస్తూ పిల్లవాడిని, కొట్టడం లాంటివి చేస్తారు. ఈలాటి తల్లి దండ్రులకు ఓపిక తక్కువ. అందుకే పిల్లల కార్య క్రమాలను వారికి విడమర్చి చెప్పి తీర్చి దిద్దలేరు. మంచికి చెడ్డకు పిల్లలను కొడుతూ వుంటే "శిక్ష" అంటే వారిలో భయం తగ్గి పోతుంది. "ఏముంది! మహా రెండు దెబ్బలేగా.." అని బరితేరి పోవడం జరుగుతుంది. అటుపై వారిని క్రమశిక్షణలోపెట్టడం కష్టం.. "మొక్కై వంగనిది మ్రానై వంగుతుందా" అన్నట్లు తయా రవ్వుతారీ పిల్లలు.

ఇంకో సంగతి.. చాలా యిండ్లలో "కోప్పడం" అనేది "క్రమ శిక్షణ"లో వుంచేది తండ్రి భాధ్యత అనే భావనతో"నాన్నారు రానీ నీ పని చెబుతా" అని తల్లి అనడం కద్దు.. దీనితో "తండ్రి" ఓ పెను భూతమని, తల్లి చేతకాని దద్దమ్మ అని ఆ పిల్లవాని మనస్సుకు తట్టు తుంది. చాలాసార్లు తల్లులు "వాళ్ల నాన్నగారు యింట్లో వుంటే కుక్కిన పేనల్లే వుంటాడు ఆయనటు వెళ్లగానే నన్ను రాచి రంపాన పెడతాడు." అని చాలా మంది అనడం మనకు పరిపాటి. అంటే బిడ్డ పెంపకం భార్యా భర్తలు సమంగా పంచుకోక తమ బాధ్యతలను మరచి పోతున్నారన్న మాట తల్లి తన మాతృత్వపు బాధ్యత నెరవేర్చు కోవడం లేదని తెలుస్తూనే వుంది.



కొందరు తండ్రులు తమ భార్య మీద వున్న అసంతృప్తిని వ్యక్త పరుస్తూ "అమ్మ కేమి తెలీదులే నే చెప్పినట్లు విను" అ ఆ తల్లిని పిల్లల ముందే కించ పరచడం జరుగుతుంది. దానితో పిల్లలు తమ తల్లి అమాయకురాలని ఆట పట్టిస్తారు. మాట వినరు.పెద్ద వారైన పిదప కూడా యిదే భావన కలిగి వుంటారు. మరి కొంత మంది తల్లులు "ఆడదాన్ని నా కేమి తెలుస్తుంది మీ నాన్న నడుగు" అని తమ వ్యక్తిత్వాన్ని, మనుగడను తమకు తామే కించ పరచుకుంటారు...పిల్లలకు అప్పుడు తల్లిపై గౌరవం తగ్గుతుంది.

మరో కోవకు చెందిన తల్లి దండ్రులు అతి ముద్దుతో "నాన్నను తిట్టు"... "అమ్మను దొంగ ముండ" అను అని చిన్నారి పిల్లవానితో వచ్చీ రాని మాటలతో అనిపించి ఆనందిస్తారు. అటుపై పెద్దవాడైన ఆ పిల్లవాడు ఆ అలవాటు నుంచి తప్పించుకోలేక పోతే మధన పడతారు. అతి ముద్దుతో తమ పిల్లలు ఏదడుగుతే అది తెచ్చి పెట్టడం "వద్దు. కాదు" అనే పదాలను వారి జీవితంలో నేర్పరు. అంతే గొంతెమ్మ కోరికలు వారు కోరుతూ, కోరికలు తీరక పోతే పెడ బొబ్బలు పెట్టి, ఏడ్చి, కాళ్ళు చేతులు కొట్టుకొని రభస చేసి తమ కోరికను తల్లి దండ్రులు నెంవేర్చకపోతే అది నెరవేర్చే దాకా పట్టలేని అల్లరి చేస్తారు. దీనిని "బాల్య కోపావేశం" (టెంపర్ టాన్ ట్రమ్స్) అంటారు. ఇది కూడా పెంపకలోపమే.

వుమ్మడికుటుంబం గనుక అయితే మనుమడంటే అతి గారాబం తాతయ్యకు నాన్నమ్మకు. వంశాంకురం, పున్నామన రకం నుంచి రక్షించే పురుషుడు, పుత్రుడున్నూ. ఇక తల్లి దండ్రులు ఏదైనా మందలించబోతే వారు అడ్డు తగిలి "పోనిద్దూ పసి వెధవ" అని అంటూ వాడిని వెనుకేసుకు వస్తారు. దానితో అమ్మ నాన్నల మందలింపు నుంచి తప్పించుకోవాలన్నా తనకు కావలసింది రాబట్టుకోవాలన్నా "చూడు తాతయ్యా..." అంటూనో, "నా కది కావాలి. యిప్పుడే కావాలి. అమ్మ కొన నంటోంది" అని ఫిర్యాదు చేయడం అలవాటు చేసుకొని తల్లి దండ్రుల మాటలు వినకుండాపోతారు. చెప్పిందంతా చేస్తూ కూర్చుంటే వారు ఏకు మేకై కూర్చుంటారు.

ఇలా నిత్య జీవితంలో జరిగే సంఘటనలే పిల్లల అవిధేయతకు దారి తీస్తుంది. ఇక వీటన్నిటికీ కారణం పెంపకంలో లోపం. క్రమ శిక్షణ తమ పిల్లలకు ఎలా నేర్పాలో తెలియక పోవడం అని వేరే చెప్పాలా? □

(పై వారం : పిల్లలు – అసూయ)

సీరియల్ శ్రావణి

మాడుగుల కృష్ణకుమారి

35

(గత సంచిక తరువాయి)

"హలో ! మీరా ?'' అన్నాడు స్నేహ పూర్వకంగా చెయ్యి చాస్తూ కైలాష్.

'' అవును మీరు ఎక్కడ వుంటారు '' అన్నాడు శేషు.

''సిటీలో రూమ్ తీసుకుని వుంటున్నాను. మీరు వీలయినప్పుడు ఒకసారి రండి.'' అన్నాడు చిరునవ్వుతో శేషుని ఆహ్వానిస్తూ.

''ఎంతమాట. ఎప్పుడో ఎందుకు ఇప్పుడే వస్తాను. మీతో స్నేహం పెంచుకోవాలని నాకుంది. మొదటిసారి చూడగానే నాకెందుకో మీరంటే అభిమానం కల్గింది.'' అన్నాడు శేషు.

''నాకూ అంతే'' అన్నాడు కైలాష్.

''అయితే ఒక్కమాట ఈ క్షణం నుంచీ మనిద్దరం ఒకర్ని మరొకరు మన్నించుకోవటం మానెయ్యాలి'' అన్నాడు శేషు.

''ఓ యస్.'' అన్నాడు చెయ్యి కలుపుతూ కైలాష్.

''ఈరోజు నుంచీ మనిద్దరం ప్రాణ స్నేహితులం'' అన్నాడు శేషు.

''అయితే నాదొక కోరిక. మన స్నేహాన్ని పునస్కరించుకుని నేనీరోజు పార్టీ ఇస్తున్నాను. కాదనకూడదు.''

''కాదనను. సరేనా'' అన్నాడు శేషు.

ఇద్దరూ కబుర్లుచెప్పుకుంటూ శేషు సైకిలు మీద పట్నం చేరారు.

హోటలులో అన్నీ ఖరీదయిన అయిటమ్స్ తెప్పించిన కైలాష్ బిల్లు కూడా తనే ఇచ్చాడు.

పీకలమొయ్యా తిన్నాడు శేషు.

బయటకు వచ్చాక ''ఎలావుంది మనపార్టీ'' అన్నాడు కైలాష్.

''బాగానేవుంది. కానీ చిన్న లోపం.'' అన్నాడు.

''ఏమిటో చెప్పు.''

''చెప్పమంటావా ?''

''ఊఁ ! చెప్పు'' అన్నాడు కైలాష్.

''నువ్వు పార్టీ అంటే మందు పార్టీ అనుకున్నాను గురూ కానీ తిండి పార్టీ చేశావు. ఏం నీకు మందు అలవాటు లేదా ?'' అన్నాడు శేషు.

''నువ్వా జాతివాడివి కాదేమో అనుకున్నాను. ఆ సంగతి ముందుగా తెలిస్తే ఆ ఏర్పాటు కూడా చేసేవాడిని'' అన్నాడు నొచ్చుకుంటున్నట్లుగా కైలాష్.

''బాధపడకు. మరొకసారి చేసుకుందాములే'' అన్నాడు శేషు.

జరిగిన కథ—7 బిడ్డలులేని శ్రీహరి, శ్రావణి దంపతులు డాక్టరు దగ్గరకు వెళుతారు. శ్రావణిని పరీక్షచేసి ఆమెకు పెళ్లికి ముందే బిడ్డలు పుట్టకుండా ఆపరేషన్ జరిగినట్లు చెపుతుంది డాక్టర్. శ్రీహరి శ్రావణిని పుట్టింటికి పంపించేస్తాడు. రైల్లో కూర్చొన్న శ్రావణి జరిగిపోయిన తమ తీయని దాంపత్య జీవితం గురించి తలపోయసాగింది. శ్రావణి తల్లితండ్రులను చేరుతుంది. కానీ జరిగినదాంట్లో తల్లితండ్రులకు భాగం ఉందని తెలుసుకొని ఇల్లు విడిచి వెళ్లిపోతుంది. ప్రాణం తీసుకోబోతున్న శ్రావణిని రక్షించిన స్త్రీ ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి ఆశ్రయం ఇస్తుంది. శ్రావణి తనకు ఆశ్రయం ఇచ్చిన స్త్రీ ప్రముఖ • రచయిత్రి ప్రమీలా కైలాష్ అని తెలుసుకొని ఆశ్చర్యపోతుంది. లక్ష్మయ్య దంపతులు శ్రావణి విషయాన్ని అల్లుడు శేషుకి చెప్తారు. ప్రమీల తన గత జీవిత చరిత్రను శ్రావణికి తెలియపరుస్తుంది. శ్రీహరి భార్యను పుట్టింటికి పంపాడేకాని ఆమె జ్ఞాపకాలను మరువలేకపోతాడు. శ్రావణి తన పెళ్లికి ముందు జరిగిన సంఘటనలు చెపూ్త తనను తన బావ ఏ విధంగా అల్లరి పెట్టిందీ ప్రమీలతో చెప్పసాగింది. శ్రావణి చెప్పినదంతా విన్న ప్రమీల ఆమె జీవితం నాశనం కావడానికి కారణం ఆమె బావే అని గ్రహిస్తుంది. ఎలాగైనా ఆమె బ్రతుక్కొక దారి చూపాలని నిర్ణయించుకొంటుంది. కైలాష్ తన స్నేహితుడైన శ్రీహరి భార్యే తనింట్లో ఉన్న శ్రావణి అని తెలుసుకొంటాడు. శ్రీహరి భార్య స్మృతులతో అశాంతి పాలవుతాడు. శ్రావణి సమస్యను భార్య ప్రమీలతో కలసి పరిష్కరించాలనుకొంటాడు కైలాష్. శ్రావణికి వైద్యం చేసిన శతభిషాచారి దగ్గరకు వెళుతాడు. అక్కడ శేషుని చూస్తాడు.

''నాకేంబాధ. ఒక బాటిల్ కొనేస్తాను. రూమ్‌కిపోయి త్రాగుదాం'' అన్నాడు.

శేషుకి డబ్బిచ్చి కొనుక్కురమ్మని తను దూరంగా బయటే నిలబడ్డాడు.

కైలాష్ వక్కపొడి కొనే నెపం మీద. అసలు సంగతి ఎవరయినా చూస్తే లేనిపోని గోలవుతుంది. ఆడే నాటకంలో కొంత డబ్బు ఖర్చు కూడా తప్పదు. ఎంత ఖర్చయినా వారు ఒకటి కావడమే తనకు కావల్సింది అనుకున్నాడు.

ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం వూరికి దూరంగా వున్న తన ఫ్రెండ్ రూముకి తీసుకువెళ్ళాడు.

''నువ్వు లక్షాధికారివన్నావు మరి ఈ గది ఒక్కటే వుందేమిటి ?'' అన్నాడు శేషు.

''ఆదా ! ఇది మన సీక్రెట్ రూమ్. బంగ్లాకి రేపు వెడదాం'' అన్నాడు. అలమర లోంచి సరంజామా బయటకి తీశాడు. తనే స్వయంగా బాటిల్ ఓపెన్‌చేసి ఇద్దరికీ గ్లాసుల్లో పోశాడు శేషు.

''నాకొద్దు ఫ్రెండు. తిండి ఎక్కువయింది మందుకి చోటు లేదని'' దూరంగా వుంచాడా గ్లాసుని కైలాష్.

''సరే ! ఈలోగానేను మొదలుపెడతాను'' అని శేషు త్రాగాడు.

ముక్కుమూసుకుని దూరంగా నిలబడ్డాడు ఆ వాసన భరించలేకపోతున్నాడు. తన ఫ్రెండ్ రమేష్ ధర్మమా అని ఈ రూమ్ దొరికింది. మళ్ళీ రేపు వాడు వచ్చేస్తాడు. ఆబగా ఇంకా ఇంకా త్రాగుతున్న శేషువంక జుగుప్సగా చూశాడు కైలాష్.

బాటిల్ మొత్తం పూర్తి చేసిన శేషు అస్తవ్యస్తంగా దొర్లుతూ నేలమీద పడి ఇష్టం వచ్చినట్లుగా వాగసాగాడు.

అక్కడనుంచి ఎప్పుడు వెళ్దామా అన్పించి కూడా తప్పనిసరి పరిస్థితి అవటంతో వుండలేక వుండిపోయాడు కైలాష్.

36

''వెరీగుడ్ ! అయితే కోటలో పాగా వేశారన్నమాటే'' అంది ప్రమీల.

''ఆహ ! ఎంట్రన్స్ దొరికింది. నాకేసు చెప్పాను. జరిగిపోయినట్లేనని హామీ ఇచ్చాడు. వాళ్ళ మాటలనుబట్టిచూస్తుంటే ఆ వైద్యుడికి కూడా భాగం వున్నట్లుగా వుందనిపిస్తోంది'' అన్నాడు కైలాష్.

''అన్పించటం కాదు. అసలు మూలమే వాడయి వుంటాడు. మరి మీరు ప్రస్తుతం మకాం ఎక్కడ పెట్టారు?'' అంది.

''రమేష్‌గాడి రూమ్‌లోనే. మన ప్రసాద్ వాళ్ళ తోట బంగ్లా అడిగాను. వాడు కూడా ఓ. కే. అన్నాడు. ఒకసారి రుచిమరిగిన కుక్క వదలదు అన్న సామెతగా నన్ను, నే ఖర్చుపెట్టే

డబ్బు వాలకం నిజంగానే, నేను లక్షాధికారినని నమ్మేశాడు పిచ్చి వెధవ'' అన్నాడు కైలాష్ నవ్వుతూ.

''వాళ్లేండి గొప్ప'' అంది ప్రమీల.

''విషయం మొత్తం జరిగింది జరిగినట్లుగా వాడి నోటి వెంబడి కక్కిస్తానుచూడు అతి తొందరలోనే'' అన్నాడు కైలాష్.

''అబ్బా! మీ కన్నిటికీతొందరే. సమయం చూసి తెల్సుకోండీ'' అంది.

''ఆ మాత్రం నాకు తెల్సు లేవోయి. ప్లాను చెప్పటం వరకే నీవంతు మిగిలింది నేను ఎలా చేసుకుపోతానో చూడు'' అన్నాడు.

37

''ఆడదాని గురించి నీ అభిప్రాయం ఏమిటీ ?'' అన్నాడు శేషుకు సిగరెట్ వెల్గిస్తున్న కైలాష్.

''అనుభవించిపారేసేదానిమీద అభిప్రాయం ఎందుకోయ్'' అన్నాడు ముక్కుల్లోంచి పొగ బయటికి తెప్పిస్తూ శేషు.

అతని మాటలకు కోపం వచ్చినా తమాయించుకుని—

''శతభిషాచారి ఎలాంటివాడో ?'' అన్నాడు ఈసారి.

''ఆ, అనుమానం ఎందుకు వచ్చింది?'' అన్నాడు శేషు.

''అబ్బే! నాపని ఏమవుతుందోనని అడిగాను అంతే'' అని సర్ది చెప్పాడు.

''ఆయుర్వేదంలో అయినా ఆయన వైద్యం పని చెయ్యకపోవచ్చు కానీ ఆడవాళ్లను వశం చెయ్యటంలో మాత్రం ఆయన దిట్ట'' అన్నాడు నమ్మకంగా.

''నీకు చాలాకాలం నుంచీ పరిచయం వున్నట్లుందే ?''

''మా పరిచయం చాలా గొప్పది. చెప్పినా నీకర్థంకాదు'' అన్నాడు శేషు.

'' అయితే చాలా గట్టిదే '' అన్నాడు కైలాష్.

''మరేమనుకున్నావు.''

''నే ప్రేమించిన అమ్మాయికి నామీద ఇష్టంలేదుకదా పోనీ వదిలేద్దామా అని ఒకొక్కసారి అన్పించినా, కానీ నాకది చేసిన అవమానం మాత్రం ఘోరం. ఆ పగ తీర్చుకుంటేకానీ నిద్రపట్టదన్పిస్తుంది.'' అన్నాడు కైలాష్ ముఖం ఎరుపు చేసుకుని.

''అద్గదీ! రెచ్చగొట్టిన ఆడదాన్ని, అవమానంచేసిన ఆడదాన్ని వూరికే వదలటం మన జాతికే అవమానం'' అన్నాడు కక్షగా శేషు.

''గతంలో నీక్కూడా ఏదన్నా కేసు తగిలిందేమిటీ ?'' అన్నాడు.

''తగలటము, అంతుచూడటంకూడా జరిగిపోయినాయి.'' అన్నాడు గతానుభవాన్ని నెమరు వేసుకుంటున్న శేషు.

బాటిల్లోని ద్రవం గ్లాసులోకి ఒంచి షోడా కలుపుతూ ''మరి నీకు ఫేమిలీ లేదా ?'' అన్నాడు శేషు చేతికి గ్లాసు అందిస్తూ.

''ఉన్నా, మన తిరుగుళ్లకి అడ్డువచ్చేరకం కాదులే'' అన్నాడు సిప్‌చేస్తూ.

''అయితే బాధలేదులే'' అన్నాడు.


''ఏంవశీకరణో ఏమిటో మళ్లీ వారం రోజులకు రమ్మన్నాడాయన. అవును దీనికిన్ని రోజులు ఆగడం ఎందుకసలు'' అసహనంగా అన్నాడు కైలాష్.

''తొందరపడకయ్యా. ఆయనీ వారం రోజులు పూజ చెయ్యాలి. ఆ తీర్థం ప్రసాదం నీకు ఇస్తాడు. అవి ఎలాగోలా అమ్మాయికి చేరేటట్లుగా చూడాలి. అప్పుడే అసలయిన కథ మొదలవుతుంది.''

''ఏ అమ్మాయికి ? అమాయకంగా అడిగాడు కైలాష్.''

''అదే నువ్వు ప్రేమించిన అమ్మాయికి.''

''అమ్మో! నా ముఖం చూస్తే నే



తిప్పకునే అమ్మాయికి అవి ఇస్తే పుచ్చుకుంటుందా ?''

''పుచ్చుకుంటుంది. పుచ్చుకునేటట్లుగా మనం చెయ్యాలి.''

''నాలాంటి అందగాడికి, ఆస్థిపరుడికి లొంగని పిల్ల కేవలం ఈ నీళ్లకి లొంగుతుందని నాకేం నమ్మకం కల్గటంలేదు. మంత్రాలకు చింతకాయలు రాలతాయనుకోవటం హాస్యాస్పదం'' నిరుత్సాహంగా అన్నాడు కైలాష్.

''అదే వద్దు. ఇప్పుడు నువ్వన్నట్లుగా మంత్రాలకు చింతకాయలు రాలతాయా అని. అవి రాలేతీరుతాయి. అవి, రాలించటంలోనే మన గురువు ప్రత్యేకత వుంది. చింతకాయలే కాదు, మంత్రాలకు మనుషులు కూడా వాళ్ళంతటవాళ్ళు నడిచి వస్తారు తెలుసునా ?

''ఏమో నాకేం నమ్మకం కల్గటం లేదు'' అన్నాడు.

''అలా వేగిరపడితే లాభం లేదు, కాస్త ఓపిక పట్టాలి. ఇలాటి విషయాలు గుట్టు చప్పుడు లేకుండా జరిగిపోవాలి.''

''అయితే ఆ తీర్థంలో అంత మహత్తు వుందా ?'' అన్నాడు కుతూహలంగా.

''మహత్తు అంటే మామూలుగా కాదు. ఆ తీర్థం పుచ్చుకున్నవాళ్ళు ఆయన పెట్టిన గడువులోగా సరాసరి మన దగ్గరకు వచ్చి కౌగిట్లో వాలిపోతారు. మనల్ని ఎంతగా ద్వేషించే వారయినా మనకి ఆ క్షణంలో బానిసలయిపోతారు.''

శేషుచెప్పేది ఎంతో ఆత్రంగా వింటున్నాడు కైలాష్.

''నువ్వు ప్రేమించిన అమ్మాయికి నువ్వంటే ప్రేమ వుందా ?'' అన్నాడు శేషు.

''నేను చెప్పిందేమిటి. నువ్వు అడిగింది ఏమిటి ?''

''పోనీ ద్వేషం వుందా ?'' అన్నాడు ఈసారి.

''ఆ, ప్రస్తుతం వుంది అదే నామీద'' దిగులుగా అన్నాడు కైలాష్.

''ఆ, అమ్మాయికి నువ్వంటే అయిష్టం కాబట్టి, ముందుగా నువ్వా అమ్మాయిదృష్టిలో మంచివాడిగా నిరూపణ కావాలి. అప్పుడుఏదన్నా జరిగినా అనుమానం నీమీదకు రాదు తెల్సునా. ఇలాటివన్నీ ముందు జాగ్రత్తకోసం అన్నమాట'' అన్నాడు.

''అయితే చాలా పకడ్బందీగా జరగాలన్న మాట'' అన్నాడు కైలాష్.

''మరేమనుకున్నావు ''

''ఏమో బాబు. దేముడు పంపినట్లుగా నువ్వు నాకు స్నేహితుడవయ్యావు. నాపని జరిగే వరకు నాకు తోడు వుండి అంతా సక్రమంగా జరిపించాలి.''

''సరేనని మాట ఇస్తున్నాగా. మనకిలాటి

తొందర వుండటం సహజమే. నేను కూడా నీలాగే తెగ ఆరాట పడేవాడ్ని'' అని నాలిక కొరుక్కున్నాడు.

''ఏమిటి నువ్వా ?'' అన్నాడు కైలాష్.

''అబ్బే ! అదేంలేదు.'' అన్నాడు మరొక మాట మారుస్తూ.

దారిలోకి వస్తున్నావులే అనుకుని చిన్నగా నవ్వుకున్నాడు.

38

ఆ రోజుకి వారంరోజులు పూర్తవటంతో ఎంతో ఆశగా శతభిషాచారి ఇంటికి వెళ్లాడు కైలాష్.

అప్పటికే అక్కడ శేషు వున్నాడు.

''ఎప్పుడు వచ్చావు ?'' అన్నాడు కైలాష్.

''నీకన్నా ముందువచ్చి గురువుగారితో నా తొందరగురించి చెపుదామని వచ్చాను'' అన్నాడు నవ్వుతూ.

అతని మాటలకు సిగ్గు నటించాడు కైలాష్.

మరొక పదినిముషాలకు పూజ అయిన గుర్తుగా గంట మోగింది.

పదమని శేషు లోపలికి నడిచాడు. అతని వెంటే కైలాష్‌కూడా మొదటిసారిగా వచ్చినపుడు ముందుగదిలో మాత్రమే కూర్చున్న కైలాష్‌కు ఏవో ఆయుర్వేద మందుల సీసాలు, పూర్వకాలపు జాడీలు తప్ప మరేంకన్పడలేదు. కొత్తవారికి, తొలిసారిగా వచ్చేవారికి శతభిషాచారి ఇల్లు ఒట్టి ఆయుర్వేద వైద్యుడి కొంపలాగే కన్పడుతుంది. కానీ అసలు కీలకం లోపల వుంది.

ఊరికి దూరంగా చేలమధ్యనున్న పెద్ద డాబాలో ఎన్నిగదులు వుంటాయో లెఖ్ఖలేదు. తను వైద్యమే కాకుండా, స్వంత మందుల తయారీ అని చెప్పటంతో చాలా ఇళ్లన్న మోతుబరి తన ఇంటిని ఊరికే దేముడిగా భావించిన వైద్యుడికి రాసిచ్చాడు.

మొదటిసారిగా శేషుతోపాటు లోపలికి అడుగుపెట్టిన కైలాష్ దిగ్భ్రమచెందాడు.

86 ఏళ్ళ విద్యార్థి?

పశ్చిమ జర్మనీలోని అతి ప్రాచీనమైన హిడెల్‌బర్గ్ విశ్వ విద్యాలయంలో అతి వృద్ధుడైన విద్యార్థి విద్యాభ్యాసం చేస్తున్నాడు. ఈ ముదుసలి విద్యార్థి వయసు 86 సంవత్సరాలు. ఈ వృద్ధాప్యంలో ఆయన న్యాయ శాస్త్రాన్ని అభ్యసిస్తున్నాడు. ఇదివరలో ఆయన థియాలజీ, తత్వ శాస్త్రం, వైద్య శాఖల్లో డాక్టరు పట్టాలను, ఆచార్య గౌరవాన్ని పొందాడు. ఈ విశ్వ విద్యాలయంలో మరొక అరుదైన సంఘటన కూడా జరిగింది. మరొక విద్యార్థి 31 సంవత్సరాల పాటు గణిత శాస్త్రాన్ని అభ్యసించి ఇటీవలే పట్టభద్రుడైనాడు.

(గ్లోబల్)

అటూ ఇటూ వరుసగా గదులు మధ్యలో పెద్ద చావిడి.

''ఆ గదుల్లో ఎవరుంటారు ?'' అన్నాడు ఆసక్తిగా కైలాష్.

''ఎవ్వరూ వుండరు. కుడివైపు గదుల్లో భూత వైద్యం, ఎడమవైపు గదుల్లో నాటువైద్యం, ముందు ఆయుర్వేదం. వెనుకవైపు మనలాటివారికి ప్రత్యేకవైద్యం.'' అన్నాడు శేషు నవ్వుతూ.

''జనం ఎవరూ లేరే ?''

''ఉదయంపూట మందులు, తీర్థాలు మాత్రమే ఇస్తారు. సాయంకాలం పూట ఒట్టి సంప్రదింపులు మాత్రమే. మరి కాసేట్లో జనాలు వచ్చేస్తారు. మనకి పూర్తి అధికారముంది ఇక్కడ'' అంటూ శేషు గదిలోకివెళ్ళాడు.

విశాలమైన మంచంమీద తెల్లని దుప్పటి పరిచి వుంది. దానిమీద మధ్యగా కూర్చున్న ఆచారి కైలాష్‌వంక చిరునవ్వుతో చూశాడు.

''నీ మీద నమ్మకం వలననే లోపలికి రానిచ్చారు'' అని సన్నగా అన్నాడు శేషు.

గది నలుమూలలా పరికించి చూశాడు కైలాష్. ఎక్కడా పూజ జరిగిన చిహ్నాలు కనపడలేదు. ఎవరో ఉన్నవాడు ధర్మంగా ఈ ఇల్లు రాసిచ్చాడు. ఊరికి దూరంగా వుండటంతో వీడు చేసే వెధవ పనులు ఊరి ప్రజలకు తెలియటములేదు. గాలికి, అగ్ని తోడయినట్లు వీడికి శేషు కూడా తోడయ్యాడు. వీళ్ళనిమాత్రం పోలీసులకి పట్టించక తప్పదు అనుకున్నాడు కైలాష్.

''ఏమిటాలోచన ?'' అడిగాడు ఆచారి భృకుటి ముడేస్తూ.

''అతడి ధ్యాసంతా ఆ అమ్మాయిమీదనే వుంది'' అన్నాడు సమాధానంగా శేషు.

''ఒకపని సాధించాలని పట్టుపట్టినప్పుడు దృష్టి అంతా దానిమీద ఉండటం మంచిదేగా''

''నా పని'' అన్నాడు ఆరాటంగా కైలాష్.

''జరుగుతుంది'' శతభిషాచారి అన్నాడు.

''మరి, మీరీరోజు రమ్మన్నారు.''

''కానీ కొన్ని కారణాలవలన అది వాయిదా పడింది. రేపు అమావాస్యనాడు నీకు ముహూర్తం పెట్టాను'' అన్నాడు.

''అవును ! ఇంతకీ నువ్వు ఇష్టపడ్డ పిల్లపేరు'' అన్నాడు చటుక్కున.

ఊహించని ప్రశ్నకు తత్తరపడిన కైలాష్ అదేమీ కన్పడనీయకుండా, ఎందుకయినా మంచిదని ఒక్క నిముషంపాటు ఆలోచించి ఆలోచించి ''ప్రమీల'' అన్నాడు.

''ప్రమీలా'' అని ఆ పేరుని రెండుసార్లు ఉచ్చరించాడు ఆచారి.


''ఈసారి మళ్ళీ వాయిదా వెయ్యకండి గురువుగారు. మా మిత్రుడే జాప్యాన్ని భరించలేక పోతున్నాడు'' అన్నాడు శేషు.

ఇప్పుడు... మీ చర్మ సమస్యలను కడిగి పారవెయ్యండి...
మీ చర్మానికి శుభ్రమైన, ఆరోగ్యవంతమైన నిగనిగ ఇవ్వండి.



Godrej నిమిన్

శుద్ధమైన వేపనూనె యొక్క సహజ సద్గుణాలు కలిగినది.




నీమ్, మర్గోసా అన్న పేర్లతో పిలువబడే వేపచెట్టు, చర్మ సంబంధ సమస్యలకై నవజాతికి ప్రకృతి ప్రసాదించిన వరాలలో ఒకటి. వేపనూనెను క్రమం తప్పకుండా వాడితే, అది మీ చర్మం నునుపుగా, తేటగా ఉండడానికి తోడ్పడుతుంది.

గోద్రెజ్, శుద్ధమైన వేపనూనెను చేర్చి రూపొందించిన సబ్బు, నిమిన్— మీ చర్మ సమస్యలను కడిగి పారవేసే లగ్జరీ టాయిలెట్ సోపు. ఈ గోద్రెజ్ నిమిన్ మరింతకాలం మన్నుతుంది. ఎందుకంటే ఇది ఇతర కొన్ని మర్గోసా సబ్బులవలె మెత్తబడిపోదు.

నిమిన్—మీ అంత శ్రద్ధగా మీ చర్మాన్ని కాపాడే సబ్బు.

CHAITRA-B G 230 TEL



''ఆ మాట మాకు ప్రత్యేకంగా చెప్పాలా'' అన్నాడు.

ఇంతలో బయట నుంచి పిల్లల ఏడుపులు మనుషుల మాటలు వినపడటంతో నాకు వేళయిందని చటుక్కున లేచివెళ్లాడు ఆచారి.

''మనం వచ్చేసరికి గంట చప్పుడయింది మరి పూజ చేసిన చిహ్నాలు కన్పడవేం ?'' అన్నాడు అనుమానంగా కైలాష్.

''పిచ్చివాడా అది బయటవాళ్ల నమ్మకం కోసం మాత్రమే. ఆ వేళపుడు ఆయన పూజ చెయ్యడు గంజాయిదమ్ము తప్ప. ఉదయంపూట పూజ మానమన్నా మానడు.''

''ఆయన గంజాయి ... ఆశ్చర్యంగా అడిగాడు కైలాష్.

''ఆయన మాత్రం మనిషి కాదా ? కోరిక లుండవా ?''

''ఉంటాయనుకో కానీ వైద్యుడిగా అని ఏదో అనబోయి ఆయనసంగతి మనకి ఎందుకులే'' అన్నాడు తన పని ఎప్పుడు జరుగుతుందా అని ఆలోచిస్తూ.

39

ఆరోజు శేషు ద్వారా ఎలా అయినా జరిగింది రాబట్టాలని గట్టిపట్టుపట్టిన కైలాష్ అతను రాగానే-

''ఇవాళ మా బిల్డింగ్‌కు తీసుకువెడతాను'' అన్నాడు.

''అయితే ఈగది వదిలేస్తున్నామన్నమాట'' హుషారుగా అన్నాడు శేషు

తోటలో వున్న అతని బిల్డింగ్ చూసిన శేషు అట్టే నోరు తెరుచుకుని చూస్తూ వుండి పోయాడు.

హాలంతా తివాసీ పరిచివుంది. గోడలకు అందమయిన పెద్దపెద్ద ఆయిల్ పెయింటింగ్స్ వ్రేలాడుతున్నాయి. హాలు గుమ్మాలకు, కిటికీలకు సిల్కు కర్టెన్స్ వున్నాయి.

''ఇది నీ స్వంతమేనా ?'' అన్నాడు శేషు.

శ్రావణి

''ఇలాటివి మరొక నాలుగున్నాయి'' అన్నాడు విలాసంగా కైలాష్.

''మనుషులు ఎవరూ వున్నట్లులేదే ?'' అన్నాడు లోపలికి చూస్తూ.

''అవును ! ఇక్కడ ఎవ్వరూ వుండరు. నాకు రావాలన్పించినప్పుడు ఒంటరిగావచ్చి ఇక్కడ గడుపుతూ వుంటాను.''

ఆ ఇంటి హోదా కళ్లారాచూసిన శేషు, ఎలాఅయినా కైలాష్‌ను వదలకూడదని అనుకున్నాడు.

ఫ్రిజ్ తెరిచి రెండు బాటిల్సు బయట పెట్టి ఈరోజు నీ ఇష్టం వచ్చినంత త్రాగు అన్నాడు కైలాష్.

శేషుకు అంతా ఉక్కిరిబిక్కిరిగా వుంది. ఎక్కడో పల్లెటూరిలో పొలం చేసుకునే తనకి ఎంత దర్జా, గౌరవం ఇచ్చాడీ కైలాష్. మనసు లోనే కైలాష్‌కు కృతజ్ఞతలు చెప్పుకుని ప్రారంభోత్సవం చేశాడు.

టేపు రికార్డర్‌లోంచి నాడియాహసన్ గొంతు స్వీట్‌లో విన్పిస్తోంది.

''నువ్వు ప్రేమించిన అమ్మాయిని వాడుకుని వదిలేస్తావా లేక పెళ్ళికూడా చేసుకుంటావా ?'' అన్నాడు శేషు.

''నాకా అమ్మాయంటే వేరే భావం లేదు. అందుకే పెళ్ళి చేసుకుంటాను'' అన్నాడు కైలాష్.

''నాకొక అనుమానం ఇంత అందం, ఆస్థి అంతస్తు, వున్న నిన్ను ఆ అమ్మాయి ఎందుకు తిరస్కరించిందో చెపుతావా ?'' అన్నాడు ముద్దగా.

''అన్నీ అర్హతలు వుంటే మాత్రం ప్రేమించాలని ఏముంది. అన్నిటికన్నా ముఖ్యమయినది మనసు వుండాలిగా. అక్కడికీ అభిమానం వదిలి ఒకసారి నా అభిప్రాయం వెల్లడిచేశాను.''

''ఏమంది ?'' ఆత్రుతగా అడిగాడు శేషు.

''మళ్ళా ఆ మాటడిగితే చెప్పుచ్చుకుని కొడతానంది'' అన్నాడు.

గతంలో తనకు జరిగిన అదే పరాభవం గుర్తుకువచ్చిన శేషు ముఖం పాలిపోయింది. కాని తను చేసిన పరాభవం కూడా గుర్తుకుతెచ్చుకుని గర్వంగా నవ్వాడు.

''ఎందుకా నవ్వు ?'' అన్నాడు.

''చెపుతాను ! అవమానించిన ఆడదాన్ని అనుభవించిపారెయ్యాలి కానీ ప్రేమా, పెండ్లి అని నువ్వు తెలివితక్కువగా ఆలోచిస్తున్నావు'' లన్నాడు.

''అంతే నంటావన్నమాట'' అన్నాడు కైలాష్.

''కాకపోతే ఏంచేస్తావు. వాళ్ళు మనల్ని నలుగురెదుటా అవమానిస్తే వాళ్ళని మనం చాటుగా దెబ్బతియ్యాలి. అక్కడుంది మజా.''

''అదెలా ?''

''నువ్వొత్తి అమాయకుడివి. పాపం నీకేం తెలియదసలు. నీలాగే నాక్కూడా ఒక కేసు తగిలింది. దాన్నెలా చేశానో చెపుతానుండు'' అన్నాడు ఉత్సాహంగా.

''నీలాగా నాకు సలహాలు చెప్పేవాళ్ళేలేరు. నువ్వే ఏదో ప్లాన్ చెప్పు'' అన్నాడు కైలాష్.

త్రాగుడు మైకం ఎక్కువయిన శేషు ''అయితే నేను చేసిన ఘనకార్యం చెప్పమంటావా ?'' అన్నాడు మత్తుగా.

''చెప్పు.''

''అయితే చెప్పక తప్పదంటావన్నమాట'' అన్నాడు.

''అవును'' అన్నాడు కైలాష్.

''అయితే చెప్పేస్తున్నాను. జాగ్రత్తగా విను.

''ఊఁ,'' అన్నాడు కైలాష్.

''అయితే చెపుతున్నాను. జాగ్రత్తగా విను'' అన్నాడు మళ్ళీ.

''ఇప్పటికి ఎన్నిసార్లు ఆమాట చెపుతావు. ఏదో నువ్వు చేసిన ఘనకార్యం విని నేను కూడా నీ మార్గం అనుసరిద్దామని'' అన్నాడు కైలాష్.

''శభాష్ అయితే విను మన ఘనత,'' అని చెప్పటం మొదలుపెట్టాడు శేషు.

టేపురికార్డర్ ఆపుచేసి ఎంతో ఆతృతగా శేషు చెప్పేదానికోసం ఎదురు చూస్తున్నాడు కైలాష్.

40

నాకు నా భార్యతో పెళ్ళయింది కానీ నా దృష్టి మొదట్నించీ నా మరదలు శ్రావణి మీదనే వుండేది. దానికి మాత్రం ఆ దృష్టి లేదు. నా భార్య ఇంట్లో లేనప్పుడు ఒకటి, రెండుసార్లు నా అభిప్రాయం పరోక్షంగా బయటపెట్టాను. కానీ అది అర్థం చేసుకోలేదు. పైపెచ్చు దానికి కాస్త పొగరెక్కువ. ఎంత మాట పడితే అంత మాట అనేది. నాకు పిల్లలు పుట్టని కారణంగా మరదలిని ఇచ్చి పెళ్ళి చెయ్యమని అడుగుదామంటే ధైర్యం చాలలేదు. మా అత్తమామల, దృష్టిలో నేను చాలా యోగ్యుడిని. అలాంటి యోగ్యతను పోగొట్టు కోవటం నాకిష్టంలేదు. అందుకే చాటుగా దెబ్బ తియ్యాలనుకున్నాను. డొంకతిరుగుడు వ్యవహారం లాభంలేదని ఒకసారి తెగించిన ఫలితంగా మరదలి చేతిలో భంగపడ్డాను. సమయానికి అత్త మావలు వచ్చినా ఏదోవంకతో అదే సర్దిచెప్పింది. అప్పటినుంచీ నాకు కోరికతో పాటు, పగ కూడా పెరిగింది.

ఏపుగా పెరిగినదాన్ని చూస్తుంటే నా మనసుకు కళ్ళాలు వుండేవికావు. మొదటిసారిగా మంచిగా చెప్పాను నాకు లొంగిపొమ్మని, ఎదురు తిరిగేసరికి తన వాళ్లనందరిని చంపేస్తానని, నా భార్యను ఏలుకోనని అప్పుడు ఎలాఅయినా దక్కుతావని బెదిరించి కొంతకాలం గడువు పెట్టాను. దాంతో నిజంగా బెదిరిపోయింది.

కానీ ఇంతలో ఏమొచ్చిందో ఏదోపట్టి నట్లుగా తయారయ్యింది. నన్నుచూస్తే చాలు మరీ విరుచుకుపడేది.

శతభిషాచారిగారు తీర్థం ఇచ్చినా, విభూది పెట్టినా సర్వరోగ నివారిణి అని మా వూరి వాళ్లకి ప్రగాఢ నమ్మకం.

పైకి వైద్యుడిగ మాత్రమే వూరందరికి తెలుసు. కానీ ఆయన వెనక వున్న సంగతులు నాకు తెలుసు. అందుకే శ్రావణిని ఆయన దగ్గరకు తీసునువెళ్లే ముందురోజే నేను వెళ్లి నా గోడు ఆచారిగారికి విన్నవించుకున్నాను. నే చెప్పినదంతా విని ఆయన ...

''అయితే ఏమంటావు ? '' అన్నాడు.

''రేపా అమ్మాయిని మీదగ్గరకు తీసుకు వస్తారు. మందే ఇస్తారో, మహత్యమే చూపిస్తారో, నాకు లొంగేటట్లుగా చూడండి ఏంచేసినా మీరే చెయ్యాలి'' అని శతభిషాచారి రెండు కాళ్లు పట్టుకున్నాడు శేషు.


''నువ్వింతగా ప్రాధేయపడుతున్నావుకాబట్టి నాదగ్గరున్న వశీకరణ మూలికతో ఆ అమ్మాయిని నీ వశం చేస్తాను. మరి నా సంగతి'' అన్నాడు ఆచారి.

''దేముడికి నైవేద్యం పెట్టాకే మిగిలిన ప్రసాదం భక్తుడిది'' అన్నాడు శేషు.

''శభాష్ ! నిజమయిన శిష్యుడవంటే నువ్వే. ఇకచూడు నా తడాఖా'' అన్నాడు మీసం మెలివేస్తూ ఆచారి.

ఆచారిగారి అభయం విన్నతరువాత నా మనసులో పగ కొంతవరకు చల్లారింది. మర్నాడే మా మావగారు శ్రావణిని వైద్యం నిమిత్తం తీసుకువెళ్ళారు.

(ఇంకా ఉంది)



జి. వి. కె. – అనంతపురం

చుండ్రు వలన తల దువ్వినపుడు వెంట్రుకలు రాలిపోవుచున్నవి. నివారణకు ఏమి చేయాలి? చుండ్రు వున్నప్పుడు తలకు నూనె పట్టించుకోకూడదు అంటారు. అది ఎంతవరకూ నిజం? చుండ్రు శాశ్వత నివారణకు ఏమి చెయ్యాలి?

★ మీరు వారానికి ఒకసారి సెల్‌సమ్ (సెలీనియం సల్ఫైడ్) షాంపూ వాడండి. ఈ షాంపూ కళ్ళలో పడకుండా చూసుకోవటం అవసరం.

తల నూనెకీ చుండ్రుకీ సంబంధం లేదు. లోనికి తీసుకోగలిగిన మందులవల్ల లాభం లేకపోయినా, ఫల్విన్-ఎం-గ్రైసోవిన్ మొదలయిన మాత్రలను వాడటంవల్ల కొంత వరకు త్వరగా నయమయ్యే అవకాశం ఉంది. వీటిని రోజుకి 6 వంతున (పూటకి రెండు) వరుసగా 20 రోజులు వాడవలసి ఉంటుంది.

పి. కె. పి. – విశాఖపట్నం

చిరు నవ్వులోనే ఉంది అందమూ, ఆరోగ్యమూ అంటారు కదా! నా దంతాలు వికృతంగా అడ్డ దిడ్డంగా ఉంటాయి. చిరునవ్వు నవ్వే అదృష్టంలేదు. మానసికంగా ఎంతో కృంగిపోతున్నాను. నా ప్రస్తుత వయస్సు 18 సం. లు.

★ మీరు మెడికల్ కాలేజీలలో దంత వైద్య విభాగంలో గాని, డెంటల్ కాలేజీలలో గాని పరీక్షింప చేసుకొని, తగిన సలహా పొందటం మంచిది. అదనంగా లేక వికృతంగా పెరిగిన దంతాలను తొలగించి, మిగతా వాటిని ఒక వరుస క్రమంలో దగ్గరకు తీసుకు వచ్చే పద్ధతులు చాలా చోట్ల ఈ చికిత్స చేయబడుతున్నది.


జె. వై. కె. – విజయవాడ

నాకు కలర్ గుర్తించటం రాదు. బ్రౌన్, గ్రీన్, బ్లూ మొదలయిన రంగులని విడివిడిగా గుర్తు పట్టడం రాదు. ఏ విధంగా అలవర్చుకోవాలి?

★ మీరు నేత్ర వైద్య నిపుణులను కలుసుకొని సంప్రదించవలసి ఉంటుంది. □

ఇంత కంటే ఏం చేయను?

విశ్వభరత్



ఆకాశం నలుపు రంగు పులుముకున్నట్లుంది.

రంగారావుగారు వేగంగా అడుగులు వేస్తున్నాడు. స్ట్రీట్ లైట్స్ వెలుగు చీకటిని పూర్తిగా తొలగించలేక పోతోంది.

'ఏ క్షణానయినా వర్షం వచ్చేలాగా వుంది. త్వరగా యిల్లు చేరుకోవాలి' అనుకున్నాడు రంగారావుగారు.

"బాబూగారూ! వర్షం వచ్చేత్తా వుంది.....రిక్షా ఎక్కండి."

గంట మోగిస్తూ అన్నాడో రిక్షావాలా. రంగారావుగారు అవసరం లేదన్నట్లు చెయ్యి వూపి ముందుకు నడిచాడు.

"ఎందుకురా, బసవయ్యా! ఆ అయ్యగార్ని రిక్షా ఎక్కమని అడుగుతావు? నే నిక్కడ పదేళ్లనుండీ రిక్షా వేస్తున్నాను. ఒక్క రోజైనా ఈ అయ్య నా బండి కాదు గదా, ఏ రిక్షా ఎక్కలేదు...." వినిపించింది యింకో రిక్షావాలా కంఠం.

రంగారావుగారు నవ్వుకున్నాడు. వీళ్ళ కెందుకో యింత బాధ? ఈ రిక్షా వాళ్ళకే కాదు, తను ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆఫీసులోనూ అంతే!

తన నొక పిసినిగొట్టు క్రింద లెక్క వేసేశారు. పైసా కూడా ఖర్చు చేయడనీ, పిల్లికి కూడా బిచ్చం వేయడనీ తనన్ని గురించి నవ్వుకునేవారు.

ఎవరెలా హేళన చేసినా, నవ్వుకున్నా తను లెక్క చేయలేదు. తన ధ్యేయం ఒక్కటే తనలాగా తన కొడుకులు గుమాస్తాలు కాకూడదు. అందుకనే ఉద్యోగంలో చేరినది మొదలు నడిచే ఆఫీసుకు వెళ్ళి వచ్చేవాడు. ఏనాడూ రిక్షా కాని, సిటీ బస్ కాని ఎక్కలేదు.

మధ్యాహ్నం లంచ్ టైములో కాఫీ అయినా త్రాగేవాడు కాదు. సాయంత్రం యింటికి వచ్చాకనే కాఫీ త్రాగేవాడు. తన జీవితంలో చూసిన సినిమాలు రెండే రెండు. ఒకటి నాగయ్యగారి త్యాగయ్య. రెండోది మల్లీశ్వరి! మళ్ళీ అలాంటి సినిమాలు రాలేదు. తనూ చూడలేదు

ఎంత తక్కువలో వీలయితే, అంత తక్కువ ఖరీదులో బట్టలు కుట్టించుకునేవాడు ఇంట్లో ఖర్చుకు కూడా డబ్బు తూచి తూచి యిచ్చేవాడు. పాపం, లక్ష్మి కూడా ఎంతో పొదుపుగా యిల్లు గడిపేది. అవి కావాలి, ఇవి కావాలనేది కాదు.

లోకం తనని పిసినారి అంటేనేం, కొడుకు లిద్దర్నీ ప్రయోజకులని చేశాడు చివరగా పుట్టిన ఒక్కగానొక్క ఆడపిల్లని తగిన కట్నం యిచ్చి పెళ్ళి చేశాడు బాధ్యతలు తీరాయి. వయసు పుడిగిపోయింది రిటైర్ అయిపోయి పెన్షన్ డబ్బుతో కాలక్షేపం చేస్తున్నాడు.

రంగారావుగారు ఎంత వేగంగా నడిచినా, వర్షం ఆయన యిల్లు చేరే దాకా ఆగలేదు తడిసిపోయి యింటికి చేరిన తండ్రిని చూశాడు కరుణాకరం

'రిక్షాలో రాలేకపోయావా, నాన్నా' అన్నాడు తండ్రి స్వభావం తెలిసినా.

రంగారావు నవ్వి, షర్టు విప్పి లోపలికి నడిచాడు. లుంగీ కట్టుకుని, తెచ్చిన కూరల సంచీతో వంట యింట్లోకి చేరాడు

"నేను కూరలు తరిగి యిస్తాను." అన్నాడు అప్పుడే స్నానం చేసి వస్తున్న రెండో కొడుకు సుధాకరం.

'ఎందుకురా, నేను చేయగలను...నువ్వెళ్ళి కూర్చో.." అంటూనే కత్తిపీట తీసుకున్నాడు రంగారావుగారు.

క్షణం ఆగి, నెమ్మదిగా అన్నాడు సుధాకరం 'నాన్నా! వదిన్ని తీసుకువస్తే ఈ వయసులో నీకీ



ఇటీవల భారతీయ స్టేట్ బ్యాంకు తిరుపతి ప్రాంతీయ కార్యాలయంలో అధికార భాషా సప్తాహం సందర్భంగా కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు బ్యాంకు ప్రతినిధులచే సన్మానం అందుకుంటున్న దృశ్యం. చిత్రంలో కుడి వైపు చివర వార భారతీయ స్టేట్ బ్యాంకు ప్రధాన ప్రాంతీయ అధికారి శ్రీ కె. శంకర నారాయణన్.

అవస్త వుండదుకదా?'

తండ్రి సమాధానం కోసం ముందు గదిలో కూర్చున్న కరుణాకరం కూడా చెవులు రిక్కించాడు.

ఎప్పటిలా మౌనం వహించిన తండ్రినేమీ అనలేక సుధాకరం విసుగ్గాలేచి ముందు గదిలోకి వచ్చేశాడు.

"ఈయనగారు బ్రతికుండగా వదిన కాపురానికి రాదు రానివ్వడు! మన ఖర్మ లింతే!" తండ్రికి వినిపించనంత చిన్న కంఠంతో అనేసి వార పత్రిక అందుకున్నాడు సుధాకరం.

నిట్టూర్పుని అణచుకున్నాడు కరుణాకరం. పైకి జీవం లేని నవ్వొకటి పెదవులపై దొర్లించాడు.

* * *

"రంగారావ్!

నీకు త్వరలో చావు తప్పదు!"

కవరు చించిన రంగారావు తెలుగులో టైప్ చేయబడిన ఆ రెండు వాక్యాలూ చదివి తెల్లబోయాడు.

ఎవరు వ్రాశారీ ఉత్తరం? సంతకం లేదు. పావు తావు తెల్ల కాగితాన్ని సగం చేసి, దానిమీద టైప్ చేశారు.

"నీకు త్వరలో చావు తప్పదు!"

అంటే తనని చంపేస్తారా? ఎవరు? తన మీద అంత కక్ష ఎవరికి వున్నది? తనకి శత్రువు లెవరున్నారు? తనకేమీ ఆస్తి లేదు. తనకి శత్రువులుండే అవకాశం లేదే?

ఉద్యోగం చేసినంత కాలం తనెవర్నీ ఏవిధంగానూ బాధ పెట్టలేదు. తన తోటి గుమాస్తాలు లంచం చేతిలో పడనిదే ఫైళ్ళు ముట్టుకునే వారు కాదు. తనెప్పుడూ ఎవర్నీ లంచం అడగలేదు. బయట ప్రపంచంలో కూడా తనకి ఎవరితోనూ స్నేహాలు లేవు. పరిచయాలు కూడా అంతంత మాత్రమే. తన కంటే ముందే రిటైర్ అయిన కోదండంతో మాత్రం కొంచెం స్నేహంగా వుండేవాడు.

ఒకసారి వాడు రెండు వందల రూపాయలు అప్పు

ఇంతకంటే ఏం చేయను ?

అడిగితే తను యివ్వలేదు. యివ్వలేదని వాడికి చాలా కోపం వచ్చింది. కాని అదెప్పటి విషయం? మూడేళ్ళనాటి సంగతి! ఆ కోపం యింకా మనసులో వుంచుకుంటాడా? కక్షగా యిలా బెదిరిస్తూ ఉత్తరం వ్రాస్తాడా? ఛ....ఛ....ఎవరికయినా చెబితే విని నవ్వుతారు!

ఎంత ఆలోచించినా తన మీద కక్షవున్న తన శత్రువు ఎవరో అంతుబట్టలేదు.వృధాగా తమ బుర్ర చెడగొట్టుకుంటున్నాడు. ఇది ఎవరో హాస్యానికి రాసి వుండాలి.

రంగారావుగారు చిన్నగా నవ్వుకుని, కవరూ, ఉత్తరమూ దాచేసి, దుప్పటి మెడదాకా కప్పుకుని కళ్ళుమూసుకున్నారు.

* * *

చెప్పులు బల్లకిందకు తోస్తూ, "జ్యోతీ! కాసిని మంచినీళ్ళు యివ్వమ్మా!" అన్నాడు రామచంద్రమూర్తి. షర్టు విప్పి హేంగర్‌కి తగిలించి, లుంగీ తీసుకున్నాడు

"అబ్బ! ఈ రోజు ఆరుగంటలు కావస్తున్నా ఎండవేడి తగ్గలేదు కదూ?" అడిగాడు చెల్లెల్ని.

ఆమెనుంచి జవాబు రాక పోవటంతో పక్కకు తిరిగి చూశాడు జ్యోతి కూర్చున్న చోటునుంచి కదలలేదు. ఆమె చూపులు ఎటువైపు నిలిచాయో చూశాడు మూర్తి.

ఎదురింటి నవదంపతులు చక్కగా ముస్తాబై సినిమాకు కాబోలు బయల్దేరారు. అతను స్కూటర్ స్టార్ట్ చేస్తున్నాడు ఆమె మురిపెంగా భర్తవైపు చూస్తోంది. అతను సైగ చేయగానే వెనుకసీటు మీద కూరుచంది. స్కూటర్ కదిలి ముందుకు వెళ్ళిపోయింది

చిన్నగా నిట్టూర్పు వదులుతూ జ్యోతిని సమీపించి ఆమె తలపై చెయ్యివేశాడు ఉలిక్కిపడి తలెత్తి అన్నగారి కళ్లల్లోకి చూసి చటుక్కున తల దించుకుంది. ఆ కళ్లల్లో నీళ్ళు మూర్తి దృష్టిని దాటిపోలేదు

కుర్చీలోనుంచి వంటగదిలోకి వెడుతూ "కాఫీ తెస్తాను" అంది జ్యోతి. ఆ కుర్చీలోనే కూలబడి, తలవెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాడు మూర్తి.

జ్యోతి మనసులో ఆవేదనా, తన మనసులో దిగులూ ఒక్కటే! అదే జ్యోతి సంసారం గురించి!

పెళ్ళయిన ఏ నవ వధువుకు వుండదు భర్తతో అలా సరదాగా సినిమాలకు, షికార్లకూ వెళ్లాలని? కాని, జ్యోతి ఆ కనీస అదృష్టానికి కూడా నోచుకోలేదు

తన తండ్రి బ్రతికుండగానే జ్యోతి పెళ్లి చేశాడు సంబంధం కూడా మంచిదే జ్యోతికి అత్తగారులేదు. ఆడపడుచుకి పెళ్లి అయిపోయింది. ఒక్క మరిది మామగారికి పిసినారి అని పేరున్నా అందువల్ల జ్యోతికి వచ్చే నష్టం ఏముందన్నారు అందరూ. కాని అదే యిప్పుడు జ్యోతి పెళ్ళయి కూడా కాపురానికి వెళ్లకుండా ఆటంకమయింది

"కట్నం బాపతు డబ్బు సగమే సమకూడింది. మిగిలింది తన పెన్షన్ కాగితాల పని పూర్తి కాగానే యిస్తానని ఒక్కపదిరోజులు గడువు చాలని' నాన్న వెళ్లి జ్యోతి మామగారితో చెప్పాడు. పాపం. ఆయనా కాదనలేదు పెళ్లి సలక్షణంగా జరిగిపోయింది. అందరూ జ్యోతి అదృష్టాన్ని పొగిడారు

'మిగిలిన కట్నం డబ్బుతోనే జ్యోతిని తన ఇంటికి పంపమని, ఆ తరువాతనే మిగిలిన శుభకార్యం జరుపవచ్చునని 'జ్యోతి మామగారు' నిక్కచ్చిగా చెప్పేశారు

నాన్న అధైర్యపడలేదు. 'ఎంత? ఒక్కపది రోజులేకదా? పోనీ ఈ పది రోజులూ నా చిట్టి తల్లి నాకళ్ల ముందు వుంటుంది,' అన్నారు. కాని వెదుక్కుంటూ వచ్చిన అదృష్ట దేవత వెనక్కి మళ్లింది ఆ పది రోజులలోనే.

అకస్మాత్తుగా నాన్న ఆరోగ్యం తిరగ బెట్టింది. ఆపరేషన్ చేయాల్సిందే అన్నారు రావల్సిన డబ్బు రానే వచ్చింది ఆపరేషన్‌కి ఖర్చయిపోయింది. అటు జ్యోతి కాపురం కూలిపోయింది. ఇటు నాన్నా దక్కలేదు!

వియ్యంకుడు పోయాడని తెల్సి చూడటానికి వచ్చాడు జ్యోతి మామగారు. తనకి రెండు సానుభూతి మాటలు చెప్పి, 'కట్నం బాపతు డబ్బు యిస్తే జ్యోతిని తీసుకువెడతానని అన్నాడు.

ఆయన రెండు చేతులూ పట్టుకున్నాడు తను. "మామయ్యగారూ! మీరు కనికరించాలి. వచ్చిన డబ్బు నాన్నగారి వైద్యానికి ఖర్చయిపోయింది. చెల్లాయిని తీసుకువెళ్ళండి. సంసార జీవితంలోపడి, నాన్నగారిపై దిగులు మరచిపోతుంది. నేను రెండు నెలలాగి మీకు సర్దుబాటు చేస్తాను ." అన్నాడు.

"చూడు, మూర్తీ! నేను నిక్కచ్చి మనిషిని! ఆ డబ్బు ఖర్చయి పోయిందంటే నేను కాదనను. మీ నాన్నలేడు. నీవా, చిన్నవాడివి. చిన్న ఉద్యోగం! ఎక్కడని తేగలవు? ఎలా? తీసుకు రాగలవు? అప్పు నీకు యిచ్చే వారయినా ఏం చూసి యిస్తారు? ఎలా

తీరుస్తావని యిస్తారు? రెండు నెలల్లో నువ్వు నాలుగువేలు కాదుగదా, నాలుగు వందలయినా యివ్వలేవు అందువల్ల నీమాట నమ్మను. నా కోడల్ని తీసుకు వెళ్ళను నన్ను కర్కోటకుడనుకున్నా సరే!రాక్షసుడనుకున్నా మంచిదే ..." అనేసి వెళ్ళిపోయాడాయన.

నిజమే తనది చిన్న ఉద్యోగం. వచ్చే మూడు వందల రూపాయలలో యింటద్దె అరవయి రూపాయలు పోగా, మిగిలిన దానిలో రెండు పూటలా తినడమే కష్టం. అలాంటిది తను ఏం కూడబెట్ట-గలడు? అప్పు తెచ్చినా ఎలా తీర్చగలడు?

మరోసారి వెళ్ళి చెల్లెలి మామగారిని ప్రాధేయ పడ్డాడు తను. కాళ్ళు పట్టుకుని బ్రతిమలాడేడు తన చెల్లెలి జీవితం నాశనం చేయవద్దని. కాని ఆ కర్కోటకుడు వినలేదు.

ఆ తరువాత ఎంత తిరిగినా, ఎందర్ని అడిగినా అప్పు పుట్టించలేకపోయాడు. సంవత్సరం దాటి-పోయింది.'మీ నాన్నగారు పోయి ఏడాది కదా?నువ్వూ పెళ్ళిచేసుకో! ఆ కట్నం డబ్బుతో కొంత నీ చెల్లెలికి యిచ్చి పంపించు ...' అని సలహా యిచ్చారు కొందరు

తను కట్నం తీసుకోవటమా? కట్న పిశాచి ఎంత భయంకరమైనదో స్వయంగా అనుభవిస్తూ, తను వరకట్నం ఎలా తీసుకోగలడు? తను ఆదర్శ వివాహం చేసుకోవాలంటే జీతం పెరగాలి. లేదా ఇంకో మంచి ఉద్యోగం రావాలి!

కాని జ్యోతి జీవితం ఏమవుతుంది? సుఖంగా భర్తతో సంసారం చేస్తూ వుండాల్సిన చెల్లాయి నిరాశా నిస్పృహలతో రోజులు వెళ్ళ బుచ్చుతూ వుంటే చూస్తూ ఊరుకోవటం ఎలా?

ఏం చేయాలి? ఏంచేసి జ్యోతిని అత్తవారింటికి పంపగలడు? జ్యోతి భర్త, అమె మరది మంచివారే కాని తండ్రి కెదురు చెప్పలేరు. అసలు అభ్యంతరమూ వున్నదల్లా జ్యోతి మామగారి వల్లనే!

ఆలోచిస్తూ కూర్చుండి పోయిన మూర్తి ఏదో నిశ్చయానికి వచ్చినట్లు ఊపిరి వదిలాడు. కాఫీ గ్లాసుతో వచ్చిన చెల్లెలి వైపు నవ్వుతూ చూశాడు.

"రంగారావ్!"

నీకు సరిగ్గా పదిరోజులలో చావు తప్పదు!సాక్షాత్తు కగవంతుడే దిగివచ్చినా, నీ ప్రాణం పోకుండా ఆపలేడు. కనుక ఈ లోగా నీవు చేయాల్సిన మంచి-పనులన్నీ పూర్తి చేసుకో ..."

మొదటి ఉత్తరంలాగానే ఇదీ పావుతావు కాగితంలో సగం ముక్క పైన తెలుగులో టైపు చేయబడింది. కవరు మీద అడ్రసు కూడాఅంతే!

రంగారావుగారి మొహమంతా చిరు చెమటలు పట్టాయి. ఇది రెండో ఉత్తరం. మొదటిది ఎవరో అల్లరిగా వ్రాశారనుకున్నాడు తను. ఇదీ అలాగే అనుకోవాలా?

తన కెలాంటి జబ్బులేదు. అరవై దాటినా పిడిరాయిలా వున్నాడు. మరి ప్రాణం పోవటం ఎలా సంభవం?

ఏమో? నిమషాలమీద ఏ హార్ట్ ఎటాక్ లాంటిదో

నిచ్చెనలు

ప్రయత్నంచెయ్యక
ఫలితాల కోసం దేవుని ప్రీతికి
చేసే మానవుల అర్చనలు
అందని ఆకాశానికి నిచ్చెనలు!

— ఎన్. వి. ఆర్. ఎస్. మూర్తి

వచ్చి, తన ప్రాణం పోవచ్చు ఎంతసేపు గుక్కెడు ప్రాణం పోవటానికి?

అశాంతిగా చెప్పులు వేసుకుని యింట్లోంచి బయటకు నడిచాడు రంగారావుగారు. అలవాటుగా ఆయన కాళ్ళు పార్కువైపు దారి తీశాయి. మూలగా వున్న బెంచీమీద చతికిల బడ్డాడు. మొహాన పట్టిన చిరుచెమట్లు చల్లని గాలికి ఆరిపోతున్నాయి.

నిజంగా ఆ ఉత్తరంలో వున్నట్లు తనకు పదిరోజులలో చావు తప్పకపోతే ఆలోగా చేయాల్సిన మంచి పనులేమిటి?

రెండోవాడు సుధాకరానికి కూడా పెళ్ళి చేసేయాలి. అంతకంటే యిప్పుడు ...

"ఈ మధ్య మన ఊళ్ళోకి కొత్త జ్యోతిష్కు-డొకాయన వచ్చాడుట. ఆయన దగ్గరకు ప్రత్యేకించి వెడితే ఏమి చెప్పడుట. ఫీజు తీసుకునే ప్రసక్తే లేదు. ఎవరికయినా ప్రాణగండం లాంటిది వుందంటే అది ఆయనకు వారి మొహం చూస్తే తెలిసిపోతుందట. ఆ మనిషికి నోటితో చెప్పకుండా ఉత్తరం ద్వారా తెలియ జేస్తాడుట. ఈ మధ్య మన వూరి రైస మిల్లు ఓనర్‌కి అలాగే తెలియజేశాడుట ఆ జ్యోతిష్కుడు. ఆ తరువాత కాలేజీ ప్రిన్సిపాల్‌గారికి అంతేనుట! ఇద్దరూ ఆ ఉత్తరాలలో తెలియజేసినట్లే పోయారుట ...!"

అని వినిపించి తలెత్తాడు రంగారావుగారు. ఇద్దరు యువకులు ఆయన ముందు నుంచి వెడు-తున్నారు. వాళ్ళని ఆపి, "బాబూ! ఆ జ్యోతిష్కు-డెవరో తెలుసునా మీకు?" అని అడిగాడు.

"తెలియదండీ, మేమూ చూడలేదు. ఆయన గురించి వింటున్నాం ... అంతే!" అన్నాడు ఒక యువకుడు.

"అలాగా!" అంటూ వెనక్కి వచ్చి కూర్చున్నాడు రంగారావుగారు. ఇద్దరు యువకులూ ఆయనకేసి ఓసారి చూసి వెళ్ళిపోయారు.

మసక చీకట్లో కూర్చున్న రంగారావుగారు ఒక నిశ్చయానికి వచ్చారు పది రోజులలో తను చావవచ్చు. సుధాకరం పెళ్ళికాదు. తను చేయవల్సిన మంచి పని ... మరొకటి వుంది . అది ..

*　　*　　*

కిర్రు చెప్పుల చప్పుడు విని, తలెత్తిన జ్యోతి చివాలున లేచి నిలబడింది. పైటకొంగు భుజాల మీదుగా లాక్కుంది.

లోపలికి వచ్చిన రంగారావుగారు అలసటగా కుర్చీలో కూలబడ్డాడు. వంటగదిలోకి ఒక్క ఉరుకులో వెళ్ళి, మర చేంబుతో మంచి నీళ్ళూ, గ్లాసు తెచ్చి ఆయన ముందు వుంచి, "కాఫీ తెస్తాను" అని మళ్ళీ పరుగెత్తబోయిన జ్యోతిని "వద్దమ్మా" అని ఆపు చేశాడు రంగారావుగారు.


గ్లాసెడు మంచి నీళ్ళు తాగి, కండువాతో మొహం తుడుచుకున్నాడు "మూర్తి లేడమ్మా?" అడిగాడు నెమ్మదిగా

"లేడు, మామయ్యగారూ! అన్నయ్య ఆఫీసు పని మీద విశాఖపట్నం వెళ్ళాడడు. వారం దాకా రాడు ..." వినయంగా జవాబిచ్చిన కోడలిని చూశాడు రంగారావుగారు.

"అలాగా! ఫరవాలేదులే నీ బట్టలన్నీ సర్దుకో .. రాత్రికే వెళ్ళిపోదాం ..." అంటున్న మామగారి వైపు విభ్రాంతితో చూసింది జ్యోతి

"అన్నయ్యలేడు .. అంతేకాదు ... కట్నం డబ్బు ..."

నవ్వాడు రంగారావుగారు. "నేను కర్కోటకుడ్ని, డబ్బు మనిషినీ కాదమ్మా! డబ్బు జాగ్రత్త మనిషిని అంతే! నా కూతురుకి నిక్కచ్చిగా కట్నం యిచ్చిన వాడిని, నాకొడుక్కి అంత నిక్కచ్చిగానూ కట్నం తీసు-కోవాలన్నది నా పట్టుదల. కాని యిప్పుడు మీరు యివ్వలేని పరిస్థితిలో వున్నారు. నేనెంతకాలం బ్రతుకుతానో తెలియదు నా పట్టుదలకోసం మీ



ఇ'వేమన' పద్యాలు



తామసించి చేయ తగదెట్టి కార్యంబు
వేగిరింపనదియు విషమ మగును
పచ్చికాయదెచ్చి పడవేయ ఫలమౌనె
విశ్వదాభిరామ వినురవేమ.

యిద్దర్నీ విడదీయటం ధర్మంకాదు. సుధాకరం పెళ్ళి కూడా నిశ్చయమైంది. యివ్వగలిగినంతే కట్నం యివ్వమన్నాను వాడిని కూడా ఓ యింటివాడిని చేస్తే నేనేమయిపోయినా ఫరవాలేదు. యింటికి పెద్ద కోడలివి నీవు లేకుండా పెళ్ళి చేయటం ఎలా? ఇవాళ ఏడో తారీఖు. పదకొండున పెళ్ళి. బయల్దేరమ్మా! మీ అన్నయ్యకి ఒక ఉత్తరం వ్రాసి పెడదాం – నేనా పని చేస్తాను నువ్వీలోగా నీ పెట్టె సర్దుకో ." అంటున్న మామగారిని సజల నేత్రాలతో చూసింది జ్యోతి

ఇంతకంటే ఏం చేయను ?

"పెళ్ళి పనులతో బాగా అలసిపోయినట్లున్నావు?" నవ్వాడు కరుణాకరం. తల అడ్డంగా తిప్పింది జ్యోతి.

"నాకేమి అలసటగాలేదు. ఎంతో ఆనందంగా వుంది ..."

"కారణం ఏమిటో ...?" తెలియనట్లే అడిగాడు కరుణాకరం.

క్షణకాలం మౌనంగా వుండిపోయింది జ్యోతి "నేనీ యింటికి వస్తానని, పెద్ద కోడలిగా నాకీ అదృష్టం, గౌరవం ఈ జన్మలోను. మామగారి మనసు మారుతుందన్న ఆశలేదు నాకు. మీరూ, నేనూ కలిసి కాపురం చేస్తామన్న నమ్మకం నశించిపోయింది ఏ దేవుడు ఆయన మనసు మార్చాడో."

* * *

"ఏ దేవుడు ఆయన మనస్సు మార్చాడో కాని, నేను మాత్రం ఈ జన్మలో మన పెళ్ళి అవుతుందని అనుకోలేదు." అంది సరళ

ఆమె చెయ్యి అందుకుని, గాజులు సవరిస్తూ చిన్నగా నవ్వాడు సుధాకరం. "ఏ దేవుడూ ఆయన మనసు మార్చలేదు .. నేనే ఆయన మనస మార్చాను ..."

"నిజంగానా? ఎలా మార్చావ్, సుధా?" ఆశ్చర్యంగ అడిగింది సరళ.

క్షణకాలం నిటారుగా కూర్చున్నాడు సుధకరం "మా నాన్న మనసు మార్చటం నిజానికి ఆ దేవుడువల్ల కూడా కాదనే నానమ్మకం. వివాహమయి కూడా అన్నయ్యా, వదినా చెరోచోటా నిస్సారంగా కాలం గడుపుతున్నారు. వారి ఎడబాటుకు కారణం మానాన్న – ఆయన కట్నం పిచ్చి! ప్రేమించుకున్న మనమే దూరంగా వుండాలంటే ఏదోగా ఫీలవుతున్నాం. అలాంటిది అన్నయ్యకూ వదినకూ ఎలా వుంటుంది?ఇక భర్తతో కలిసి సంసారం ఆశలేదని నిరాశతో వదిన ఆత్మహత్యకు పూనుకుంటే ..

మనం తెగించి పెళ్ళి చేసుకోగలం. కాని మా నాన్న మనసు మారాలి! అన్నయ్య కూడా సుఖపడాలి. అందుకని చిన్న ప్లాన్ వేశాను. ఎవరికైనా ప్రాణభయం సహజం. ప్రాణంపోయేలోగా మంచివాడని ఉనిపించుకోవాలన్న నైజంలేని వారు అరుదు. మా నాన్నకు నేను 'నీకు త్వరలో చావు తప్పదు' అని ఒకసారి, 'పది రోజులలో చావు తప్పదు' అని రెండోసారి ఉత్తరాలు పోస్టు చేశాను ఆ ఉత్తరాలకు సపోర్టుగా ఎవరో జ్యోతిష్కుడు వ్రానే ఉత్తరాలలోని విధంగా జరుగుతున్నట్లు నా ఫ్రండ్స్ చెప్పుకుంటున్నట్లు ఏర్పాటు చేశాను ..." అని క్లుప్తంగా చెప్పి. "దాంతో మా నాన్నకు ప్రాణ భయం పట్టుకుంది. ప్రాణంపోయేలోగా మంచివాడనిపించుకోవాలని, కొడుకులిద్దర్నీ సుఖపెట్టాలని ఈలోచన కలిగింది. మనసు మారింది. మన పెళ్ళి నిశ్చయించేసి, ఆయనే వెళ్ళి వదిన్ని తీసుకువచ్చారు. కొడుకుగా నేనలా చేయటం బాగుండకపోవచ్చు. కాని ఆయనలో మార్పు తెచ్చి, మనం అందరం సుఖంగా వుండాలంటే ఇంతకంటే ఏం చేయను?" అన్నాడు.

"చేసింది చాల్లే. రేపు మామయ్యకు నిజం చెప్పేయ్. లేకపోతే దిగులుతో ..." అంటున్న సరళని దగ్గరకు లాక్కున్నాడు సుధాకరం.

"చేసిన తప్పంతా నోటితో చెప్పలేక ఇంతక్రితమే ఉత్తరం వ్రాసి ఆయన లాల్చీ జేబులో పెట్టాను. చాలదూ?" అని నవ్వి, ఆమె రెండు బుగ్గలూ తమకంతో చుంబించి, "నువ్వు యిప్పుడు చెప్పు ... యింతకంటే ఏం చేయను?" అడిగాడు సుధాకరం చిలిపిగా. □


సంపూర్ణ పోషకాహారంలో అన్ని పోషక పదార్థాలు సరియైన పాళ్లలో వుండాలి...



ప్రొటీనులు
పెరుగుదలకి ముఖ్యం
పిండి పదార్థాలు మరియు క్రొవ్వు పదార్థాలు
శక్తికి
విటమిన్ ఎ
కళ్ళలో కాంతులకి
విటమిన్లు బి గ్రూప్
అన్ని ఇతర పోషక పదార్థాలని జీర్ణించుకోడానికి
విటమిన్ సి
రోగ నిరోధక శక్తి పెంపొందించడానికి
విటమిన్ డి
కాల్షియం మరియు ఫాస్ఫరస్‌లని గ్రహించేటట్లు చేయడానికి
ఐరన్
ఆరోగ్యవంతమైన రక్తానికి
కాల్షియమ్ మరియు ఫాస్ఫరస్
దృఢమైన ఎముకలు మరియు పండ్ల కోసం

సిరిలాక్ సంపూర్ణ పోషకాహారాన్ని రుచికరమైన విధంగా అందజేస్తుంది

సిరిలాక్‌లో అయిదు రకాల పోషకాలు అన్నీ వున్నాయి—ప్రొటీన్లు, క్రొవ్వు పదార్థాలు, పిండి పదార్థాలు, ఖనిజాలు మరియు విటమిన్లు. మీ పాపకి ప్రతి పర్యాయమూ సిరిలాక్‌తో తయారు చేసిన ఆహారం మీరు యిచ్చినప్పుడు ఈ పోషకాలన్నీ సరియైన పాళ్ళలో చేరి వుంటాయి.



కలసికట్టుగా పని చేయడం వలన ఈ పోషకాలన్నీ హెచ్చు తగ్గులు లేకుండా ముఖ్యమైనవే. అందుకే అన్ని పోషకాలు 'సంపూర్ణం'గా వున్న సీరియల్ ఆహారం మీ పాప ఆరోగ్యానికి అత్యవసరం. ప్రతి సిరిలాక్ ఆహారం మీ పాపకి ఒక రోజుకి కావలసిన పోషక పదార్థాలలో నాల్గవ వంతుని అందచేస్తుంది. ఈ ఆహారం యిస్తున్నప్పుడు పోషక పదార్థాల కోసం మరొకటి మీరు యివ్వవలసిన అవసరం లేదు.

మీ పాపకి చనుపాలే తగినవి. అయితే పాపకి నాలుగు నెలలు వచ్చి ఘన పదార్థాలు తీసుకోడానికి సిద్ధంగా వున్నప్పుడు, మీ డాక్టర్‌ని సంప్రదించి సిరిలాక్ యివ్వడం ప్రారంభించండి.

సిరిలాక్®
పాలు వుండనే వున్నాయి



సిరిలాక్ తయారు చేయడం ఎంతో సులభం. దీనిని ముందుగా మరగ బెట్టిన, గోరు వెచ్చటి నీటిలో చేర్చండి. కలపండి. వడ్డించండి

ఉచితం! సిరిలాక్ పిల్లల పెరుగుదల చార్ట్ ఇందులో బరువు చార్టు, రోగనిరోధక మందుల రికార్డు, గట్టిగా ఉండే ఆహారం అలవాటు చేసేందుకు సూచనలు, యింకా ఎన్నో విషయాలు ఉంటాయి. మీ కాపీ కోసం ఈ చిరునామాకు వ్రాయండి:
సిరిలాక్
పోస్ట్ బాక్స్ నం. 3 న్యూ ఢిల్లీ-110 001

SAA/FSL/C/3151 TEL

NESTLÉ

సీరియల్

ఓ అమ్మ కథ

అన్నపూర్ణ

సరిగ్గా సాయంత్రం ఐదుగంటలకు మధువాళ్ల ఇంటిముందు వ్రాలాడు ఆనంద్. చూస్తే తలుపులు తెరిచే ఉన్నయ్. చొరవగా లోపలికివెళ్లి ''మధూ'' అని పిలిచాడు. మరుక్షణం మధుకు బదులు అమృత వచ్చి నిలిచింది అక్కడ

ఆమెను అంత దగ్గరగా చూడగలిగిన ఆనంద్ కళ్లు జిగేల్‌మన్నాయ్. కొద్దిక్షణాల తర్వాత అటు చూడలేకపోయాడు. అమృత విశాలనేత్రాలు నిర్మలంగా, నిశ్చలంగా ఉన్నాయి. వాటిలో ఎలాంటి ఆర్తి, వెకిలితనం కనిపించటం లేదు.

''కూర్చోండి ఆనంద్‌గారూ !''

— అమృత అన్నదే తడవు ప్రక్కనేఉన్న కుర్చీలో కూర్చుండిపోయాడు. ఏమిటో — ఎప్పుడూలేనిది ఒక ఆడదాని ముందు నిలబడటానికి ప్రప్రథమంగా సిగ్గు అనిపిస్తోంది ఈవేళ. తల ఎత్తి ఆమె ముఖంలోకి చూడలేకపోతున్నాడు.

''మధు ఉన్నాడండీ ?'' అడిగాడు నేల చూపులు చూస్తూ.

''మధ్యలో అతడెందుకండీ ? మాట్లాడు కోవలసింది మనం ఇద్దరమేగా ?'' అంది అమృత.

''ఔననుకోండి...''

(గత సంచిక తరువాయి)

''ఆ ఉత్తరం ద్వారా మీ మనసేమిటో తెలుసుకున్నాను.''

ఆ మాటనేసరికి ఒక్కసారిగా తల ఎత్తి ఆమె ముఖంలోకి చూశాడు ఆనంద్.

''మీరు ఏ విషయమైనా కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పగలరు. దాపరికంలేని మనుషులంటే నేను ఇష్టపడతాను.''

అమృత మాటలకు — ఉత్తేజం అనాలో, నిషా అనాలో తెలియని అవస్థలో పడిపోయాడు.

''ఇంతకూ నాపై మీ అభిప్రాయం ?''

''చెప్పానుగా ?'' అని సన్నగా నవ్వి, ''అరే ! మాటల మధ్య మరిచిపోయాను. మీకోసమని ఉప్మా తయారుచేశాను. చల్లారిపోతుందేమో... కాఫీ, టిఫిన్ అయ్యాక తీరిగ్గా మాట్లాడుకుందాం'' అని లోపలికి వెళ్లింది అమృత.

ఆమె మాటలకు, చర్యలకు— తన రొట్టె విరిగి నేతిలోపడినట్లే భావించుకున్నాడు ఆనంద్.

అమృతవైపే చూస్తూ— ఆమె తెచ్చి ఇచ్చిన ఉప్మా తినటం పూర్తిచేసి, కాఫీకప్పును చేతిలోకి తీసుకున్నాడు.

''ఆనంద్‌గారూ, మీరు నన్ను ప్రేమిస్తున్నారుకదూ ?''

''...నిస్సందేహంగానండీ !''

''ప్రేమించి మీరు నా నుంచి ఆశిస్తున్నదేమిటి ?''

ఆనంద్ చేతిలోని కాఫీ కప్పు వణికింది. దాన్ని బల్లమీద పెట్టేసి ఎటో చూడటం మొదలు పెట్టేడు.

''నా అందం, శరీరం— ఇవేగా మీకు కావలసింది ?''

''... ... ...''

''భౌతికపరమైన ఆ వాంఛలకేగా మీరు 'ప్రేమ' అన్న పవిత్ర పదాన్ని వాడుతోంది ?''

''... ... ...''

''మీకు నామీద అంత కోర్కెగా ఉంటే అంత చేటు ప్రేమ నటించనూ అక్కర్లేదు. పునర్వివాహం చేసుకొని నాజీవితాన్ని ఉద్ధరించనూ అవసరంలేదు... కమాన్ !... ఇప్పుడే... నా దగ్గిర మీకు కావలసింది ఏమిటో తీసుకోండి...'' అంటూ పమిట చెంగును కొద్దిగా తొలగించింది.

ఆమె మాటలు, ఆ ప్రవర్తన తీరు- ఆనంద్‌కు ముచ్చెమటలు పట్టించాయి. ఇది కలా నిజమా ? అన్న దిగ్భ్రాంతిలో పడిపోయాడు.

''ఏం, అలాగే చూస్తుండిపోయా రేమిటి?'' అంటూ ఎదురు ప్రశ్న వేసింది, అమృత పమిటను సర్దుకొంటూ.

ప్రయత్నించీ పెదవి విప్పలేకపోతున్నాడు ఆనంద్.

''నాకు తెలుసు ఆనంద్‌గారూ, మీది ప్రేమ కాదు— వాంఛ !... అది మీ కళ్ళకు పొరలు గప్పి ఏవో అనవసరపు త్యాగాలకు పురిగొల్పుతోంది... మీరు రోజూ నన్ను చూస్తున్నానన్నారు. కానీ, ఏనాడూ నేను మిమ్మల్ని గమనించలేదు... నా అందానికి ముగ్ధులై నన్ను ప్రేమిస్తున్నానన్నారు. కానీ, నా మనసేమిటో మీకు లేశం మాత్రం కూడా తెలియదు... వృద్ధుడైన భర్తతో నరకయాతన అనుభవిస్తున్నానని రాశారు. అలాంటి భావన నాలో ఏకోశాన

జరిగిన కథ—4 : మూర్తి భార్య బలవంతంపై భార్య మణి, కుమారుడు ఉదయ్‌లో కలసి కొండపాడు 'అమ్మ' ఆశ్రమానికి వెళతాడు. అక్కడ 'అమ్మ' భక్తుల ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు అతనికి నచ్చాయి. తన అనారోగ్యం గురించి ఆమెకు నివేదించుకొని ఆమె సలహా ప్రకారం ఆ ఆశ్రమంలోనే కొద్ది రోజులు ఉండను నిశ్చయించుకున్నాడు. పై విషయాలన్నీ స్నేహితుడు జగన్‌కు ఉత్తరం ద్వారా తెలియపరచి అతనిని ఒకసారి వచ్చి ఆశ్రమం దర్శించమని రాసాడు. ఆశ్రమానికి వచ్చిన జగన్ అమ్మను అమృతగా గుర్తిస్తాడు. అమృత తన విచిత్ర కథను మూర్తి దంపతుల కోరికపై చెప్పసాగింది — వేణుగోపాలస్వామి గుడిలో అర్చకుడు గోవిందయ్య కూతురు అమృత. ఊరి పెద్దల సలహాపై కూతురిని ఒక రెండవ పెళ్లివాడికి ఇచ్చి పెళ్లి జరిపించను అంగీకరిస్తాడు గోవిందయ్య. అమృత వివాహం రోగిష్టి అయిన సుందరరామయ్యతో జరిగిపోతోంది. చవితి కొడుకు మధుకి అమృతంటె జాలి. అతను ఆమెను చదువుకోమని ప్రోత్సహిస్తాడు. మధు, అమృత మాటలు చాటు నుంచి విన్న సుందరరామయ్య ఆలోచనలో పడ్తాడు. సుందరరామయ్యగారు మధుతోపాటు అమృతనీ పట్నంలో ఉంచి ట్యుటోరియల్ కాలేజీలో చేరుస్తారు. అమృత నాల్గింటిప్రక్క మేడలోని ఆనంద్ అమృతకు ప్రేమలేఖ రాస్తాడు. పిన్ని ఆదేశానుసారం ఆనంద్‌ను తమ ఇంటికి ఆహ్వానిస్తాడు మధు.

లేదు... మరి నాపై మీకు ఈ అయాచిత సానుభూతి ఎందుకు ?''

ఆ మాటలకు ఆనంద్ తల దిమ్మెత్తి పోయింది.

''మరోమాట... భౌతికపరంగా నేనేమీ వాంఛించటంలేదు... నా అనుభూతులు ఆనందాలే వేరు... ఒకవేళ మీకు నన్ను పొందటంలో అమరత్వం లభిస్తుందనుకొంటే... ఇప్పటికీ మించిపోయిందిలేదు...'' అంది అమృత మరొకసారి తెగింపుగా.

''నన్ను క్షమించండి... పొరబాటుగా అంచనా వేసుకొని మీ మనసేమిటో తెలుసుకోకుండా తొందరపడ్డాను...'' అన్నాడు, పరితాపంగా లేచి నిలబడి.

వాడిపోయిన ఆనంద్ ముఖం చూసేసరికి జాలి అనిపించింది అమృతకు.

''పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదంటారు పెద్దలు... అసలు మీరేదో చేయకూడని తప్పు చేశారనికూడా నేను అనుకోవటం లేదు... నాపై మీకు కలిగిన అభిప్రాయమేమిటో మీరు చెప్పారు. నా వ్యక్తిగత స్థితి ఏమిటో నేను మీకు తెలియజెప్పాను... మీరు నాకు ఉత్తరం రాసినప్పుడు — ఇప్పుడుకూడా మీపై కోపం లేదు...'' అంటూ తన మాటగా చెప్పింది.

''కృతజ్ఞుడినండీ... అమృతగారూ ! చేసిన తప్పు ఒకప్రక్క మానసికంగా కృంగదీస్తున్నా, నిష్కపటమైన మీ మాటలు నాకెంతో ఊరట కలిగిస్తున్నాయి. ఇప్పుడు అనిపిస్తోంది నిజంగానే నాది ప్రేమకాదు, వ్యామోహం అని. కొద్దిసేపటి క్రితం వరకు మిమ్మల్ని పొందాలన్న తహతహ నా మనసునిండా ఉంది. ఒక్కోసారి అనుకునేవాణ్ణి, 'మామూలు మాటలకు మీరు నా దారికి రాకపోతే బలవంతంగానైనాసరే మిమ్మల్ని అనుభవించితీరాలని.' ఐతే ఇక్కడ నాకు ఎదురైన పరిస్థితే వేరు. చాలామంది ఆడవాళ్ళను చూస్తూంటాం. వాళ్ళ వేష భాషలు, హావభావ ప్రకటనలు మగవాణ్ణి రెచ్చగొట్టే విధంగా ఉంటాయి. మరి మీరు పమిటతీసి నాముందు నిలబడ్డారు, మాట్లాడారు. కాని, నేను ఏవిధమైన ఉద్రేకానికి లోనుగాలేదు. మీ నిండైన మాటలు, నిశ్చలమైన చూపులు నాలోని కామవాంఛను చంపేశాయి. అంతేకాదండీ, మీపై ఒక విధమైన పవిత్ర భావంలాంటిది ఏదో కలుగుతోంది... ఇంతకూ మిమ్మల్ని మధు ఏమని పిలుస్తాడు ?''

'' 'పిన్ని' అనే పిలుస్తాడు.''

''...నేనూ అలాగే పిలిస్తే మీకు అభ్యంతరమా ?''

''ఎలా పిలిచినా అభ్యంతరం లేదు... పవిత్రత పిలుపులో కాదు, మనసులో ఉండాలి ఆనంద్‌గారూ.''

''ఓ. కే ! కాకపోతే ఒక చిన్న ఎమెండ్‌మెంట్... ఇకనుంచీ మీరు నన్ను 'గారు' అనకుండా పేరుపెట్టి పిలిస్తే సంతోషిస్తాను, పిన్నీ.''



ఒక అమ్మ కథ

"అలాగే... ఆనంద్"

అప్పుడే గదిలోంచి బయటికి వచ్చిన మధును చూసి కొయ్యబారిపోయి నట్లయ్యాడు ఆనంద్,

"ఇంతసేపూ... నువ్వు...!" అంటూ.

"ఈ గదిలోనే ఉన్నాను ఆనంద్ !... నీవు ఉత్తరం వ్రాయటం, అందుకు తగిన సమాధానం చెప్పటం — అది మా పిన్ని వ్యక్తిగత విషయం ! అందుకే నేను కలుగజేసుకోలేదు... ఇంతవరకు మీ ఇద్దరిమధ్య జరిగిన సంభాషణ విన్నాను. నీలో మానసికంగా వచ్చిన పరిమార్పుకు నేను ఎంతో ఆనందిస్తున్నాను... ఇప్పటికైనా తెలిసిందా మా పిన్ని ఎలాంటి వ్యక్తో ? — ఆమె ఒక కర్మయోగిలాంటిదిరా !" అన్నాడు మధు.

"నిజమే మధూ !... ఆమె నీ ఒక్కడికే కాదు, నాకూ పిన్నే ఇకనుంచీ... మరి నేను రోజూ పిన్నిని చూడటానికి వస్తూంటాను. అభ్యంతర పెట్టవుకద నువ్వు ?" అడిగాడు ఆనంద్.

"అలాంటిదేం జరగదు... మొత్తానికి అంతా చిత్రంగా జరిగిందిరా ఆనంద్ !" అంటూ నవ్వాడు మధు... అమృత దైవ మందిరం వైపు వెళ్ళింది.

13

"పిన్నీ, ఏం జరిగిందో చూశావా ?" — బజారుకని బయటికి వెళ్ళిన మధు ఖంగారుగా ఇంటికి వచ్చాడు. ఆ వేళ ఏదో పబ్లిక్ హాలీడే. మధుకు కాలేజీలేదు, అమృతకు ఇనిస్టిట్యూట్ లేదు. ఆదివారం తప్పించి మిగతా శలవుదినాల్లో ఆర్డినరీ టపా బట్వాడా ఉంటుంది కాబట్టి ఎవరు వ్రాసిందో ఒక కవరు అతడి చేతిలో ఉంది, అంతకు ముందే పోస్టుమ్యాన్ ఇచ్చి నట్లున్నాడు.

"ఏం జరిగింది మధుబాబూ ?... ఎక్కణ్ణుంచీ వచ్చింది ఆ కవరు ?" అడిగింది అమృత.

"చదువు పిన్నీ, అంతా నీకే అర్థమైతుంది !" అంటూ కవరు ఆమెకు అందించి విషణ్ణవదనంతో నిలబడ్డాడు మధు.

"ఉండు మధుబాబూ... ఇందాక కాఫీ మిగిలింది ... అది నీకు ఇచ్చి తీరుబాటుగా చదువుకుంటాను ఈ ఉత్తరం" అంది అమృత తాపీగా.

"కాఫీ మాట తర్వాతగాని, ముందు నువ్వా ఉత్తరం చదువు పిన్నీ" మధు ఆరాటానికి అంతేలేదు.

"మనం ఖంగారుపడి, మనసు పాడుచేసుకున్నంత మాత్రాన జరిగేవి జరక్కుండా మానుతాయా ?"

తెర వెనుక!

కురవని మేఘాలు
ఫల మివ్వని వృక్షాలు
గంభీరంగా లేచి వచ్చి
ఒడ్డుకు కొట్టుకొని
తల పగిలే సముద్ర కెరటాలు
చుక్కల మిణుగురులు - ఎంతో
స్వలాభపరులు
స్వార్థజీవులు - అంతే!
వాళ్ళ నవ్వుల మౌనం వెనుక
చూడు!
కావల్సినంత కాటేసే చీకటి!!

— ఆచార్య తిరుమల

"అన్నివేళలా అలాంటి వేదాంత ధోరణి పనికిరాదు పిన్నీ. ఆ ఉత్తరం చదివాక ఇప్పుడున్నంత గుండెనిబ్బరం నీలో ఉండదు."

మధు మాటలు పట్టించుకోకుండా లోపలికి వెళ్ళి కాఫీతెచ్చి అతడికిచ్చి—కూర్చుని తీరుబాటుగా కవరులోని కాగితం తీసింది.

"చిరంజీవి, లక్ష్మీసౌభాగ్యవతి యైన అమృతకు మనఃపూర్వక ఆశీర్వాదాలతో నీ తండ్రి వ్రాయునది —

వివాహమయ్యాక అత్తవారింట గౌరవప్రదంగా సంసారం చేసుకొంటూ పుట్టినింటి మర్యాద, మెట్టినింటి పరువు ప్రతిష్టలు నిలబెడతావని ఆశించాను. కానీ, చివరికి నువ్వు చేసిందేమిటి ? ఒక ఇంటికి కోడలిగా వెళ్ళాక నీకు చదువు అవసరమనిపించిందా ? కేవలం ఇంగ్లీషు చదువులే మనిషిని మానసికంగా వికసింపజేస్తయ్యంటావా ?... చిన్నతనం నుంచీ నీవు కనపరిచిన తెలివితేటలు, అడుగడుగునా వ్యక్తపరిచే సందేహాలు— ఇవన్నీచూసి నీ మనసు అపరిపక్వ దశను ఏనాడో దాటిపోయిందని భ్రమిశాను. మరి ఇప్పుడు ఆ ఇంగితజ్ఞానమంతా ఏమైపోయింది ? చదువుల నెపాన స్వగ్రామంలో భర్తను విడిచి నువ్వు పట్నం చేరటంలో ఆంతర్యమేమిటి ?

అమ్మా, అమృతా ! మొదట్నుంచీ నీమీద నాకుగల నమ్మకాలే వేరమ్మా. నీ దైవభక్తి, ఏకాగ్రమైన మనస్సు చూసి పొంగిపోయేవాణ్ణి. నువ్వు దేవుడు నాకిచ్చిన వరప్రసాదమని గట్టిగా విశ్వసించేవాణ్ణి. అలాంటిది నీ భర్త నా దగ్గరి

వచ్చి 'మీ అమ్మాయిని పట్నం పంపి చదివించా లనుకుంటున్నాను' అని చెప్పినప్పుడు, 'అది అతడి అభిప్రాయమే కావచ్చు. తన భార్య, తన ఇష్టం' అని సరిపెట్టుకున్నాను. కానీ, ఇప్పుడు అనిపిస్తోంది 'పట్నంవెళ్తాను. చదువుకుంటాను' అని నువ్వు వత్తిడి చేయటంవల్లే అందుకు అతడు తల వగ్గి ఉంటాడు. అంతేకాని ఇది నీ భర్తకు కలిగిన స్వసంకల్పంకాదు. జన్మతః విజ్ఞానఖనివని, అసాధారణ వ్యక్తివని — లేని ఉన్నతిని నీకు అంటగట్టటం నా పొరబాటే.. నువ్వూ ఉప్పుకారం తినే మామూలు మనిషివే. వయోపరంగా నీలోనూ కోర్కెలు రగులు తూంటయ్. వాట్ని తీర్చుకోవటం కోసం ఏదో నెపాన పట్నం చేరావు. ఒకే ఇంట్లో సవతి కొడుకును పెట్టుకొని కాలం గడుపుతున్నావ్. లోకాన్ని పట్టించుకోకుండా ఎంత పట్నవాస మైనా మరీ ఇంత దారుణమా! కోర్కెలు నీ నరాలను అంత బాధిస్తే ఏ పరాయివాడితోనో ఎటో లేచిపోకుండా కొడుకులాంటి మధుతో ... ఛీ... ఛీ... నువ్వు నా కడుపున పుట్టినందుకు సిగ్గు పడుతున్నాను.

మధు, నువ్వు పట్నంలో విచ్చలవిడిగా సినిమాలకనీ, షికార్లకనీ తిరగటాన్ని లక్ష్మీపతి గారి అబ్బాయి రాజారావు కళ్ళారా చూశాడట. ఆ విషయం నాతో చెప్పటమేకాదు ఊరు ఊరంతా చాటేశాడు. నా ఎదుట ధైర్యం చేసి ఎవరూ వ్యాఖ్యానం చేయలేకపోతున్నా చాటుగా, 'ఎటువంటివాడి కడుపున ఎటువంటి కూతురు పుట్టింది?... ఎంత కలికాలం అయితే మాత్రం ఇంత తెగింపా మరీను?' అని తెగ ఆడిపోసు కుంటున్నారు... నలుగురిలో తలెత్తుకు తిరగా లంటే భయంగా ఉంది... లక్ష్మీపతి, అవధాని, ఆంజనేయులు లాంటి వాళ్ళ సూటీపోటీమాటలు అసలే భరించలేకుండా ఉన్నాను. అందుకే ఉన్న ఊరును, నమ్ముకున్నదేవుణ్ణి వదిలిపెట్టి ఏనాడో ఇల్లు విడిచిపోయిన మీ అన్నయ్య కృష్ణను వెతుక్కొంటూ— వెళ్ళిపోతున్నాను... నీ వరకు మాత్రం ఇక తండ్రి అనబడేవాడు లేడు. నన్ను శాశ్వతంగా మరిచిపోయి —నీ ఇష్టారాజ్యంగా బ్రతుకమ్మా, అమృతా!

నీ అభాగ్య తండ్రి,
గోవిందయ్య''

ఉత్తరం చదివి నిట్టూర్చింది అమృత.

''ఇప్పుడేమంటావు పిన్నీ, నా మాట?''— అదోలా చూస్తూ అడిగాడు మధు.

''నేను అనేదేముంది మధుబాబూ రాజారావు మా గ్రామస్తులందర్నీ మసిబూసి మారేడు కాయ చేసేశాడు... మన ఇద్దరం కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నామని తెలియటంతో మానాన్న కూడా లోకుల్లో ఒక వ్యక్తి ఐపోయాడు... నన్ను అనుమానించాడు. తాను అవమానాల పాలైనట్లు భావించుకున్నాడు. మనశ్శాంతి వెతుక్కొంటూ ఏటో వెళ్ళిపోయాడు...కాకపోతే పర నిందలను పక్కనపెట్టి, స్వయంగా నిజానిజాలేమిటో తెలుసుకోవలసిన — కన్న తండ్రిగా తన కనీస ధర్మాన్ని విస్మరించాడు. అది ఆయన దౌర్బల్యం'' అంది మామూలుగానే.

అంతటి కఠోరవార్త తెలిస్తే ఎలాంటి భావోద్వేగానికీ లోనుగాని అమృత గుండెనిబ్బరాన్ని చూసిన మధుకు ఎంతో బాధ అనిపించింది. 'నిజంగా ఈమె మనిషేనా? స్పందించే హృదయం ఈ వ్యక్తిలో లేదా?' అనిపించింది అతడికి.

''ఈ ఉత్తరం నాకన్నా నీకే ఎక్కువ బాధ కలిగించి ఉంటుంది మధుబాబూ.''

''నిజమే పిన్నీ...''

''అనవసరమైన మనస్తాపాలు నీకువద్దు... ఈ ఉత్తరాన్ని, దీనిలోని విషయాలను నాలానే నువ్వూ మరిచిపో మధుబాబూ...''

''నీలా నాకు సాధ్యపడదు పిన్నీ... మినాన్న గారు ఆ ఉత్తరంలో ప్రస్తావించిన కొన్ని కొన్ని సంగతులు నన్ను గుండె కోతకు గురిచెయ్యక మానవు... నువ్వు చదువులోకి దిగటానికీ, మీ నాన్నగారు ఇల్లు వదిలి వెళ్ళిపోవటానికీ ముఖ్య కారకుణ్ణి నేనే పిన్నీ...'' దాదాపు దుఃఖస్వర మైంది మధుది.

అతడి దైన్య స్థితిని గమనించి కొద్దిసేపు ఏమీ మాట్లాడలేక పోయింది.

''...ఆనాడు నిన్ను దుర్భాషలాడినప్పుడే ఆ రాజారావు అంతు చూడవలసింది. కానీ నువ్వు వారించావ్... అది మన చేతకానితనమనుకొనే ఇంతపని చేశాడారోగ్!'' అన్నాడు మధు ఉక్రోషపడి.

''ఇప్పటికీ నాది ఒకటే మాట మధు బాబూ... అతడితో ఎటువంటి పరిస్థితిలోనూ తలపడవద్దు... భగవంతుడే ఆ తుచ్ఛుడికి ప్రాయశ్చిత్తం చేస్తాడు'' అంది అమృత నిష్కర్షగా.

''నీకు తెలియదు పిన్నీ, వాడొక హృదయం లేని మనిషి... అలాంటి మృగాన్ని స్వైర విహారం చేయనీయటం చాలా తప్పు. ఎందరి జీవితాలనైనా కబళించివేస్తాడు... అందుకే పోస్టాఫీసుదగ్గిర ఆ ఉత్తరం చదివి సరాసరి రాజారావు గదికి వెళ్ళాను వాడి అంతుచూడాలని. కానీ, గది తాళంపెట్టి ఉంది. ఊరునుంచి ఇంకా రాలేదట వెధవ!''

''ఎన్ని కుంటి సాకులు చెప్పినా నువ్వు రాజా మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటున్నది నా గురించే... అందుకే చెబుతున్నాను మధుబాబూ, ద్వేషం పెంచుకొని అతడితో తగూపడవద్దు. ఇందుకు భిన్నంగా నువ్వు ప్రవర్తిస్తే నామీద ఒట్టే! ఈ పిన్ని భూమ్మీద లేకుండా పోవాలను కున్ననాడే ఆ పని చెయ్యి'' అని గట్టిగా చెప్పేసి లోపలికి వెళ్ళింది అమృత.

పిడికిళ్ళు బిగించి నుదిటికేసి కొట్టు కున్నాడు మధు ఆమె వెళ్ళిన దిక్కే చూస్తూ.

* * *

సాయంత్రం అలా బజారుకని చెప్పి వెళ్ళిన మధు— ఆలస్యంగా ఇంటికి వచ్చాడు.

అప్పటివరకు ఒంటరిగా చదువుకొంటూ కూర్చున్న అమృత తల ఎత్తి మధును చూసింది. చాలా నీరసంగా కనిపిస్తున్నాడు మనిషి.

''ఆనంద్ బలవంతం చేస్తే సినిమాకు వెళ్ళాను పిన్నీ... కానీ, చూడబుద్ధికాలేదు. మధ్యలోనే లేచి వచ్చేశాను'' అన్నాడు కుర్చీలో కూలబడుతూ.

''అలాగా!...''


''... ... ...''

''నీకు వడ్డించేస్తాను. భోంచేసి పడు కుందువుగాని.''

''నువ్వు చదువుకో...తర్వాత తింటాను.''

''ఖాళీగా కూర్చొని వృధాగా ఆలోచించటం దేనికిగాని భోంచేసి పడుకో మధుబాబూ.''

''ఆకలి అనిపించటంలేదు... ఏమిటోపిన్నీ,



ఒక అమ్మ కథ

14

సిడుగులాంటి వార్త తెలిసీ నిశ్చలంగా కూర్చొని చదవగిలుగుతున్నావంటే..''

''నీకు పరమాశ్చర్యంగా ఉంది కదూ, మధుబాబూ ?''

''ఆశ్చర్యమేకాదు, ఎంతో ఆవేదనగా కూడా ఉంది పిన్నీ... ఇప్పుడు అనిపిస్తోంది, నావి అర్థంలేని ఆలోచనలనీ, అనాలోచిత నిర్ణయాలనీ. ఎంతటి ఛాందసురాలైనా ఇది కూడదని బామ్మ ఎంతో మొత్తుకొంది... మరి మా నాన్నగారు ఏ ఉద్దేశ్యంలో ఉన్నాడో ఆవిడ మాటలు త్రోసి రాజని, నా నిర్ణయాన్ని సమర్థించారు... ఇక్కడికి వచ్చి నువ్వు, నేను కలిసి ఒకే ఇంట్లో ఉండటం మొదలుపెట్టాకే నాకు ఈ లోకం — పరిస్థితులు అర్థమవటం జరిగింది... ఆనాడు మనిద్దరం ఒకే రిక్షాలో కూర్చొని సినిమాకు వెళ్ళాం... కన్నకొడుకు లాంటివాణ్ణే ఐనా వయసులో ఉన్న నీ ప్రక్కన కూర్చొని — సరిగా సినిమాకూడా చూడలేకపోయాను. దారిలో రాజారావు నిందాపూర్వకంగా మాట్లాడటం, మర్నాడు పక్కింటి మామ్మగారు వచ్చి 'ఎంత సవతికొడుకు ఐనా అంత చనువు కూడదమ్మా, అసలు వయసులో ఉన్న మిమ్మల్నిద్దర్నీ ఒకే ఇంట్లో అట్టిపెట్టటం మీవారికి తగని పని' అంటూ హితోపదేశం చేసివెళ్ళటం — నేను మొదటిసారి దెబ్బతిన్నాను ఆరోజు. తర్వాత మిత్రుడు అనుకున్న ఆనంద్ తెగించి నీకు ప్రేమలేఖ వ్రాయటంతో నాకు రెండో దెబ్బ తగిలింది. ఇప్పుడు మీ ఊళ్ళో రాజారావు సాగించిన ప్రచారము, మీ నాన్నగారు తీసుకున్న నిర్ణయము నన్ను మూడోసారి చావుదెబ్బ కొట్టాయి... తప్పంతా నాదే పిన్నీ. అందుకు ఎంతో బాధపడుతున్నాను.., మిగిలిన నా భయం, ఇంకా నేను ఏమేం నిందలు మోయవలసి వస్తుందో, చివరికి ఈ లోకం మనల్ని ఎంత దూరం తీసుకువెళ్ళి నిలబెడుతుందో — ఆలోచించలేకపోతున్నానుకూడా'' అంటూ తన మనోవేదనను వెళ్ళగ్రక్కాడు మధు.

''..ఆనాడు ఓ కన్నెపిల్లకు మీ పెద్దలు ఘోరాన్యాయం చేశారని నువ్వు పెట్టిన ఘోష, నావంటి యువతికి చదువు అవసరం అంటూ నువ్వు వల్లెవేసిన ఉపన్యాసాలు — వాట్నిగురించి తలుచుకుంటుంటే నాకిప్పుడు నవ్వే వస్తోంది మధుబాబూ... అసలు నువ్వింత పిరికివాడివని అనుకోలేకపోయాను. నీలోని దుర్బలత్వం గురించి నాకు ఏమాత్రం తెలిసినా — నీలాంటి అల్పులకు ఉన్నత భావాలు, ఆదర్శాలు పనికిరావని ఆనాడే నిర్మొహమాటంగా చెప్పేసేదాన్ని... నీకంటే వయోవృద్ధులైనా మీ నాన్నగారే ధైర్యవంతులు. ఆయన ఉద్రేకంతోనూ, మానసిక దౌర్బల్యం లోనూ నిర్ణయాలు చేయలేదు. బాగా ఆలోచించే — ఈ లోకంనుంచి ఎదురయ్యే ఎలాంటి సవాళ్ళనైనా ఎదుర్కోవటానికి సిద్ధపడే నన్ను ఇక్కడికి పంపారు. నీమీద ఉన్న కొండంత నమ్మకంతోనే మనిద్దర్నీ కలిపి ఒకే ఇంట్లో ఉంచారు... మధుబాబూ ! నీలాంటి ఆవేశపరులు తీయనైన అబద్ధాన్ని భరించగలరుగాని, చేదైన నిజాలకు తల ఒగ్గలేరు...'' తనలోని విసుగుదల కొద్దీ అనేసింది అమృత. ఆమె అంతగా ఉద్రేకపడి మాట్లాడటం ఇదే మొదటిసారి.

అమృత తూర్పారబట్టినవన్నీ పచ్చినిజాలే. ఆమె వదిలిన ఒక్కోమాట సూటిగా వచ్చి తగిలింది మధుకు.

''నిజమే పిన్నీ. 'నేను ఇంతకాలం ఊహా ప్రపంచంలోనే ఉన్నాను' అన్న నీ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. ఆదర్శాలు వల్లెవేయటంవరకే. నాకు తెలుసు. వాట్నే ఆచరించటంలో ఎంత కష్టం ఉందో తెలుసుకున్నాను, అనుభవ పూర్వకంగా ఇప్పుడు. మానసికంగా నా బలహీనత లేమిటో నాకు బోధపడినయ్. కాబట్టి ఇకనుంచీ వాట్నే దూరంగా ఉంచటానికి ప్రయత్నిస్తాను... వడ్డించు పిన్నీ... భోంచేస్తాను'' అంటూ కొంచెం హుషారు తెచ్చుకొని లేచి నిలబడ్డాడు మధు.

''నాకు వచ్చిన ఉత్తరం గురించి ఆనంద్‌కు చెప్పావా మధుబాబూ ?'' అడిగింది అమృత గుర్తువచ్చి.

''లేదు పిన్నీ ... 'ఏమిట్రా అదోలా ఉన్నావ్' అని వాడు అడగను కూడా అడిగాడు. కానీ, నేనే సమాధానం చెప్పలేదు.'' చెప్పాడు మధు.

''ఐతే మరెప్పుడూ నీకు నువ్వే ఈ సంగతి చెప్పకు. తెలిస్తే నీలా అతడూ రాజారావు మీద మండిపడి మొరటుగా ప్రవర్తించే అవకాశం ఉంది. సందర్భం చూసుకొని నేనే చెబుతాను ఆనంద్‌కు'' అంది అమృత ముందు జాగ్రత్త చర్య అన్నట్లు.

ఈ మధ్య ఆనంద్ తరచు మధు వాళ్ల ఇంటికి వచ్చి వెళ్తూనే ఉన్నాడు. అమృతతో ఎంతో సోషల్‌గా మాట్లాడుతాడు. ఆమె కూడా అతడంటే ఎంతో ఆత్మీయంగా జంకు గొంకు లేకుండా వ్యవహరిస్తూంటుంది.

''నాకు వెంటనే పెళ్లి చేస్తారట పిన్నీ; మా పెద్దవాళ్లు !'' అదొక గొప్ప వింతగా చెప్పుకొచ్చాడు, ఆ సాయంత్రం మధు వాళ్ల ఇంటికి వచ్చిన ఆనంద్.

''ఇంకేం, సంతోషంగా చేసేసుకో ఆనంద్ !'' తేలిగ్గానే అనేసింది అమృత.

''పిచ్చి కాకపోతే నాకు ఇప్పుడే పెళ్లేమిటి పిన్నీ ? చదివే చదువా పూర్తికాలేదు. వయసూ మించిపోలేదు. ఒకవిధంగా ఇప్పుడు నా మనసు, వయసు కూడా అపరిపక్వదశలోనే ఉన్నయ్ ... పెద్దలమాట కోసం, వాళ్ల ఆనందం కోసం — పూర్తిగా అపరిచిత ఐన ఏ కన్నెపిల్ల మెడలోనో తాళికట్టి జీవితం దుర్భరం చేసుకోవాలనుకోవటం లేదు. నేను బాగా ఎరిగిన మనిషి, నన్ను అర్థం చేసుకొనే సంస్కారం ఉన్న యువతి — అంటే నేను ప్రేమించిగాని పెళ్లిచేసుకోదలచలేదు పిన్నీ, కాకపోతే మరికొంత కాలంపాటు ఏ బాదరబందీ లేకుండానే కాలం గడుపుదామని అనుకుంటున్నాను.'' అంటూ తన వ్యక్తిగతాభిప్రాయం చెప్పుకొచ్చాడు ఆనంద్.

''హియర్...హియర్...'' — మిత్రుడి ధోరణికి చేతులు చరిచాడు మధు.

''నీ ఆలోచనలు, నిర్ణయాలు మంచివే ఆనంద్ ! మరి వాటికి కట్టుబడగల గుండె నిబ్బరం నీలో ఉందా అనే నా అనుమానం.'' అంది అమృత.

''...నామీద నాకు పూర్తి నమ్మకం ఉంది పిన్నీ'' గుండెమీద చేయి వేసుకొని చెప్పాడు ఆనంద్.

''మనిషికి తన మీద తనకు నమ్మకం ఉండటం ఎంతో మంచిది ఆనంద్. అలాగేకాని'' అంది అమృత.

''నేను కూడా దాదాపుగా అదే అభిప్రాయంతో ఉన్నాను ఆనంద్, వివాహ విషయంలోనూ కొన్ని నియమ నిబంధనలు పాటించాలనుకుంటున్నాను.'' అన్నాడు మధు — తన మాటగా.

అదే సమయంలో అక్కడ రాజారావు ప్రత్యక్షమయ్యాడు.

''రా... రాజా...''— అతడిని చూడగానె గతాన్ని పూర్తిగా మరచిపోయినట్లు ఆప్యాయంగా ఆహ్వానించింది అమృత.

రాజారావు కనిపించేసరికి మధు ఉద్రేక మంతా అతడి కళ్ళలో కేంద్రీకృతమై ఎరుపెక్కాయి. విషయం తెలియని ఆనంద్‌లో ఎలాంటి అలజడీ లేదు.

సాధారణమైన పలకరింపులు పూర్తయ్యాక ''ఐ యామ్ వెరీ సారీ అమృతా !... నేను ఇక్కడికి రాకూడదనే అనుకున్నాను. కానీ, పరిస్థితులే రప్పించాయి... నాకు తెలిసిన ఒక నిజాన్ని మీకు చెప్పకుండా ఉండలేకపోతున్నాను'' అంటూ మొదలు పెట్టాడు రాజారావు.

అపురూపమైన మైక్రోస్కోప్!

ప్రపంచంలోని అపురూపమైన ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపును రూపొందించినట్లు జపాన్ కంపెనీ ప్రకటించింది. ఈ మైక్రోస్కోపు 0.72 అంగ్స్ట్రామ్స్ అంతటి సూక్ష్మాతి సూక్ష్మమైన వస్తువును గూడా స్పష్టంగా ఫొటో తీసి చూపగలుగుతుంది. (ఒక అంగ్స్ట్రామ్ సెంటిమీటరులో వంద మిలియన్ల వంతుకు సమానం). సూక్ష్మాణువుల్లాంటి వివిధ పదార్థాలను గూడా అది స్పష్టంగా ఫొటో తీయగలదు. సూక్ష్మాతి సూక్ష్మమైన పదార్థాల పరిశోధనకు ఈ మైక్రోస్కోపు ఉపయోగపడగలదు. (జి. వా.)

మన ప్రాచీన నగరాలు ఇప్పుడు నామావశిష్టాలయినా, వాని శిథిలాల ననుసరించి వాని చరిత్రాంశాలను తెలుసుకొనుటకు వీలు కలుగుతున్నది. దీనికి హంపీ శిథిలాలే ఒక ఉదాహరణ. ఆ శిథిలాలు పూర్వపు విజయనగర సామ్రాజ్య వైభవాన్ని వివరిస్తూ ఉన్నవి. కొన్ని నగరాలు ఇప్పుడు విశ్వ విఖ్యాతిని గడించుకుంటున్నా, వాని పేర్ల వెనుక దాగియున్న చరిత్రాంశాలను గ్రహించుటకు అక్కడి శిథిలాలు చాలా తోడ్పడతాయి. అవి లేకపోతే చరిత్రాంశాలు మరుగు పడిపోతాయి.

మహేశ్వరుని కుమారుడైన కుమారస్వామికి తమిళనాడులో ఉన్న ప్రచారం తెలుగుదేశంలో లేదు. ఆ దేవునికి దక్షిణాదిని పెద్ద పెద్ద దేవాలయాలు చాలా చోట్ల ఉన్నవి. అవి పరమ పవిత్రాలుగా చూడబడుతున్నవి. షణ్ముఖుని భక్తులు ఎక్కువ. ఇట్టి స్థితిలో ఉత్తరాంధ్రంలో ఉన్న సుప్రసిద్ధ నగరమైన విశాఖపట్నానికి ఆ దేవుని పేరు ఎలా వచ్చినదో? ఇది కొంత వింతగానే

ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

ప్రాచీన శిథిలాలు



కానవస్తున్నది. (కుమార స్వామికి విశాఖుడనే పేరు ప్రసిద్ధమైన సంగతిని మరచి పోకూడదు.) ఈ పేరునకు వెనుక కొంత చరిత్ర ఉన్నది. దానిని తెలుసుకొంటే ఆ పట్టణానికి ఆ పేరు రావడం సబబుగానే ఉన్నదని గ్రహించ వచ్చును.

ఈస్టిండియా కంపెనీ వారి కాలంలో – వ్యాపారం ప్రధాన వృత్తి గల ఆ కంపెనీకి విశాఖపట్టణం మున్నగు రేవు పట్టణాలు ప్రధాన కేంద్రాలు ! తమ వ్యాపారాన్నీ, గిడ్డంగులనూ రక్షించుకోడం కోసం అక్కడ సైన్యాన్ని నిలిపి ఉంచటం జరిగేది. ఆ సైన్యంలోని సిపాయిలు చాలా మంది విశాఖ దేవుని భక్తులు కావడంవల్ల, ఆ చిన్న బస్తీలో సముద్ర తీరాన ఆ దేవునికి ఒక చిన్న గుడికట్టి ఆయనను పూజించేవారు. అందువల్ల దానికి విశాఖపట్టణం అనే పేరు వచ్చింది. సముద్రం ఒడ్డున గల ఆ దేవాలయం ఇప్పుడు లేదు. కాల గర్భంలో కలిసి పోయింది. కొన్ని రాళ్ళు మాత్రం మిగిలాయి. వాటినే తీర్థపు రాళ్ళని అంటారు. ఒక శతాబ్దం క్రిందట కార్మికేల్ దొరగారు కూర్చిన విశాఖపట్నం జిల్లా గెజెటీర్‌లో ఈ విషయం చెప్పబడింది. తీర్థపురాళ్ళ వెనక ఇంత చరిత్ర ఉన్నది. చరిత్రాంశాల కోసం మన ప్రాచీన శిథిలాలను రక్షించుకోవడం ఎంతో ముఖ్యం. □

''అంత కొంపలు అంటుకుపోయే నిజం ఏమిటో కాస్త సెలవియ్యండి రాజారావుగారూ!'' మధు స్వరం వెటకారంగా ధ్వనించింది.

''నువ్వు చెప్పెయ్యదల్చుకున్న దేమిటో త్వరగా చెప్పెయ్ రాజారావు''— అని మామూలుగానే అన్నాడు ఆనంద్.

''ఏమని చెప్పాలో, ఎలా మొదలుపెట్టాలో తెలియటంలేదు ఆనంద్...'' అంటూ జేబులోంచి సిగరెట్ తీసి చేతిలో ఉన్న లైటర్‌తో వెలిగించాడు రాజారావు.

''...నీకు తెలిసిన దేమిటో నిర్భయంగానే చెప్పెయ్యవచ్చు రాజా... ఎంతటి కఠోర సత్యాన్నైనా నేను భరించగలను'' అంది అమృత— తన మాటగా.

''పాపం, మీ నాన్నగారు ఊరు వదిలి ఏటో వెళ్ళిపోయారు అమృతా !''

తను చెప్పిన వార్త వినీ అమృత నిబ్బరంగానే కనిపించటంతో రాజారావే కొంచెం ఖంగారు పడ్డాడు.

పూర్వాపరాలు తెలియని ఆనంద్ మాత్రం ఆ వార్త తెలిసి, ''ఎంతపనిజరిగింది ?''అంటూ కొంత ఆదోళనను వ్యక్తంచేశాడు.

''నాకు తెలిసిందీ—నేను చెప్పదలుచుకున్నదీ అంతే. దట్సాల్, మళ్ళీ కలుస్తాను మై డియర్ ఫ్రెండ్స్'' అంటూ లేవబోయాడు రాజారావు.

''కూర్చో రాజా... మా నాన్నగారు ఊరు వదిలి వెళ్ళిపోయినంతవరకేచెప్పి ఊరుకున్నావ్ ? మిగతా వివరాలు చెప్పలేదేం ?'' అంది అమృత.

''వివరాలకేం ఉంటయ్ పెద్ద వయసుకద ? మతి చలించి అలా ప్రవర్తించారేమోనన్నది నా అనుమానం'' అన్నాడు రాజారావు నటింపుగా.

''మిస్టర్ రాజా, యుఆర్ గ్రేట్ యాక్టర్! నయవంచకులుంటారని కథల్లో చదివాను. దుష్ట స్వభావంతో కొందరు స్టేజీమీద నటించగా చూశాను. జీవితంలో అద్భుతంగా నటిస్తున్న నిన్ను ఈనాడు ప్రత్యక్షంగా చూశాను — నా జీవితమే ధన్యత చెందింది.'' అంటూ అమృత మాట్లాడుతూండటంతో అసహనంగా లేచి నిలబడ్డాడు రాజారావు.

''ఏమిటి అమృతా నువ్ మాట్లాడేది ?'' అని బుకాయిస్తూ.

''జరిగిందేమిటో, నీ నిజరూపం ఏమిటో తెలియదనుకున్నావా రాజా ? నువ్వు నాపై వేసిన నిందలు, అవి ప్రచారం చేసిన తీరు — ఇవే మా నాన్నను ఊరు వదిలి వెళ్ళిపోయేట్లు చేశాయని నాకు తెలుసు. ఐనా నువ్వంటే ఎలాంటి ద్వేషభావం లేదు నాలో... కాకపోతే ఒకటి గుర్తుంచుకో రాజా, నువ్వు ఎదుటి జీవితాలతో ఆడుకోవాలనిచూస్తే భగవంతుడు నీ జీవితంతో ఆడుకోగలడు. జాగ్రత్త !...''

— అమృత మరేదో చెబుతూండగానే తలవంచుకొని వెళ్ళిపోయాడు రాజారావు.

''దేవుడు, పాపం అని భయపెడితే — వాడు మారిపోతాడనుకుంటున్నావా పిచ్చీ ?'' అడిగాడు మధు.


''చెప్పటం మన విధి. మారటం మారక పోవటం — అది వాడి ఖర్మనుబట్టి ఉంటుంది మధుబాబూ.'' అని మధుకు చెప్పి, ''ఆనంద్ ! నువ్వూ మా మధుబాబులా ఆవేశపరుడివి కావద్దు...'' అంటూ రాజారావుతో తనకుగల పరిచయం, అతడు ప్రవర్తించిన తీరు అంతా చెప్పేసింది ఆనంద్‌కు. ''నా కారణంగా రాజారావుతో విరోధం పెట్టుకోనని మాట ఇవ్వు'' అంటూ అతడి దగ్గిరకూడా మాట తీసుకొంది అమృత.

[ఇంకా వుంది]


ఇదిగో
మీ అంగరక్షకుడు
CINTHOL
Godrej
CINTHOL
DEODORANT AND COMPLEXION SOAP
Godrej
CINTHOL
రోజుకు అరలీటర్ చెమట కారుస్తాం మనందరమూనూ.
ఆ చెమటతో వచ్చే శరీర దుర్గంధం పోగొట్టడానికి దుర్గంధ నివారక
సబ్బు మాత్రమే సరిపోతుంది. సింథాల్ —30 ఏళ్లపైగా
విశ్వసింపబడుతున్న పేరు, దుర్గంధకారక క్రిముల్ని నాశనంచేసే
కుటుంబపు సబ్బు. దీనితో మీకు రోజంతా దుర్వాసన లేని తాజాదనం.
గోద్రెజ్
సింథాల్ - దుర్గంధ నివారక సబ్బు
అందరి శరీరాలకు
కావలసిన అంగరక్షకుడు
CHAITRA-B-G-189-TEL

గ్రీటింగ్స్

నజీర్ అహ్మద్



పోస్ట్ అని వినబడిన కేకకు మేగజైన్ తిరగేస్తున్న రవికి కొద్దిగా ఆశ్చర్యమేసింది తనకు లెటర్స్ వ్రాయటానికి ఎవరున్నారబ్బా! మొన్ననే అమ్మా, నాన్నలకు గ్రీటింగ్స్ పోస్టు చేశాను కదా! అనుకుంటూ తలుపుతీసి పోస్టుమన్ విసురుగా అందించిన కవరును తీసికున్నాడు ఫ్రం రోజా అని కంట-పడగానే ముఖంలో ఏదో వెలుగు కొత్త ఉత్సాహం వచ్చినట్లయింది తను పంపించిన గ్రీటింగ్స్‌కు మరలా ఆమె పంపించి ఉంటుంది రవి మనస్సు ఒక్కసారి వెనక్కు వెళ్లింది

*　　　*　　　*

'అక్కయ్యా' అంటూ తలుపుతట్టిన రవికు, తలుపుతీసికుని ఎదురుగా కనిపించిన 'ఆమె'ను చూడగానే ఏదో లోకంలో విహరించివచ్చినట్లనిపించింది వాస్తవంలోకి వచ్చి, అ క్క య్యా లేదా?" అంటూ చలికి వణుకుతున్న పెదవులను అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నం చేస్తున్న అతని అవస్థను గమనించి 'ఒక్కసారి పలువరుస తళుక్కున్న మెరిసేటట్లు చిర్నవ్వు నవ్వి

"వదినా, అన్నయ్యలు సినిమాకు వెళ్లారు మీరు ? అంటూ ప్రశ్నార్థకంగా చూసింది

ఆ మాటలు వింటుంటే కోయిల కమ్మని స్వరం విప్పినట్లు, వేయి వీణలు ఒక్కసారి మ్రోగినట్లు, పిల్లన గ్రోవి ఆలాపించినట్లు అనిపించింది రవికి

సరిత' మా కజిన్ ఇంతకూ మీరు ?"

"నేను మీ బావగారి చెల్లిని వాళ్ళు వచ్చే టయిమ్ అయింది మీ రొచ్చి లోపల కూర్చోండి' అంటూ లోపలకు దారి తీసింది వెనుకనె రవి ఆమె నడుస్తుంటే జడ అటూ ఇటూ ఊగుతూ మనసును మరుమల్లెల పందిరి క్రింద పయనింపజేసింది ఆమె నడక పాటకు తగ్గ లయలు వేస్తున్నట్లనిపించింది

ఉందీ లేనట్లున్న ఆ నడుము సుతారంగా కదులు-తుంటే పధ్నాలుగు లోకాలు తిరిగింది రవి మనస్సు

ఏఘండీ కాఫీ ఏమిటి ఇంకా నిలబడి ఉన్నారు కూర్చోండి" అన్న 'ఆమె' మాటకు ఉలిక్కిపడి ఆమె కన్నులలోకి చూశాడు చేపలాంటి కళ్లలో ఏదో మెరుపు మెరిసి మాయమయిందనిపించింది ఆ కళ్లలో తన ప్రతిబింబాన్ని చూసి రవ్వంత ఆనందం వేసింది ఏదో ఏంత కాంతి ఆమె కన్నులలోనుండి సూటిగా అతని హృదయాన్ని తాకిందనిపించింది కాఫీ కప అందుకుంటుండగా తగిలిన ఆమె చేతి-వ్రేళ్ల స్పర్శ ఏదో తెలియని మధురాను భూతిని, ఎప్పుడూ పొందని అనిర్వచనీయమైన ఆనందాన్ని కలిగించింది

కాఫీ అందించిన తరువాత ప్రక్క గదిలోకి వెళ్ళి ఏదో పత్రిక తిరగేస్తోంది ఆమెను చూస్తూ ఆలోచనలో పడ్డాడు రవి ఈమె పేరేమై యుంటుంది? ఏమిటి ఈమెలో ఆ ఏంత ఆకర్షణ! ఎందుకు పదేపదే చూడాలనిపిస్తుంది. పెళ్లయి-నట్లు లేదు. బావగారు ఎప్పుడు చెప్పలేదే తనకు.

పేరడిగితే, అని అనుకున్నాడు కాని, గొంతు దాకా వచ్చిన మాటలు పెదవుల దాకా చేరనేలేదు. తను ఎవరో తెలియకుండానే ఇంత రాత్రివేళ ఇంట్లోకి రానిచ్చిందంటే ధైర్యవంతురాలే!అనిపించింది.

భయట స్కూటరాగిన చప్పుడు సరిత, సుధీర్‌లు వచ్చారన్నట్లు తెలియజెప్పింది. క్రొత్తగా పెళ్ళవటము వలన సినిమాలకు, షికార్లకు ఫ్రీగా తిరిగేస్తున్నారు. సుధీర్‌కు పోర్ట్‌లో మంచి ఉద్యోగమే. లోపలకు వచ్చి రవిను చూడగానే, "ఏరా రవి, ఏమిటసలు ఇటు రావటమే మానేసావు?" అంటూ నిష్ఠూరంగా అంది నవ్వుతూ సరిత. "ఎలా ఉందోయ్ నీ క్రొత్త జాబ్?" అంటూ సుధీర్ పరామర్శించారు. ఎస్. బి. ఐ. లో ఈమధ్యనే చేరాడు క్లర్క్‌గా. బ్యాంక్ దగ్గరే చిన్న రూం తీసికుని, అప్పుడప్పుడు వీళ్ళను చూసి పోతుంటాడు రవి. వీళ్ళతో మాట్లాడుతున్నాడన్న మాటే గాని కళ్ళు మాత్రం ఆ లతాంగిని గమనిస్తునే ఉన్నాయి. సరిత లోపలకు వెళ్ళి 'ఆమె'తో మాట్లాడింది. 'ఆమె' బయటకు వస్తుంటే. "ఈమె మా చెల్లెలు 'రోజా'. ఇక్కడే యం: యస్. సి. చేయటానికి వచ్చింది" అంటూ నా వైపు చూశాడు.

"మీ చెల్లెలని తెలిసింది. పేరు ఇప్పుడే విన్నాను" అంటూ పరిచయం చేసుకున్నాడు తనను తాను రవి. ఆ సుమధుర సుమ గీతావనంలో విరిసిన పుష్పం 'రోజా' అనుకుంటూ వారివద్ద సెలవు తీసికుని రూంకు వచ్చి పడ్డాడు. ఉద్యోగం రావటం వలన బ్రహ్మచారత్వాన్ని పారద్రోలాలని నాన్న వ్రాసే ఉత్తరానికి జాబు వ్రాయాలనుకున్నాడు.

నిద్రపోదామని కళ్ళు మూసుకున్నా రాలేదు. బయటకు వచ్చిన రవికు వెన్నెల వసంతం పలకరించింది. శరద్రాత్రి వెన్నెల పైట వేసినట్లు, నక్షత్రాల పూలను తలలో తురుముకున్నట్లనిపించింది. మబ్బులు క్రిందికి జారుతున్న వెండి దిబ్బలా అనిపించసాగింది. చల్లని గాలి రివ్వున ముఖాన్ని తాకగా, ఆ గాలిలో 'రోజా' గుబాళింపు ముక్కుకు సోకినట్లనిపించింది. చందమామలో 'రోజా' కనిపించింది. గుండ్రమైన, ఎర్రని ఈ ఆ మొఖంలో పెదవి క్రిందున్న పుట్టు మచ్చ ఎంత శోభ నిచ్చింది! నుదురును సుతారంగా అంటిపెట్టుకున్న ఉండీ లేనటువంటి ఆ చిన్ని బొట్టు ఎంత కాంతిని యిచ్చింది కదా!

రవికనిపించింది 'నే నా అమ్మాయిని ప్రేమించానా? అని. ఏమో తనకు అసలు ప్రేమంటే ఏమిటో తెలియదు. అదెలాగుంటుందో తెలియదు. ప్రేమను రోజా దగ్గర వెతకాలనే నిర్ణయానికొచ్చాడు. నిర్ణయంలోనే నిద్రాదేవి వలపుల పూదండ వేసి తన ఒడిలోకు లాక్కుంటుండగా లోపలకు వచ్చేసాడు.

ఉదయణన్నే నిద్ర లేవగానే కనిపించిన మంచులో కూడా వికసిస్తున్న 'రోజా' పుష్పము కనులముందు సాక్షాత్కరించింది. త్వర త్వరగా స్నానం వగైరాలు ముగించుకుని రేవతింటికి బయలుదేరాడు ఆఫీస్‌లో సెలవు పడేసి. రవిని చూడగానే సుధీర్ ఎగిరి గంతేసినంత పన్జేసి "రవి, ఈరోజు నువ్వు నాకు కొద్దిగా హెల్ప్ చేసి పెట్టాలోయ్. మీ. బ్యాంక్‌లో సెలవు పడేసి మా రోజాను యూనివర్శిటీలో జాయిన్ చేసి రావాలోయ్. నాకు అర్జంటుగా పని తగిలింది. నేనే రోజాను తీసుకుని నీవద్దకు వద్దామనుకునేంతలో నువ్వే వచ్చావు."

దానిదేముంది బావగారూ నేను వెళ్ళి వస్తాన్లెండి." అన్నాడు రవి. సెలవు ముందే పెట్టి వచ్చాడన్న విషయం ఎత్తకుండా 'రోజా'తో ఎంత సేపు గడపాలో. ఆ ఆనందాన్ని ఎలా పంచుకోవాలో అని ఆలోచించుకుంటున్నాడు. రేడియోలో అప్పుడే జేసుదాసు కంఠం నుండి "ఆజ్ సే పహెలే....." పాట మృదు మధురంగా వినపడుతూంది. పాటకు తగ్గట్లు అతని హృదయం పల్లవులు పలుకుతూంది. సరిత అందించిన కాఫీ సేవించి బయట పడ్డారు రవి, రోజాలు.

సిటీ బస్‌లో అందులో వైజాగ్ బస్సుల్లో ఎక్కితే ఎక్కడ 'రోజా' నలుగుతుందోనని, అంతకుమించి ఆమె మరో వైపు, తను మరో వైపు ఎక్కాల్సి వస్తుందని. 'రోజా' తన ప్రక్కనే ఉండాలని ఆలోచించి రవి ఆటోను పిలిచాడు. చిరు చెమటలను కర్చీప్‌తో సుతారంగా అద్దుతూ. ఒక చేత్తో చీర కుచ్చెళ్ళను పట్టుకుని ఎక్కి కూర్చుంది రోజా. ప్రక్కనే రవి. ఆటో కదిలింది. రవి మనస్సూ కదిలింది. ఈమెను తను ప్రేమించేసాడు. ఆమె ప్రేమిస్తుందో? లేదో? ఏది ఏమైనా హృదయపు వలపుల పూ మొగ్గయిన 'రోజా' ను తన అనురాగాల పందిరి క్రింద వికసింప జేయాలనే తలంపుకు వచ్చాడు. గాలికి ఎగురుతున్న ఆమె పైట కొంగు అతని ముఖాన్ని తాకి పులకింప జేస్తుంది. ఆమె వైపు చూశాడు రవి. ఏమిటి ఈమెలో ప్రత్యేకత? అనుకున్నాడు. రోజూ తను బ్యాంక్‌లో తన కొలీగ్ అయిన 'వసంత'ను చూస్తుంటాడే. ఆమె అందమయినదే. వసంతను చూస్తే తనకే భావమూ కలగదే! అందుకు కారణము తను వసంతను ప్రేమించలేదు కాబట్టి అనుకుని 'రోజా' ముఖం వైపు చూశాడు. ఎంత ప్రశాంతంగా ఉంది! బహుశా, ఆమె ఇప్పుడు తను చేరబోయే కోర్స్ గురించి ఆలోచిస్తూ ఉంటుంది. లేక తన గురించేమైనా ఆలోచిస్తుందా? అని అనుకుంటుండగా యూనివర్శిటి రావటంతో ఆటో తో పాటు రవి మనస్సూ ఆగింది.

పెద్ద చదువులు అందులో యూనివర్శిటి కాబట్టి ఆడా, మగా అంతా కలిసి నడుస్తున్నారు. కొంతమంది పెద్దగా మాట్లాడుకుంటూ వెళుతుంటే మరి కొంతమంది గుస గుసలుగా మాట్లాడుకుంటున్నారు. ఆ వాతావరణం చాలాకొత్తగా అన్పించింది రోజాకు. మోడరన్ డ్రస్సులలో కొంతమంది అమ్మాయిలు రోజా కంటపడకపోలేదు. ఆటోకు డబ్బులిచ్చిన రవి,


"రోజాగారు పదండి పోదాం" అంటూ తాము దిగిన ప్రదేశాన్ని యూనినవర్శిటీ 'ఇన్ గేట్' అంటారని చెప్పాడు. "అలాగా" అన్నట్లు తలూపింది. మిత భాషేమో అనుకున్నాడు. 'ఫిజిక్స్' డిపార్ట్‌మెంట్ వద్ద రోజా యింటర్వ్యూ తతంగం ముగిసేటప్పటికి గంట పట్టింది. పేరు కది యింటర్వ్యూ. కేవలం ఒరిజినల్స్ తీసికుని, ఫీజ్ చెల్లించటమే.

"మీకు చాలా శ్రమ కలిగిస్తున్నాను కదూ!" అంది.

"అబ్బే! దానిదేముంది లెండి. మీరు నాకు అదే మా సరితకు కావలసిన వారు కదా!" నడుస్తూ అన్నాడు రవి.

అలసిపోయినట్లున్న ఆమె ముఖాన్ని చూసి ప్రక్కనే ఉన్న 'క్యాంటీన్'లో 'కాఫీ' తాగుదాం అందామనుకుని వెంటనే 'లా' కాలేజ్, 'సైన్స్ కాలేజ్'లు ఆ ప్రక్కనే ఉన్నాయని గమనించి తమాయించుకున్నాడు. మరలా 'ఔట్‌గేట్' వద్ద ఆటో ఎక్కి 'అప్సర'లో టిఫిన్, కాఫీలు సేవించి ఆమెను యింటివద్ద దిగబెట్టి వెళ్ళిపోయాడు రవి, మనసునిండా ఏవో చెప్పరాని అనుభూతులను మిగుల్చుకుని.

సమయం చిక్కినపుడల్లా 'రోజా'ను ప్రేమిస్తున్నాడు 'రవి'. ప్రతీ సాయంత్రం సరితింటికి వెళ్ళటం, 'రోజా'తో కబుర్లాడటం చేస్తున్నాడు. అతనికదో





కలువబాల

(సెప్టెంబర్ 1-14 సంచిక)

విశేషాలు

"సాహిత్యంలో సెక్సు"పై
ప్రముఖ రచయిత్రుల చర్చా వేదిక ప్రారంభం!

★

అమెరికా ఉపాధ్యక్ష పదవికై పోటీ చేస్తున్న
తొలి మహిళ ప్రత్యేక పరిచయం

★

గోరింటాకు - ఎర్ర గాజులు
మధ్య పేజీలో ప్రత్యేకం!

★

అమితాబ్ బచ్చన్ మళ్ళీ నెం. 1 కాగలడా?....
సచిత్ర ప్రత్యేక వ్యాసం

★

మరచిపోకు నేస్తం : మౌనరాగం
రెండు రసగుళికలైన సీరియల్స్

★

ఆత్మ సౌందర్యం (కథ)
నాన్నా, నాన్నా (కథ)

★

పూర్తి బొమ్మల కథ
"ఇంచక్కా నా గది"

ఫిలిం తార ఛాయ" బొమ్మల శీర్షిక, "మీరూ-మీబుద్ధీ" (సైకాలజీ,) "కుట్టు పని చిట్కాలు-2", రాశిఫలాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు సినిమా మొదలగు తతిమ్మా శీర్షికలన్నీ.

★ పుటలు : 60, వెల : 150 పైసలు మాత్రమే

చందా వివరములు

ఏజంటు ద్వారా :

3 నెలలకు	.... రు.9-00
6 నెలలకు	.... రు.18-00
1 సం॥ నకు	.... రు.36-00

పోస్టు ద్వారా :

3 నెలలకు	.... రు. 9-90
6 నెలలకు	.... రు.19-80
1 సం॥ నకు	.... రు.39-60

కార్టూనిస్టులకు సూచనలు!

- ★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి
- ★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.
- ★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!
- ★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.
- ★ సొంత చిరునామా గల తపాలా బిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.
- ★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.
- ★ పండుగల కార్టూన్‌లు – బాగా ముందుగా వాటి కవరు మీద ఆ " ప్రత్యేక " సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.
- ★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.
- ★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతవేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

– సం॥

గ్రీటింగ్స్

పిన చర్యయింది. రోజా' కూడా సరదాగా, చనువుగా ఉండేది రవి దగ్గర. ఒక్కోసారి ఆమె మనస్తత్వము అర్ధమయ్యేది కాదు రవికు. రెండు నెలలు గడిచాయి. వీలుచూసుకుని అక్కయ్యతో రోజాను తను పెళ్లి చేసుకోవాలనుందని చెప్పాలనుకున్నాడు. ఏమన్నా అనుకుంటుందేమో! అనే భయం మరో వైపు. అడిగినా తప్పులేదు కదా అని మరో వైపు. అసలు ఆమెనే అడిగిస్తే ...!ఏమిటో ఈ పాడు మనస్సు సరిగ్గా ఉండి చావటల్లేదని తనను తాను తిట్టుకుంటున్నాడు రవి రోజూ.

చివరికోరోజు ధైర్యం చేసి యూనివర్శిటీ కెళ్ళాడు అప్పుడే క్లాసునుండి బయటికి వస్తున్న రోజా, రవిను చూసి ఫ్రండ్స్‌తో ఏదో చెప్పి దగ్గరకు వచ్చింది.

"ఏమిటి! దారి తప్పి వచ్చినట్టున్నారు."

"దారి చూసుకునే వచ్చానండి." అన్నాడు అసలు విషయం ఎలా పెట్టాలో అర్ధం కాక.

"ఈ రోజు మీరు బ్యాంక్‌కు వెళ్ళలేదా?" అంది నడుస్తూ.

"లేదండి. మీ కోసమే ...." అంటూ నసిగాడు.

"నాకు ఈ రోజెందుకో బోర్‌గా ఉంది. యింటి కెళ్ళి సినిమా కెళ్దాం పదండి."

"అది కాదు రోజాగారు, నేను మీతో కొద్దిగా మాట్లాడాలి."

"అదేవిటండోయ్ క్రొత్తగా ..."

"నేను మా ఊరు వెళుతున్నానండి 'పెళ్లి చూపుల' కోసం ..." ఒక్క క్షణం 'రోజా' ఎందుకో ఆగి, అతని వైపోసారి చూసింది. తలవంచుకున్నాడు రవి.

"మరలా ఎప్పుడు రావటం?"

"రెండు రోజుల్లో."

ఆ తరువాత బస్ స్టాప్ రావటంతో మాటలు ఆగిపోయాయ్. అసలు విషయం మాట్లాడనేలేదు. ఏదో జరుగుతుందనుకున్నాడు కాని జరుగనేలేదనే కంటే తను జరుగనివ్వలేదు. అడిగితే బాగుండేదనిపించింది. అసలు, ఆ అమ్మాయి తనను ప్రేమిస్తోందా? ప్రేమించినా ఆడపిల్ల కనుక బయటకు చెప్పట్లేదనిపించింది. కాని, తను మగాడే! చెప్పవచ్చుగా. పోనీ వేరే యితర పద్ధతుల-ద్వారానైనా తెలియజెయ్యాలనుకున్నాడు. అంతలో బస్సు రావటము, ఎక్కటం, ఇద్దరూ ఇల్లు చేరటం జరిగాయి.

రవితన ప్రేమను ఎలా వెల్లడించాలా? అని రాత్రింబవళ్ళు బుర్ర బద్దలు కొట్టుకుని ఆలోచిస్తే కనుచూపు మేరలో ఆశాకిరణంలా జనవరి కనిపించింది. పదిరోజులుండనగానే 'వైజాగ్'లో వున్న షాప్సు అన్ని వెతికి, ఒక గ్రీటింగ్ కొన్నాడు. తన ప్రేమను వెల్లడిచేసే మంచి వాక్యం ఎక్కడో కాపీకొట్టి రోజాకు 30 తారీకున చేరేటట్టు ఆరోజే లోకల్ పోస్టు చేశాడు డైరక్ట్‌గా యివ్వటానికి ధైర్యం చాలక.

* * *

ఆలోచనలను కట్టి పెట్టి. కవరును ఓపెన్ చేసిన రవి నిశ్చేష్టుడయ్యాడు. ఆ కవరుల్లో తను పంపిన 'గ్రీటింగ్' సగం ముక్క ఉంది. ఆమె ఉద్దేశ్యమేమిటో అతనికి అర్ధమయి చావలేదు. జీవితంలో అర్ధాంగిగా ఉండటానికి అంగీకారమా? లేక 'నీ ప్రేమ నా కొద్దు' అనే దానికి సంకేతమా? ఏమిటసలు? ఆమె మనస్తత్వము? ఈ రాత్రంతా పాపం రవికు నిద్ర సరిగ్గా పట్టనేలేదు. ఆ మరుసటి రోజే జనవరి ఫస్ట్. రెండవ తేదీన 'రోజా' ఊరెళ్లి పోయి మరలా సెలవులయిపోయేటంత వరకూ రాదని, రేపేదో ఒకటి చేయాలనుకున్నాడు.

మర్నాడు ప్రొద్దున్న 'నెగిటివ్'ను వదలివేసి 'పాజిటివ్'ను స్వీకరించి అసలు విషయం తేలుద్దామని సరిత ఇంటికి వెళ్ళాడు. బైలక్ సరిత, సుధీర్‌లు ఎక్కడికో వెళుతూ స్కూటరుమీద కనిపించారు దారిలో ఇంట్లో ఏదో సర్దుకుంటున్న రోజా తలుపు చప్పుడైతే వెళ్ళి తీసింది. ఎదురుగా వున్న రవిని చూసి, నవ్వి 'లోపలకు రండి' అని అనబోతుండగా "ఐ లవ్ యూ" అని గబ గబా వెళ్ళిపోయాడు రవి. రోజా పెదవులమీద చిరునవ్వు వెలిసింది. ఆ తర్వాత రెండు నెలలకు జరిగిన పెళ్ళికి అంతా తామే అయి దగ్గరుండి జరిపించారు సరిత, సుధీర్‌లు. ఇంతకూ జరిగింది రోజా పెళ్ళి తాను మనసారా ప్రేమించిన వాళ్ళ బావ శంకరంతో. రవికి అప్పుడు వెలిగింది ఆ గ్రీటింగ్ ముక్క అర్ధం. □

గమనిక

డాక్టర్ సలహాలు, ప్రశ్నావళి శీర్షికలకి ప్రశ్నలు పంపేవారు ఆ శీర్షిక పేర, ఆంధ్రసచిత్ర-వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-520 003 అన్న చిరునామాకి పంపాలి. రాసిన వారి పేరు, పూర్తి చిరునామా ఇవ్వడం ఎంతైనా అవసరం అని గమనించగోరుతున్నాము. సం.

తేడా....!

కాసుకు అమ్ముడయి
కొన్న యజమాని పట్ల
విధేయత చూపుతాయి
ఆ నోరులేని పశువులు
కట్నానికి అమ్ముడు పోయీ
ఎదురు తిరుగుతాయి
ఈ నోరున్న పశువులు.

– తాతినేని తులసీ మోహన్

తమిళ సినిమా విశేషాలు

● "నాకు స్టంట్ సీన్‌లు తీయడం తెలీదు. అసలు ఫైట్స్‌కు కెమెరా ఆంగిల్స్ ఎలా అమర్చాలో నాకు అనుభవం చాలదు. నాలోని లోటు పాట్లు కూడా నాకు తెలుసు. వాటిని చెప్పుకోవడంలో న్యూనతేమీ లేదు" అంటారు డైరెక్టర్ కె. బాలచందర్. ఈయన "వణ్ణ కనవుగళ్" (రంగుల కలలు) అనే చిత్రాన్ని తెలుపు – నలుపులో తీయాలనుకుంటున్నారు. ఒకవేళ తీస్తే, ఫలితం చూసి మరికొందరు తమిళ దర్శకులు కూడా ఈయన్ని అనుసరించే తలంపులో ఉన్నారు.

● ఇటీవల ఇళయరాజా సంగీత దర్శకత్వంలో పి. సుశీల పాడడం లేదు గాని, చాలాకాలం క్రితం డింపుల్ క్రియేషన్స్ వారి "ఊమ్మె వెయ్యిల్" (మూగ ఎండ) అనే తమిళ చిత్రంలో పాడింది. కారణాంతరాలవల్ల ఆ చిత్రం పూర్తవలేదు. ఇప్పుడా పాటలే "ఇంగెయుం ఒరు గంగై" చిత్రంలో చేర్చడం జరిగిందట.

● "నాకు మా ఆవిడంటే హడల్!" ఇలా అన్నది శివాజీ గణేశన్. ఈయన త్వరలో సినిమా రంగానికి స్వస్తి చెప్పి, పూర్తిగా రాజకీయ రంగం వరకే దృష్టి కేంద్రీకరించడానికి నిశ్చయించాడు. డైరెక్టర్‌ని చేయాలనుకున్న తన పెద్ద కొడుకు రాం కుమార్‌ని కూడా హీరో చేసే ప్రయత్నంలో ఉన్నాడు. "శివాజీ సింహ కంఠం రాజ్య సభలో మూగవోతుం దెందుకో!" అంటుంది జయ లలిత. ఎమర్జెన్సీ సమయంలో బొంబాయి శివ సేనతో చేరి ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా పని చేసిన వైజయంతిమాల, ఆమె భర్త డాక్టర్ బాలి ఇప్పుడు శివాజీ గనేశన్ ప్రోద్బలంతో నే 'కాంగ్రెస్ ఐ' లో చేరారు.

● తమిళంలో చాలా మంది తారలకు ప్రత్యేకంగా మేకప్‌మన్‌లు లేరు. శివాజీ గణేశన్, సత్యకళ, శివకుమార్ స్వయంగా మేకప్ చేసుకుంటారు. రజనీకాంత్‌కు ఇంతవరకు సొంత మేకప్‌మన్ అంటూ ఎవరూ లేరు.

● రజనీకాంత్ ఏ సుమూహర్తంలో "హరే రామ హరే కృష్ణ బృందంలో శాశ్వత సభ్యుడుగా చేరాడో గాని, ప్రతి రోజూ ఓ పది నిమిషాల పాటు ప్రశాంతంగా ఓ చోట కూర్చొని జపిస్తూంటాడు. "మధుపానం తగ్గించేశాను. త్వరలో సిగరెట్లు మానెయ్యబోతున్నాను. కొద్ది రోజుల్లో నేను కాషాయ వస్త్రాలు ధరించినా – ఎవ్వరూ ఆశ్చర్యపోనక్కర్లేదు" అంటా డతను.

● "అందరూ డాక్టర్లవ్వాలనుకొని సినిమాల్లోకి వచ్చామంటారు. నేను మాత్రం సర్కస్ ఆర్టిస్ట్ అవ్వాలనుకున్నాను" అంటూ మనోరమ ఇలా తెలిపింది : మా పళ్ళత్తూర్ గ్రామానికి నా చిన్న తనంలో మాణిక్యం సర్కస్ వచ్చింది. వాళ్ళ అద్భుతమైన ఫీట్లు, సాహసాలు చూసి నాకూ చేరాలనిపించింది. ఆ కంపెనీ యజమానిని కలుసుకుని అడిగేశాను కూడా. 'ఐతే, ఊరూరా తిరగాల్సొంటుంది. అందుకు నువ్వు సిద్ధమేనా?' అన్నా డాయన. అయిన వాళ్ళను వదులుకుని ఎలా వెళ్ళను? అంచేత, ఆ కోర్కెను అక్కడి కక్కడే చంపేసుకున్నాను."

● తేంగాయ్ శ్రీనివాసన్‌కు ఓ అలవాటుంది – డబ్బింగ్ సమయంలో ఎవరైనా ధగ్గరే ఉండి, ఆయన డైలగ్ చెప్పవలసినప్పుడు వీపు మీద తట్టాలి. ఇందుకు ఇంతకు ముందు గౌరి అనే అమ్మాయి ఉండేది. ఇప్పుడు ఎం. ఆర్. వేదా అనే ఆమెను ఏర్పాటు చేసుకున్నాడు. ఈమె ఒకప్పుడు స్వర్గీయ భీంసింగ్ వద్ద అసిస్టెంట్‌గా పని చేసింది. ఇప్పుడు భీంసింగ్ కొడుకు లెనిన్ వద్ద ఎడిటింగ్ నేర్చుకుంటూంది కూడా.

● ఏడేళ్ళ క్రితం ఏదో అపార్థంవల్ల ఎం. ఎస్. విశ్వనాథన్ సంగీత దర్శకత్వంలో జేసుదాసు పాడడం మానేశాడు. ఇటీవల ఆ మనస్పర్థలు తొలగిపోయాయి. ఇద్దరూ కలిసి ఓ తమిళ చిత్రానికి పని చేస్తున్నారు.

● సెట్‌లో అడుగెట్టినప్పట్నుంచి షూటింగ్ ముగిసే వరకు ఎక్కడా కూర్చోకుండా సదా నిలుచునే దర్శకత్వం నెఱపే డైరెక్టర్ ఎస్. పి. ముత్తురామన్.

(జి.వి.జి.)



వద్దు బాబోయ్. మీరు గనక మంత్రి అయితే అన్ని సదుపాయాలు "కట్, కట్" అంటారు!

సినిమా

"పల్నాటి పులి" లో భూపతిరావుగారమ్మాయి

నులక మంచం మీద పడుకొని ఉన్న రాజా (బాలకృష్ణ) వీపు మీది వాపుకి గౌరి (శ్యామల గౌరి) కాపడం పెడ్తూ, "ఏదో మంచి మనసున్న దాన్ని కాబట్టి పెళ్ళి కాక పోయినా పెళ్ళాం లాగా సేవ చేస్తున్నా" అంటూండగా రాణి (భానుప్రియ) ఖిన్న వదనంతో వచ్చింది. "ఎందుకే ఇక్కడి కొచ్చావ్? ఇప్పటికి కొట్టించిన దెబ్బలు చాలవా?" అంది గౌరి తీక్షణంగా.

"అది కాదండి," అంటూ రాణి దీనంగా రాజు వంక చూసింది.

గౌరికి ఇంకా కోపం తగ్గలేదు. "ఝెల్తావా – చీపురు కట్ట తిరగేసి, మా బావకు చేసిన దానికి దెబ్బకు దెబ్బ తియ్యమంటావా?"

"గౌరి. నువ్వు నోరు మూసుకో!" అంటూ రాజా మెల్లగా లేచి కూర్చొని, "అవును గౌరి! ఆవిడకు డబ్బుండొచ్చు. కార్లుండొచ్చు. . కాని. ఇప్పుడు మన ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది మర్యాద చేసి పంపటం మన బాధ్యత వెళ్ళి మంచి నీళ్ళు తీసుకురా!" అన్నాడు.

చేతిలోని గుడ్డను నేల కేసి కొట్టి, విసురుగా వెళ్ళిపోయింది గౌరి.

"రాజా, నన్ను క్షమించమని అడగటాని కొచ్చాను," అంటున్నప్పుడు రాణి కళ్ళు చెమ్మగిల్లాయి.

"తెల్లవారేపాటికి నేనంత గొప్పగా కనిపిస్తున్నానా?" అన్నాడు రాజా

"అవును, రాజా! చదువనేది హాబీ కోసం. కాలక్షేపం కోసం అనుకుని పెరుగుతున్న నాకు నిన్ననే జ్ఞానోదయమైంది. చదువుకుని రిక్షా లాగి కష్టపడి బతుకుతున్న నీ సంస్కారం నన్ను మేల్కొల్పింది."

"నడి బజారులో నిన్ను కొట్టాను. అది సంస్కారం అవుతుందా?

"నువ్వు కొట్టిన చెంప దెబ్బకే మసకలు కమ్మి ఉన్న నా కళ్ళు తెరుచుకున్నాయి."

"అయితే, నువ్వు చేసిన పనికి – నేను చేసిన పనికి బాకీ. చెల్లిపోయింది." అని రాజా నవ్వుతూ అంటూండగా అతని తల్లి పార్వతమ్మ వచ్చింది. తేరిపార చూసి, "మీ నాన్నగారి పేరేమిటమ్మా?" అని అడిగింది.

"భూపతి రావుగారు."

అంతే. పార్వతమ్మ చెవుల్లో పిడుగులు పడ్డట్లయింది.


తాతినేని ప్రసాద్ స్క్రీన్ ప్లే. దర్శకత్వంలో గోగినేని ప్రసాద్ నిర్మించే సాయి చక్ర ప్రొడక్షన్స్ "పల్నాటి పులి" చిత్రానికి భీశెట్టి కథకుడు

కొత్త నిర్మాత

ఎ. ఎన్. ఆర్. పెద్ద అల్లుడు, డి. రామానాయుడికి బావ మరిది అయిన యార్లగడ్డ సురేంద్ర నిర్మించె చిత్రంలో చంద్రమోహన్ హీరో రేలంగి నరసింహా రావు దర్శకుడు.

భానుప్రియ, మమత, "గృహలక్ష్మి"





మీ అబ్బాయి ముందుకు సాగడానికిగాను సరైన పద్ధతిలో జీవితంలో అడుగుపెట్టేందుకు తగిన పథకం వేసుకుని, దానికి తగినట్లు ఆదా చేసుకోండి. మా బాలవికాస్ ఈ విద్యానిధి పథకాలలో పొదుపు చేసుకోండి. రోజుకు రూ 2/- వంతున పదేండ్ల పాటు ఈ పథకంలో కూడబెట్టుకుంటే 10 ఏండ్ల తర్వాత మీ అబ్బాయికి నెలకు రూ 200/- వంతున 7 ఏండ్లు ఆదాయం వస్తుంది. ఇంకా కొంచెం ఎక్కువ మొత్తం కూడబెట్టుకుంటే అతనికి సాంవత్సరిక బోనస్ కూడా వస్తుంది. మా పథకం ఎలా పనిచేస్తుందో చూడండి.

విద్యానిధి స్కీంలో నెలవారి డిపాజిట్ రూ.	డిపాజిట్ కాలం నెలల్లో	పొదుపు చేసిన మొత్తం రూ.	మేము 122వ నెల నుంచే నెలనెలా చెల్లించే మొత్తం రూ.	మేము చెల్లించే నెలల సంఖ్య
27.16	120	3,259.20	100 00	84
54 32	120	6,518.40	200.00	84
108 64	120	13,036.80	400 00	84

వివరాలకు మీ సమీప బ్రాంచిని సంప్రదించండి.



ది వైశ్యా బ్యాంక్ లిమిటెడ్

రిజిష్టర్డ్ ఆఫీసు అవెన్యూరోడ్, బెంగుళూరు-560 002.
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు 72 సెయింట్ మార్క్సరోడ్, బెంగుళూరు-560 001.
ఛైర్మన్ రమేశ్‌గెల్లి

కలసి
అభివృద్ధి
సాధిస్తాం

KIRON/VBL/84T

సినిమా



శ్రీ సాయిఫిలింస్, రాజమండ్రిలో ప్రారంభోత్సవ సందర్భంగా చి. దుర్గా మహేష్ పూజా కార్యక్రమము నిర్వహించారు.

"కంచు కాగడా"లో విప్లవకారిణి

"వెళ్ళు! ఈ గీతం సంగీతంగా, బడుగు ప్రజల ఆశలకు సంకేతంగా, ప్రతి పౌరుడి గుండెల్లో నిండిపోవాలి. ప్రతి యువకుడి రక్తం పొంగిపోవాలి!" అంటూ దుర్గ (శ్రీదేవి), శివుడు (రాళ్ళపల్లి)కి చెప్పడం విన్న విక్రమ్ (కృష్ణ) చకితుడయ్యాడు. విక్రమ్‌ను చూసి దుర్గ కూడా నిర్ఘాంతపోయింది. దుర్గను సమీపిస్తూ," దొంగలరాణిగా పరిచయమై, అక్షరాలురాని అల్లరి పిల్లగా నటించి, చివరకి విప్లవకారిణిగా ప్రత్యక్షమయ్యావన్నమాట? ఏమిటీ నాటకం? ఎందుకాడావ్?" అడిగాడు విక్రం.

"నిన్ను మార్చడంకోసం. ఈ దుష్ట ప్రభుత్వం మా విప్లవ వీరులపై దేశద్రోహపు ముద్రవేస్తే, ఆ అబద్ధపు ప్రచారాన్ని నమ్మి నువ్వు వాళ్ళను పట్టుకుని ఉరికంబానికి అప్పజెప్పున్నావ్.అవినీతి, అక్రమం, అరాచకం, పాపాలతో పండిందీ పాలనా వ్యవస్థ. ఈ వ్యవస్థకు స్వస్తి చెప్పాలంటే విప్లవమే శరణ్యం ... ఆ విప్లవానికొక నాయకుడు కావాలి. నీలో సాహసం ఉంది. సమర్థత ఉంది. పట్టినపట్టు విడవని దీక్ష, నలుగురునీ నడిపించే దక్షత ఉన్నాయి. నీలోని ఆ నాయకత్వపు లక్షణాలు చూసే నీ అందన చేరాను. జరుగుతున్న చరిత్ర నీ కర్థమైన తర్వాత నా గురించి తెలియపరుద్దామనుకున్నాను. కాని, ఈ విధంగా ముందే తెలిసి పోయింది," అంది దుర్గ.


విక్రం దీర్ఘాలోచనా నిమగ్నుడయ్యాడు.

ఎ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో నందిగం దేవీప్రసాద్ సమర్పించే రాంప్రసాద్ ఆర్ట్స్ పిక్చర్స్ "కంచుకాగడా" చిత్రానికి ఎన్. రామలింగేశ్వరరావు నిర్మాత.. మహారథి మాటలు, చక్రవర్తి సంగీతం, వి. ఎస్. ఆర్. స్వామి ఛాయ తెరవెనుక హంగులు. □



"జ్ఞాపకాల మూట విప్పుతాను..."

Jaya Sudha



"....గతంలోకి కాస్త తొంగి చూసుకుంటాను.

తొలి తొలి యవ్వనంలో మొట్టమొదటి చిత్రంలో అవకాశం రావడం.

అప్పుడప్పుడే చిత్రరంగంలో అడుగు పెట్టడం. నటించడం, నృత్యం చేయడం, నట జీవితంలో పూర్తిగా లీనమైపోవడం.

అబ్బ, అవన్నీ ఆలోచిస్తుంటే ఎంత ఆనందం!

అంతేనా! నా చర్మ సౌందర్యానికి సౌమ్యంగా పరిచర్యచేసే లక్స్ గురించి తెలుసుకోగలగడం ఎంత అదృష్టం!"

శుద్ధమైన సౌమ్యమైన లక్స్– సినిమా తారలకు సౌందర్యాన్నిచ్చే సబ్బు

HLL-1130

హిందుస్తాన్ లీవర్ లిమిటెడ్ వారి విశిష్ట ఉత్పాదన.

సీరియల్ దాగుడుమూతలు

కప్పగంతుల మల్లికార్జునరావు

(గత సంచిక తరువాయి)

13

'అరుంధతీ.'

నువ్వు రాసిన వుత్తరాలు అందుతూనే వున్నాయ్. నాకు జవాబిద్దామనేవుంది. కానీ ఏమని రాయను ?

నా పరిస్థితిలో ఏమన్నా మార్పు వుంటేగా ? ఆయనదగ్గరి నుంచి కనీసం ఏదన్నా కబురు వచ్చినా ఆ విషయం నీకు రాసేదాన్ని. యీ మధ్యన మా రామారావు బాబాయ్ మా వూరు దగ్గరికి వచ్చాడు. ఆయనను సినిమా రంగంలోకి దించింది రామారావు బాబాయేనని నాకు అప్పుడు తెల్సింది. బాబాయ్‌చేత కబురు చేసేను. ఫలితం ఎలా వుంటుందో ?

గోపీచంద్ సినిమాలు చూచి మీ భార్యాభర్తలు ఆయన పర్సనాలిటీ ? స్టడీచేసి నాకు రాస్తున్నందుకు సంతోషం ఆయనలో కీర్తి కాంక్షారాక్షసుడు పెరుగుతున్నాడు. ఏ రాక్షసుడవుతేనేం ? ఎవరో ఆయన్ని పట్టి పీడిస్తూ వుండాలి. లేకపోతే ఆయన అలా మారడుగదా? అయినా నాకు ఆయనపైన సంపూర్ణ విశ్వాసం వుంది. తనలో దాక్కొని వున్న రాక్షసుడిని కనుక్కొని చంపేయగల శక్తి సామర్థ్యాలు ఆయనకు లేవంటావా ? ఆ శుభ సమయంకోసం ఎదురు చూడటంకన్నా ఏం చేయటం ?

జరిగిన కథ—7 : జనార్దనంగారు తమ కుమార్తె పెళ్లి వైభవంగా చేయ సంకల్పించారు. పెళ్లికొడుకు రమేష్ స్నేహితులు కోరే కోరికలకు హద్దూ, పద్దూ లేకుండాపోయింది. జనార్దనంగారు కూతురు సులోచన మొహంలో పెళ్లికూతురు మొహంలో వుండాల్సిన మెరుపు లేకపోవడం గుర్తిస్తారు. డాక్టరు సుధాకర్ పెళ్లికూతురుని తదేకంగా చూడటం, పరధ్యానంగా ఉండటం రమేష్ స్నేహితులు గమనిస్తారు. రమేష్‌కు ఈ విషయం చెపుతారు. వారందరిలో ఈ విషయం ఆలోచనలు రేకెత్తిస్తుంది. జరగాల్సిన పెళ్లి ఆగిపోయింది. అదే ముహూర్తానికి గోపీచంద్ సులోచనను పెళ్లి చేసుకోడానికి సిద్ధపడతాడు. గోపీచంద్, సులోచనల వివాహం జరిగిపోయింది. సులోచనను గోపీచంద్ తల్లితండ్రులు ఆప్యాయంగా తమలో కల్పుకొన్నారు. వారితోబాటు మూగి వెంకన్న బాబు వచ్చాడు. వెంకన్న బాబును తీసుకెళ్లను వచ్చిన రమేష్ సులోచన మాటలతో పరాభవం చెంది వెళ్లిపోతాడు. సులోచన స్నేహితురాలు అరుంధతి తన భర్త కాంతారావుతో చెప్పి, గోపీచంద్‌కు సన్మానం చేయిస్తుంది సుప్రసిద్ధ సినీ దర్శకుడు శ్రీమన్నారాయణ నుంచి అర్జంటుగా రమ్మని కబురందుకున్న గోపీచంద్ సులోచనను వాల్తేరు బండెక్కించి తను మద్రాసు బండెక్కుతాడు. గోపీచంద్ నవల ఆధారంగా డైలాగులు కూడ అతనే రాసిన సినిమా సక్సెస్ అవుతుంది. భర్త నుంచి ఏ కబురూ లేక బాధ పడుతుంది సులోచన — గోపీచంద్ పూర్తి సినిమా వ్యామోహంలో పడిపోతాడు. సులోచన ఉత్తరం చదివిన గోపీచంద్ సులోచనను, తన తల్లితండ్రులను మద్రాసు తీసుకురావాలని నిశ్చయించుకొన్నట్లుగా సులోచన బాబాయి రామారావుతో చెప్తాడు.

యమ్మే పాసయ్యానుకదా ? ఎక్కడైనా యిక్కడే ఏదన్నా వుద్యోగం సంపాదించు కొందామనుకొంటున్నాను. ఆయన చదువు మా మామగారు నడుం విరగటంవల్ల అర్థాంతంగా ఆగిపోయింది. ఆయన అలా అర్థాంతంగా లేచిపోవటంవల్ల ఆయన చెల్లెలు తమ్ముడి చదువులు ఆగిపోకూడదుకదా ? మానసిక బాధలతోపాటు ఆర్థిక బాధల్నికూడా నేను ఎదుర్కోక తప్పదు. కాలేజీలో చదివే రోజుల్లో నీ సాహచర్యమె నాకు ధైర్యాన్నిస్తోంది. నిన్ను ఎప్పుడూ గుర్తుచేసుకొంటుంటాను అందుకే.

అన్నట్లు—తప్పిపోయిన మామగారు, మొగుడుగారు నా ప్రాణానికి యమభటుల్లాగా తయారయ్యారే. మనం మర్చిపోదామనుకొన్నా వాళ్లిద్దరూ నా గత వాసనల్ని మర్చిపోనివ్వటంలేదు...'

'పోస్ట్.'

ఉత్తరం రాయటం ఆపి చివాలున లేచి వొక్క పరుగులో బయటికొచ్చింది సులోచన. ఆశ... ఆనందం...

'యిక్కడ సంతకం పెట్టమ్మా...'

రిజిస్టర్ లెటర్ ! ఎక్కడ్నుంచి ?

సంతకం పెట్టి తీసుకొని చూచింది.

ఎవరో ప్లీడరు దగ్గరినుంచి.

గుండె గుభేలుమంది !

పరబ్రహ్మమూర్తి శాపవచనాలు గుర్తుకొచ్చాయి.

'ఏం చూచుకొని నీకీ మిడిసిపాటు తల్లీ ? పెళ్లికిముందే కడుపు వచ్చిందీ ? కుంతీదేవివి కావటం యిష్టంలేక కడుపు తీసేయించుకొన్నావ్ ? పీటలమీద పెళ్లి ఆగిపోయిందీ ? గతిలేక కులం తక్కువ వాడు, పూటకి తిండికిలేని మనిషిని చేసుకొన్నావ్? పోనీ ఆ మనిషన్నా నిన్ను సరిగా ఏలుకొంటున్నాడా అంటె అదీలేదు. నువ్వు యింట్లో అడుగు బెట్టావ్. ఆ ముసలాళ్లకు కొడుకును దూరం చేసేవ్ ? చూస్తుండు. రేపీపాటికి విడాకుల నోటీసులొస్తాయ్ నీ మొగుడి నుంచి ! అప్పుడు నీ చరిత్ర ఏమిటో ? కావాలంటే కోర్టులో నిలబడి నేను సాక్ష్యం చెప్తాను, తెల్సిందా ? సినిమాల్లోకి పోయిన నీ మొగుడికి అక్కడ నీలాంటివాళ్లు ఎంతమందో ?'

గుండెని వుగ్గబట్టుకొని కవరు తెచ్చి లోపలి కాగితం చదివింది. లాయర్ నోటీస్ అది.

ఆ నోటీసు చూసి ఆమె బిగ్గరగా నవ్వుకొంది.

వెంకన్నబాబును తనకు అప్పచెప్పకపోతే కోర్టుకు వెళ్తానంటూ పరబ్రహ్మమూర్తి బెదిరింపు.

చించబోయి ఆగింది. తనకొచ్చిన వుత్తర్వాలని గుచ్చే చువ్వకు గుచ్చిందా వుత్తరాన్ని. అరుంధతి వుత్తరాన్ని మళ్లీ రాయసాగింది.

'యిప్పుడే తప్పిపోయిన అత్తగారింటినుంచి నోటీసు వచ్చింది అరూ. ఆయనకి, నాకూ నోటీసు యిచ్చారు. బహుశా ఆయనకి కూడా ఆ నోటీస్ కాపీ ముట్టి వుంటుంది. ఆ నోటీసు ద్వారానైనా అతను మా పరిస్థితి అర్థం చేసుకొంటే ఎంత బాగుండును ?'

'వదినా. విలన్‌లు యిద్దరూ జాయింట్‌గా వచ్చారు.'

కృష్ణమూర్తి — పరబ్రహ్మనికి, రమేశ్‌కి పెట్టినా పేరు అది.

మొన్న ఆ మధ్య వాళ్లిద్దరూ వచ్చి సులోచనను నానా మాటలు అంటుంటే తన్నటానికి చేతులెత్తేడు కృష్ణమూర్తి.

'ఏమిటి మీ గొప్ప ? మా యింటికొచ్చి మమ్మల్ని అనేఅధికారం మీకేముంది ? మీ వెంకన్నబాబు సంగతి మాకు తెలియదు. కావాలంటే కోర్టుకుపొండి. మరోసారి మా యింటికి వచ్చారంటే మర్యాద దక్కదు తెల్సిందా ?'

దాని ఫలమే యివాళిటి నోటీసన్నమాట !

'వాళ్లు అల్లంత దూరంలో వుండగానే కత్తితీసుకెళ్లి రాయికేసి నూరసాగేను. అదిరిపోయారు. నువ్వు ఏదో పనిలో వున్నావని మాట్లాడవని చెప్పేసరికి పారిపోయారు మారు మాట్లాడకుండా. యీసారి వస్తే కత్తి నూరటం కాదు దాన్నెలా వుపయోగిస్తారో కూడా చూపిస్తా.'

'క్రిష్ణా. తొందరపడకూడదు యిలాంటి విషయాల్లో !'

'ఏంటొదినా ? తొందరంటావు ? యిలాంటి వాళ్లు మనం తగ్గేకొద్దీ మనపైనెక్కి స్వారి చేయాలని చూస్తారు. ఎదురు తిరిగితే తోక ముడుస్తారు. వాళ్ల సంగతి యిక నేను చూసుకొంటానులే కానీ...'

అతను ఆగేడు. నోరు తెరిచి వొక్క మాట మాట్లాడని కృష్ణమూర్తి యివాళ యిన్ని మాటలు మాట్లాడుతున్నాడేమిటి ?

'ఊ ? కానీ...?'

'నేను చదువు మానెయ్యాలనుకొంటున్నాను వదినా. అన్నయ్యకు వుత్తరం రాస్తున్నాను. ఆయన పారిపోయాడు. మరి యింటి బాధ్యతను ఎవరో మోయాలిగా ?'

'అందుకని ? నువ్వు చదువు మానేస్తావా ? పెద్దవాళ్లం నేను, మీ అక్కయ్య లేమనుకొన్నావా ? ఆమాత్రం బాధ్యతను మేం తీసుకోలేమనుకొన్నావా ? యీ వుత్తరం చూడు, నా స్నేహితురాలికి ఏం రాస్తున్నానో ?'

'వద్దు వదినా. ఎంతయినా యిది పురుషాధిక్య ప్రపంచం. పురుషుడిగా ఆ బరువు నేను మోయటమే సబబు. తోడబుట్టినదాన్ని బాధపెట్టలేను. మా యింటికి వచ్చినందుకు నిన్ను అన్నయ్య యిప్పటికే మానసికంగా హింస పెడుతున్నాడని నాకు తెల్సు. ఈ బాధకూడా పెట్టి...'

పదహారేళ్ల కృష్ణమూర్తి ! అన్నకన్నా రెండాకులు ఎక్కువే చదివేడు !

'అవును లేవయ్యా. ఆదర్శాలు మీ అన్నదమ్ముల సొత్తు. త్యాగాలు చెయ్యటం మీకే చాతనవును. అవునా ?'

'అంత నిష్ఠూరంగా మాట్లాడకు వదినా. ఆదర్శాలు, త్యాగాల ప్రసక్తి లేదిందులో. అప్పుడెప్పుడో అమ్మ వూరికెళ్తే నువ్వు వంట



చెయ్యటానికి ముందుకు రాలేదూ? నీకు సాయం చెయ్యటానికి అక్కయ్య ముందుకొచ్చింది కానీ నేను వచ్చానా ?'

'మీ అన్నయ్య వచ్చాడుగా ?'

'భర్తగా అప్పట్లో ఆయన ధర్మాన్ని పాటించారు. అవసరమైనప్పుడు భార్యగా నీ ధర్మం పాటించి నువ్వు వుద్యోగం చెయ్యి. కానీ యిక్కడ విషయం వేరు. ధర్మం వేరు. మా నాన్న నడుం విరిగితే మా అన్నయ్య కుటుంబ భారాన్ని మోయటానికి ముందుకొచ్చాడు. మా అన్నయ్య అర్ధాంతరంగా తన ధర్మాన్ని మర్చిపోయాడు. మరి ఆ భారాన్ని నేను మోయటం ధర్మమే కదా వదినా ?'

అతనితో ఏం వాదించటం ?

ధర్మవిరుద్ధంగా తప్పపని చేస్తుంటే మందలించవచ్చు. ధర్మబద్ధంగా మంచిపని అని తను అనుకొన్నదాన్ని చేస్తానంటుంటే ఏమని మందలించటం ?

'సరేనయ్యా. నీతో నేను వాదించలేను. మీ అన్నయ్యకు రాస్తానన్నావుగా ? మన వాదులాటకూడా రాయి. అప్పుడైనా ఆయనకు దయకలిగి సమాధాన మిస్తాడేమో ?'

కృష్ణమూర్తి వ్యంగ్యస్ఫూర్తిగా నవ్వేడు. యింతలో రమాదేవి బాణంలా దూసుకొచ్చింది.

'వదినా. గుడ్‌న్యూస్. అన్నయ్య దగ్గరినుంచి లెటర్. రెండో పోస్ట్‌లో వచ్చింది.'

ఆత్రంగా కవరు చించి ఉత్తరం చదివింది సులోచన.

'మీ అన్నయ్య వస్తున్నారు.'

అందరి మొహాలు వికసించాయి.

'సారీ వదినా. అన్నయ్య విషయంలో నేను పొరపాటు పడ్డానేమో.'

'వొక విధంగా. కానీ మీ అన్నయ్య వస్తున్నది యిక్కడ వుండటానికి కాదు. మనల్నందరినీ మద్రాసు తీసుకెళ్లటానికి బీరెడీ.'

14

'డైరెక్టర్‌గారూ. మీరు గమ్మున వూరుకొంటే బాగుండదు. జనం శ్రీమన్నారాయణగారి స్టేట్‌మెంట్స్ రైట్ అనుకొంటారు. మీరు 'ఊ' అనండి. బ్రహ్మాండమైన పత్రికా గోష్టి ఏర్పాటు చేస్తాను.' నాయుడు మాటలకు చలించలేదు గోపీచంద్. సిగరెట్‌పైన సిగరెట్ వూదిపారేస్తున్నాడు.

రకరకాల పత్రికలు అతనిముందున్న టీపాయ్‌మీద రెపరెపలాడుతున్నాయి. మరోవైపు ప్రభుత్వం వారి నుంచి గోపీచంద్ కొచ్చిన వుత్తరం పైన 'పేపర్ వెయిట్' బరువు వుండటం వల్ల పెరాల్సిస్ వచ్చిన రోగిలా కదలకుండా పడివుంది. ఆ వుత్తరం పై భాగంలో అశోకుడి ధర్మచక్రం ముద్ర మెరుస్తోంది ఎర్రగా. దానికింద 'ధర్మమేవ జయితే' అన్న అక్షరాలు నల్లగా భయపడుతున్నట్లున్నాయి.

ప్రభుత్వం వార్షికంగా యిచ్చే బహుమతులలో 'నెత్తురుకూడు' సినిమా కథా రచయితగా గోపీచంద్‌కు బహుమతి వచ్చినట్లు, దాన్ని తీసుకోటానికి ఫలాని రోజు హైదరాబాద్ రావల్సిందిగా కోరుతూ వచ్చిన వుత్తరం అది. ఆ వుత్తరం నిన్న వచ్చింది అతనికి. నిన్ననే పత్రికలో కూడా బహుమతులు ప్రకటించారు. కథకు తప్ప 'నెత్తురుకూడు'కు మరే బహుమతి రాలేదు.

నిన్నంతా ఫోనులమీద ఫోనులు. ఎవరెంత కంగ్రాచ్యులేట్ చేసినా 'థేంక్స్' అన్న ముక్క తప్ప మరేవిధమైన మాటలు మాట్లాడలేదు గోపీచంద్.

బహుమతి వచ్చినందుకు ఆతనికొకవిధంగా సంతోషంగా వుంది. మరో విధంగా విచారంగా వుంది.

ఈనాటివేళ పొద్దున అన్ని పత్రికలలోనూ శ్రీమన్నారాయణగారి స్టేట్‌మెంట్. ఆ కథయొక్క మూల రచయితే గోపీచంద్‌కాని, చిత్ర కథ రచయిత తనేనని సారాంశం. మూలకథలోలేని ఎన్నో విషయాలు చిత్ర కథలో వున్నాయి కనుక ప్రభుత్వంవారిచ్చే బహుమతికి తాను అర్హుడినని వాదన.

పొద్దున నుంచి ఫోనులమీద ఫోనులు. ప్రొడ్యూసర్‌లు, డైరెక్టర్లు, తారలు, టెక్నీషియన్లు, పత్రికల వాళ్లు...

'సారీ సర్. ఆ వార్తను నేను యిప్పుడే చూచాను. శ్రీమన్నారాయణగారితో ఫోనులో మాట్లాడితేనేకాని నేనేం చెప్పలేను.

అలాంటి సమాధానాలతో ఎంతకాలం తప్పించుకోటం ? చిత్ర సీమలో అది సాధ్యమా ? కాస్త సెన్సేషనల్ న్యూస్ చిక్కితే చాలు కథలు, నవలలు అల్లేయగల పండితులున్న ఫీల్డు !

నాయుడు శ్రీమన్నారాయణగారి కోసం ఫోనులో ట్రై చేసి చివరికి పట్టుకొన్నాడు హైదరాబాదులో. ఆయన పొద్దున మద్రాసులో స్టేట్‌మెంట్ యిచ్చి హైదరాబాద్ వెళ్లేడు.

హైదరాబాద్‌లో యివాళ పత్రికలవారికో గోష్టి జరుగుతుంది. రేపు హైదరాబాద్‌నుంచి మళ్లీ యిదే వార్త మరో రూపంలో అన్ని పత్రికలలో ప్రచురించబడుతుంది. ఈలోగా దాన్ని ఖండిస్తే వో బాధ ఖండించకపోతే వొకబాధ !

ఖండించకపోతే అదే నిజమేమోనని ప్రజలు నమ్మేస్తారు. దానివల్ల అతని ఇమేజ్ దెబ్బతింటుంది. కొత్తగా దర్శకత్వ బాధ్యతను స్వీకరించాక గోపీచంద్‌కు చిత్ర సీమలో స్థానం పెరిగింది. ఆ ఇమేజ్‌ని పడగొట్టాలని చూచేవాళ్లకు యిదో మంచి అవకాశం. అందువల్ల నష్ట పోయేది గోపీచంద్ డైలాగులు రాసిన, రాస్తున్న సినిమా ప్రొడ్యూసర్లు. మరీ ముఖ్యంగా నాయుడు. అతని సినిమాకు దర్శకుడుకూడాకదా ?

ఖండిస్తే? చాలా చిన్న విషయం పెద్ద విషయంగా మారుతుంది. పెద్ద దర్శకుడి మాటను ఖండించినందుకు కొందరు ప్రొడ్యూసర్లకు, దర్శకులకు కోపం వస్తుంది. దర్శకుల మధ్య కొట్లాటగా పరిణమిస్తుంది. కాగా...?

'సారీ. డైరెక్టర్‌గారూ. ఆ సినిమా ప్రొడ్యూసర్‌ని నేను కాకపోయినా, నాకు పార్ట్‌నర్ షిప్ వుందని ఫీల్డులో అందరికీ తెల్సు. పైగా 'సమర్పణ' అనో ఏదో టైటిల్‌కూడా తగలేసేరుగా నాకు. నేను నిజం చెప్తాను. నా మాటలకి కొంత విలువ వుంటుందిగా ?'

శ్రీమన్నారాయణ అసలు ప్రొడ్యూసర్‌ని పట్టుకొని నాయుడి స్టేట్‌మెంట్‌ని ఖండింపచేస్తే ? ఏది నిజమవుతుంది. ఏది అబద్ధమవుతుంది ?

'వద్దు నాయుడుగారూ... నన్ను కాస్త ఆలోచించుకోనీయండి. వో చిత్రాన్ని నా చేతిలో పెట్టిన ప్రొడ్యూసర్‌గా మీ వర్రీని నేనర్థం చేసుకోగలను. కానీ తొందరపడితే లాభమేమిటి ? నా 'ఇమేజ్' దెబ్బతింటే నాకు బాధకాద్గా ? రచయితగా సంపాదించుకొన్న పేరు కాస్తో కూస్తో వుంటే దాన్ని పోగొట్టుకోటానికి, అపఖ్యాతి తెచ్చుకోటానికి చిత్ర సీమలోకి రాలేదుగా నేను ? పైగా ప్రభుత్వంవారు బహుమతిని తీసుకోమని నాకు రాసేరు. అంటే ఏమిటి ? వారుకదా రచయితగా నన్ను గుర్తించినట్లేగదా ? అంతగా అవసరమైతే బహుమతి తీసుకొన్నాక పబ్లిక్‌గా చెప్పాల్సిందేదో చెప్తానుగా ?'

గోపీచంద్ అలా అన్నాక నాయుడేం చేయగలడు ?

శ్రీమన్నారాయణతో మాట్లాడేక నన్నా గోపీచంద్‌లో వేడెక్కుతుందేమో ? ఆయన్ని ఫోనులో పట్టుకొని గోపీచంద్‌కు రిసీవర్ అందించాడు.

'సర్. నేను గోపీచంద్‌ని సర్.'

'ఊ...' శ్రీమన్నారాయణ కంఠం ఫోనులో బిగుసుపోయింది.

'అవార్డు విషయంలో కథా రచనను గురించి మీ ప్రకటన చూచాను.'

'చూచావుగదా ? యింకేం ? నువ్వు చెప్పేదేమైనా వుంటే పత్రిక ద్వారానే చెప్పవచ్చుగా ? అనవసరంగా ఫోనులో నా టైమ్ వేస్ట్ చేయటం దేనికి ?'

'సర్. మీరు నాకు మొట్టమొదటిసారిగా అవకాశం యిచ్చారు. ఎక్కడో నా మానాన నేను బ్రతుకుతున్న నన్ను ప్రఖ్యాతుడిని చేసేరు. అందుకు నేను మీకెప్పుడూ కృతజ్ఞుడినే.'

'మాటలకేంలే ? నా ప్రొడ్యూసర్‌ని నువ్వు కొట్టేయటం మంచి కృతజ్ఞతే. కథ కావాలంటే షెడ్యూల్ చూచి చెప్తాననటమూ గురుభావనే ! ఛీఛీ... ఫీల్డులో కృతజ్ఞత లేకుండా పోతున్నదయ్యా...'

'క్షమించండి సర్. నేను అలాంటివాడిని కాను. కానీ ..'

'చూడు మిస్టర్. ఈ ఫీల్డులోకి నువ్వు నిన్న వచ్చావు. ఎన్నాళ్లుంటావో నీకే తెలియదు. నా జన్మలో ముప్పాతిక భాగం ఈ ఫీల్డులో కళాసేవలోనే గడిచిపోయింది. నా దగ్గర కబుర్లు చెప్పకు. నీకు నిజంగా నాపట్ల కృతజ్ఞతాభావం వుంటే నా స్టేట్‌మెంట్ సరైనదని, ఆ బహుమతికి నేనే అర్హుడినని ప్రకటించు. దట్సాల్. దేరీజ్ నథింక్ మోర్ టు టాక్...'

ఫోను పెట్టేసేడు శ్రీమన్నారాయణ.

బహుమతి ప్రదానం రోజు దగ్గరపడ్తోంది.

కథ అవార్డు విషయంలో పత్రికలో రోజూ ఎవరో వొకరు ఏదోవొకటి రాస్తూనేవున్నారు. గోపీచంద్ మాత్రం ఎవరెంత చెప్పినా ఏమీ మాట్లాడకుండా గమ్మున వూరుకొన్నాడు.

'నాయుడుగారూ. మన పిక్చర్‌కు సంబంధించిన స్క్రిప్టు దాదాపు పూర్తయింది. వొక్క ముఖ్యమైన సీను మిగిలిందనుకోండి. దాన్ని నేను తర్వాత పూర్తిచేస్తాను. నేను హైదరాబాద్ వెళ్లి అటునుంచి మా వూరుకు వెళ్తున్నాను. ఫేమిలీని యిక్కడికి తెస్తున్నాను. నేను వచ్చేసరికి పాటల రికార్డింగ్‌కి అంతా సిద్ధం చేయండి. కేస్ట్ ఫిక్స్‌చేసి వుంచండి. దానికి సంబంధించిన వివరాలన్నీ యిదిగో ఈ కాగితాలమీద రాసివుంచాను.'

'అలాగే... కానీ... ఈ కాంట్రోవర్సీ...'

'ఈ కంట్రోవర్సీ నా పేరుప్రతిష్ఠలకు, పరువు ప్రెస్టీజ్‌లకు సంబంధించినదండీ. ఆత్మగౌరవాన్ని నష్టపోటానికి సిద్ధపడ్తాననుకోకండి.'

రేపు బహుమతి ప్రదానం అనంగా యివాళ ప్రయాణం అవుతున్నాడు గోపీచంద్. అప్పుడు అతనికి ఫోనులో మెసేజ్ వచ్చింది



దాగుడుమూతలు

హైదరాబాద్‌నుంచి కథా రచనకు సంబంధించి యిచ్చే బహుమతిని జాయింట్‌గా శ్రీమన్నారాయణకు, గోపీచంద్‌కు యివ్వనున్నట్లు.

ఆ మెసేజ్‌ని ఎవరికీ చెప్పలేదు గోపీచంద్. రేపు వుదయానికి పేపర్లన్నీ ఎలాగూ ప్రకటిస్తాయిగదా ?

హైదరాబాద్‌లో అతడి రాకకోసం చాలా మంది అభిమానులు నిరీక్షిస్తున్నారు. ప్రశ్నలమీద ప్రశ్నలు...

'రేపు బహుమతి ప్రదానం అయిందాకా నేనేం మాట్లాడను. ఎలాంటి కార్యక్రమాలలో పాల్గొనను. యిాలోగా నా స్వంత పని చూచుకోవాలి. నేను ఎల్లుండికూడా వుంటాను మీ కోసం మీరు కోరితే. కానీ నన్నివాళ దయచేసి వదిలెయ్యండి. నేను నిజానికి బహుమతి ప్రదానంకోసం రాలేదు. మీలాంటి అభిమానుల్ని కల్సుకోటానికి, నా స్వంత పనిని చూచుకోటానికొచ్చాను.'

'మీకే వూళ్లో బంధువులుకాని తెల్సినవాళ్లు కాని వున్నారా ?'

'మీరంతా తెల్సిన వాళ్లేకదా ? బంధువులెవరూలేరు. నాకు అత్యంత ప్రేమపాత్రుడైన వో వ్యక్తిని కల్సుకోటానికి వెళ్తున్నాను. రేపు లేక ఎల్లుండీ మీకు అతడిని చూపిస్తాను. నా కొత్త సినిమాకు సంబంధించిన వో ముఖ్య ప్రకటనను మీ సమావేశంలోనే చేస్తాను.'

అతను వాళ్ళకు 'గుడ్ బై' చెప్పేసి టేక్సీలో నేరుగా అంగవికలుల కొరకు ఏర్పాటైన డెఫ్ అండ్ డంబ్ స్కూలుకు వెళ్లేడు.

ఆ స్కూలు అధికారికి తను వస్తున్నట్లు అంతకుముందే ఫోను చేయటంవల్ల వెంకన్నబాబును కల్సుకోటం అతనికి కష్టమేం కాలేదు.

వెంకన్నబాబు అతడిని చూడగానే పరుగెత్తుకొంటూ వచ్చి కౌగిలించుకొన్నాడు. గోపీచంద్ అతడిని దగ్గరికి తీసుకొన్నాడు.

'వెంకన్నబాబు చాలా చురుకైన కుర్రాడండీ. ఏకసంతాగ్రాహి. నాలుగేళ్ళ కోర్సును వొక్క సంవత్సరంలో అయిపుచ్చగలడు. యిా సంవత్సరం పరీక్షల్లో అతనే ఫస్టు' స్కూలు ప్రిన్సిపాల్ అన్నాడు.

'వెంకన్నబాబుకు నాకూగల బంధమేమిటో చెప్పేనుకదా సార్ ? రక్త సంబంధం కాదది. కుల సంబంధమన్నా కాదు. మనో సంబంధం. అతడిని యిా స్కూల్లో చేర్చినందుకు అతని రక్త సంబంధీకులు నాకు చేసిన మర్యాద చూడండి' తనకు పరబ్రహ్మమూర్తి వద్దనుంచి వచ్చిన లాయర్ నోటీస్‌ని చూపేడు గోపీచంద్.

'కనుక ? ఏమంటారు ? కుర్రాడిని యిక్కడినుంచి తీసుకెళ్లి వాళ్లకి అప్పచెప్తామంటారా ?'

గోపీచంద్‌వైపు భయంగా చూచాడు వెంకన్నబాబు.

అతడిని ప్రేమగా హృదయానికి మరింత దగ్గరిగా పొదివిపట్టుకొన్నాడు.

నవ్వుతూ తల అడ్డంగా వూపేడు గోపీచంద్.

'కానీ మీరు అనుమతిస్తే యివ్వాడు వెంకన్నను నాతో తీసుకు వెళ్తాను. ఎలాగూ శలవులేనంటున్నారుగా ?'

'ఎక్కడికీ తీసికెళ్తారు ? మీరు యిప్పుడు సినిమా ఫీల్డుకు వెళ్లిపోయారు కదా ? అన్నట్లు ఆ అవార్డు గురించి యిాకాంట్రోవర్సీ ఏమిటండీ ? శ్రీమన్నారాయణగారు తనే అంతాచెప్పి మీచేత రాయించానంటున్నాడే ? అంత చెప్పే సత్తా వుంటే తనే రాయవచ్చు గదా ? లేకపోతే ఆ చెప్పేదేదో వో టేప్‌రికార్డ్‌కు చెప్తే అంతా రికార్డు చేసి పెడుతుందిగా ? యింతకీ అవార్డు మూల కథకిస్తారా లేక సినిమాకథకిస్తారాండి ? నన్నడిగితే సినిమా కథకన్నా మీ నవలలో మూలకథ బాగుంది. దానికివ్వాలి బహుమతి.'

చెప్పుకుపోతూనే వున్నాడు ప్రిన్సిపాల్. సినిమా విషయాలు అందరికీ ఇంటరెస్ట్ ! హోదాలు, అధికారాల తారతమ్యం లేదు. అందుకే సినిమా అంత పవర్‌ఫుల్ మీడియం అయింది.

నవ్వి అతడిని తృప్తిపర్చేలా సినిమాలను గురించి కొంత మాట్లాడేడు గోపీచంద్.

'మీరేదో సినిమాకు దర్శకత్వం కూడా వహించబోతున్నారుకదా ? కథ, సంభాషణలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అని త్వరలో వేసుకొంటారన్నమాట ! అవునూ ? మీరు పాటలెందుకు రాయరూ ?'

'నేను కవిని కాదండీ. కవిత్వం చాతకాదు.'

'భలేవారే. మీ డైలాగుల్లో కవిత్వం లేదంటారా ఏమిటి ? దాన్నే విరిచేసి పొడుగ్గా పేరిస్తే కవిత్వం అవుతుంది. యివాళ రేపు కవులు మీకన్నా బాగా రాస్తున్నారనుకుంటున్నారా ?'

మొత్తానికి వెంకన్నబాబును తీసుకెళ్లటానికి అనుమతించాడాయన. అయితే అందుకు వొక్క కండిషన్ పెట్టేడాయన.

'మీరు మాయింటికి వచ్చి మాతో కల్సి 'లంచ్' చేయాలి.'

యింత చేస్తే యివా కండిషన్ తియ్యటి కండిషన్.

'ఎందుకండీ ? అనవసరంగా మీకు శ్రమ.'

'భలేవారే. మీరు మా స్కూలు వరకు వచ్చి యింటికిరాకుండా పోతే నా భార్యా పిల్లలు వూరుకొంటారా ? వాళ్లంతా మీ అభిమానులండీ బాబూ. మీరే చూస్తారుగా ?'

ఆశించిన ఆ డైలాగ్ ఆయన్నుంచి రావటంతో గోపీచంద్ మనసుకు తియ్యటి కిక్ తగిలినట్లయింది. ఆ 'కిక్'లో ఎంత ఆనందం వుంది ! అతను తన్మయుడయ్యాడు.

15

సినిమా ప్రపంచం అంతా తరలివచ్చిందా అన్నట్లు లేదా సభ, ఒకవేళ అలా సినిమా పరిశ్రమలోని వారంతా తరలివస్తే మరొకరికి కూర్చోటానికి ఆ హాల్లో సీటు మిగలదు.

ఇప్పుడు లభిస్తున్న

డిలక్స్

నిరోధ్

మరింత నునుపైనది



సున్నిత మనస్కులైన దంపతులకు

అయిదింటికి
రూ. 1/-

★ ఉత్తమమైన నాణ్యత గలది.
★ ఎలక్ట్రానిక్ సాధనాలతో పరీక్షింపబడినది.

అన్ని పెద్ద పట్టణాలలో
విక్రయింపబడుచున్నది

davp 84/28

దొ గు డు మహా త లు

బహుమతులు వచ్చిన ప్రముఖులు, అప్రముఖులు అందరూ వచ్చారు. తెరమీద కన్పించే పెద్ద చిన్న తారలను చూడటానికి జనం ఎగబడుతున్నారు. తెరవెనుక వుండే టెక్నీషియన్లు ప్రక్కనుంచే పోతున్నా పట్టించుకొనే నాథుడు లేడు.

ఆ తోపిడిలో ఎవరో టెక్నీషియన్ని పోలీసులు లోపలికి పోనివ్వకుండా అటకాయించారు. ఆయన పాస్ చూపినా ప్రవేశం దొరకలేదు.

మొత్తంమీద సభ ఆరంభమయింది. బహుమతులు యివ్వటానికి రాజకీయవేత్తలు, రిటైర్డు సినిమా ప్రముఖులు స్టేజీమీద ఆసీనులయ్యారు.

గోపీచంద్ ఎలాగో లోపలికి ప్రవేశించి శ్రీమన్నారాయణగారి కోసం మొదటి రెండు వర్సలు చూచాడు. ఊహూ...

'సార్. అసలే చోటులేదు. ఆ కుర్రాడిని మీ వొళ్లో కూర్చో పెట్టుకోండి. సీటులేని పెద్దలు చాలామంది వున్నారు.'

గోపీచంద్ పక్కన కూర్చున్న వెంకన్నబాబును లేపి తన వొళ్లో కూర్చోబెట్టుకొన్నాడు. అతను ఎనిమిదో వరసలో సీటు సంపాదించ గలిగేడు.

అక్కడ ఎవరి సంగతి వాళ్లు పట్టించుకోటానికి వీలులేని స్థితి. ఎదుటివాడిని గురించి ఎవరు పట్టించుకుంటారు ?

స్టేజీమీద కూర్చోటానికి చోటు లేనందువల్ల బహుమతులు వచ్చినవాళ్లను స్టేజీమీద కూర్చోటానికి ఆహ్వానించలేదు. ప్రముఖులు మాత్రమే కూర్చున్నారు.

ఉపన్యాసాలయ్యాయి. బహుమతి ప్రదానోత్సవం ఆరంభమయింది.

ప్రముఖ తారలు బహుమతులు తీసుకోటానికి స్టేజీమీదికి వచ్చినప్పుడు చప్పట్లు కొట్టేరు జనం. వాళ్లు మాట్లాడాలని అరిచేరు. గాయనీ గాయకులు వస్తే పాటలు పాడమన్నారు.

కానీ ఫొటోగ్రఫీ, ఎడిటింగ్ శాఖలకు సంబంధించిన టెక్నీషియన్లు బహుమతులు తీసుకొంటుంటే చప్పట్లు కొట్టటానికి కూడా జనం లేరు. గోపీచంద్‌కు బాధవేసింది. ఏం ట్రేజిక్ సిచ్యుయేషన్ ?

కథా రచయితలుగా శ్రీమన్నారాయణను, గోపీచంద్‌ను పిలిచేరు. శ్రీమన్నారాయణగారు లేవలేదు. ఆయన పంపించాడంటూ ఎవరో వో చీటీని నిర్వాహకులకు అందచేసేరు.

గోపీచంద్ స్టేజీమీది కెళ్లేరు. చెదురుమదురుగా కొందరెవరో చప్పట్లు కొట్టేరు.

'గోపీచంద్‌గారు మాట్లాడాలి' బహుమతి తీసుకొంటుంటే కొందరు అరిచేరు.

అధ్యక్షుడి అనుమతితో గోపీచంద్ మైక్‌ముందు కొచ్చాడు.

'నన్ను చిత్రసీమకు రచయితగా పరిచయం చేసింది శ్రీ శ్రీమన్నారాయణగారు. ఆయనకు ప్రప్రథమంగా నా ధన్యవాదాలు చెప్పుకొంటున్నాను. యీ బహుమతిని గురించిన 'కాంట్రోవర్సీ' మీకు తెల్సిందే. నేను దానికి జవాబివ్వాలని చాలా మంది కోరేరు. మీరు వినదల్చుకొంటున్నది అదేనని నాకు తెల్సు. యీ బహుమతి శ్రీ శ్రీమన్నారాయణగారికి చెందవల్సినదే.'

'ఎందుకంటే శ్రీమన్నారాయణగారు నా మూలకథ అయిన నవలను చదివి నన్ను పిలిపించారు. పిలిపించాక నాకు చాలా సినిమాలు చూపించారు. ఆ తర్వాత చర్చలు చేసేం. కొత్త కథను తయారు చేసేం. బహుమతి వచ్చింది ఆ కథకే అవుతే ఆ సినిమాల రచయితలందరికీ, దర్శకులందరికీ, వారు చదివిన నవలల రచయితలకీ, వాళ్ళ

చూచిన సినిమాల రచయితలకీ, దర్శకులకీ... యిలా చాలామంది కివ్వాల్సి వుంటుంది. అలా దూరదృష్టితో, విశాల హృదయంతో చూచి అన్ని వందల మందికి బహుమతులివ్వటం సాధ్యం కాదుకనుక, ముందు నాకు, ఆ తర్వాత నాకు శ్రీమన్నారాయణగారికి జాయింట్‌గా యీ బహుమతిని 'సింబాలిక్'గా యిద్దామని బహుశా నిర్ణేతలు నిర్ణయించి వుండాలి. శ్రీమన్నారాయణగారు ఎందుచేత బహుమతి స్వీకరించటానికి రాలేదో నాకు తెలియదు. కానీ నేను మాత్రం, నాకు బహుమతి నిద్దామను కొన్నందుకు కృతజ్ఞతనుతెల్పి, నేనీ బహుమతికి అర్హుడినికానని, చిత్ర సీమలో అనుభవజ్ఞులైన శ్రీమన్నారాయణగారు మాత్రమే యీ సన్మానానికి అర్హులని మీ అందరికీ మనవి చేయడానికి వచ్చాను.' గోపీచంద్ చాలా సిన్సియర్‌గా చెప్తున్నట్లే వుంది పైకి. అవుతే అతను మాట్లాడుతున్న ప్రతి వొక్క వాక్యం వెనుకకల ఎత్తిపొడుపు సెటైర్ అయ్యాక జనం వెర్రిగా ప్రతి కావ్యానికీ చప్పట్లు కొట్టసాగేరు.

'అయితే నేను బహుమతిని ఎందుకు స్వీకరించాను ? కథారచనకు సంబంధించినంతమేరకు సినిమా రంగంలో సంపూర్ణ సత్యమంటూ వుండదన్న సత్యం మీ అందరికీ తెల్సిందేకదా ? వొక సినిమా కథయొక్క మూల స్వరూపాన్ని కంటికి కన్పించే దృశ్యాలనుంచి బ్రహ్మ పదార్థాన్ని బయటికి తీయడమే. ఆ మాటకొస్తే కథను సంబంధించినంతవరకు చిత్ర రంగంలో అందరూ అద్వైత సిద్ధాంతులే. ఆత్మ పరమాత్మలన్న భేదంలేదు. అంచేత సింబాలిక్‌గా ఆ బహుమతిని స్వీకరించాను. సింబాలిక్‌గా మరలా దాన్ని తిరిగి యిచ్చివేస్తూ, మీ అందరికీ ధన్యవాదాలు చెప్పుకొంటూ శలవు తీసుకొంటున్నా.'

అతని మాటల్లో సెటైర్ తెల్సి కొందరు, తెలీకపోయినా కొందరు అంతా హాలు దద్దరిల్లేటట్లు చప్పట్లు కొట్టేరు.

* * *

'గోపీచంద్ సాహిత్యాభిమానులు' ఏర్పాటుచేసిన సభకు అవార్డు ప్రధాన సభకు వచ్చిన జనంకన్నా ఎక్కువమంది వచ్చారు. అందుకు మొదటికారణం అది ఫ్రీ. ప్రవేశం వుచితం. రెండవ కారణం—నిన్నటి బహుమతి ప్రధానసభలో గోపీచంద్ ప్రసంగం. పత్రికలు అతని వుపన్యాసానికే ప్రాధాన్యత నిచ్చాయి. అందులోని వ్యంగ్యాన్ని గురించి వ్యాఖ్యలు చేసేయి. వొక పత్రిక ఎడిటోరియల్ కూడా రాసింది.

సినిమా రంగంలో వాళ్లకి కోపం వస్తుందేమోనని భయపడ్డాడు గోపీచంద్. కానీ సినిమా పరిశ్రమలోని పెద్దలంతా అతడి ప్రసంగాన్ని పొగిడేరు. కొందరు నిజంగా పొగిడితే మరికొందరు అందరూ పొగుడుతున్నారు కనుక పొగిడేరు.

ఆఖరికి వొకరాత్రప్పుడు శ్రీమన్నారాయణ కూడా అతని హోటల్ గదికి ఫోన్ చేసేడు.

'ధన్యవాదాలు మిస్టర్ గోపీచంద్. బహుమతికి నేనే అర్హుడినని చెప్పేవుటగా ? కానీ నిజానికి నువ్వే అర్హుడివోయ్. అది ఆలోచించే నేను సభకి రాలేదు. పోనియ్‌లే, గురువు గౌరవాన్ని నిలబెట్టేవ్. యిక ముందుకాలం ఎలాగైనా యువకులైన మీదేనోయ్. మేం పెద్దవాళ్లమయిపోతున్నాంగదా ?'

నవ్వొచ్చింది గోపీచంద్‌కి.

ప్రజలలో పాప్యులారిటీ పొందుతున్నవాడివి. వాడు ఉమ్మేసినా తుడిచేసుకొని వెంటబడి పొగుతారు. వుపయోగించుకొంటారు. డబ్బు చేసుకొంటారు. డబ్బు...డబ్బు...డబ్బు. మనుషులు, వారి ప్రతిభ అన్నీ కమోడిటీస్. సరుకులే—వ్యాపార సరుకులు !

'యిప్పుడు గోపీచంద్‌గారు మాట్లాడుతారు.

గోపీచంద్ మాట్లాడటానికి లేవగానే జనం చప్పట్లు కొట్టేరు.

చప్పట్లు కొట్టగానే ఎదిగిపోయాడు గోపీచంద్.

నిన్న అంతే. చప్పట్లు కొట్టకపోతే నీరుకారిపోయాడు. అంతలో వొక డైలాగు పేలింది. జనం చప్పట్లు కొట్టేరు. దాంతో ఎదిగిపోయాడు. తను అంత బాగా మాట్లాడుతున్నట్లు తనకే తెలియదు !

చప్పట్లు తనకి ఆత్మవిశ్వాసాన్ని వుత్సాహాన్నిస్తాయా ?

అతను నిన్నటి ధోరణిలోనే సినిమారంగంలోని పోకడలను గురించి చాకిరేవు పెట్టేడు. పోతిక్షమంది వొకేసారి చాకిబండకేసి గుడ్డల్ని వుతుకుతున్నట్లు చప్పట్లు...చప్పట్లు.

ఆ వుత్సాహంలో అతను ఆ ప్రకటన చేసేడు.

'నేను ప్రస్తుతం దర్శకత్వం వహించి తీస్తున్న సినిమాలో సినిమా వాస్తవికంకన్నా నిజవాస్తవికం ఎక్కువగా ప్రతిబింబించేందుకు కృషి చేస్తానని మాట యిస్తున్నాను. ఆ కథ వాస్తవం. అందులో పాత్రలు, దృశ్యాలు వాస్తవం.

ఆ సినిమాలో వో ముఖ్యపాత్రను వేసే వ్యక్తిని మీకు యిప్పుడు పరిచయం చేస్తాను.'

అంతా ప్రేక్షకులలో ముందు వరుసలలో కూర్చున్న యువతీ యువకులవైపు చూచారు.

'యింతవరకు నేను చెప్పబోయే వ్యక్తికికూడా తను నటించబోతున్నానని తెలియదు. నిజానికి అతను నటించడుకూడా'

ఎవరో ఆ అదృష్టశాలి ?

తమకే ఆ అదృష్టం కలగాలన్న కోరిక — ఆశ — ఎవరికివారికే !

'వెంకన్నబాబూ... వొకసారి యిలా రా నాన్నా...'

వెంకన్నబాబు బెరుకుబెరుకుగా చూస్తూ స్టేజీమీదికొచ్చాడు.

యింతా చేస్తే యీ కుర్రాడా ?

'యీ దురదృష్టవంతుడు మూగవాడు. కానీ జడుడు కాడు. మనసున్న మనిషి యీ చిరంజీవిని మీరు ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నా. వెంకన్నబాబూ. సభవారికి నమస్కరించు.'

వెంకన్నబాబు నమస్కరించగానే చప్పట్లు కొట్టేరు జనం.

(ఇంకా వుంది)

సంపాదించు

అధికార మద బధిరాంధ శవాల దగ్గర ప్రాపకాన్ని కాదు.
ఏరాళమిచ్చి మెడికల్ కాలేజీలో సీటు కాదు
వద రూపాయలు ఎక్కువ ఇచ్చి
త్రీ టయర్ కోచిలో బెర్తు కాదు.
బ్లాకులో సినిమా టికెట్లు కాదు.
(దొ క్కాచింపుకుని) సినిమా నటి ఆటోగ్రాఫు కాదు.
వాయిదాల పద్ధతి మీద స్టీలు సామానూ కాదు.
కొనుక్కోవడం, చేయించుకోవడం, తినడం.
ఇంతేనా జీవితం అంటే? కానే కాదు
ఈ "పంజీకటి కప్పుల" వెలిగేది ఏదో ఉంది —
దాన్ని తెలుసుకునే జ్ఞానాన్ని సంపాదించు.

— కల్హూరి సత్యరామప్రసాద్.

కట్న దాహానికి మరో కాంత బలి!

ఆంధ్రప్రదేశ్ రంగారెడ్డి జిల్లా తాండూరు తాలూకా రెడ్డి గణాపూరుకు చెందిన 20 ఏళ్ళ శాంతమ్మను ఆమె భర్త, అత్త మామలు నిత్యం కట్నం మరింత పట్రా అని కాల్చుకు తిని, తినీ సంతృప్తి లేక, డబ్బులు రాలక ఆగష్టు 2 వ తేదీన ఆమెను చావ కొట్టి, నూతిలో పారేసి, శాంతమ్మ ఆత్మహత్య చేసుకుందని రిపోర్టిచ్చారట. ఈ కథంతా పోలీసులకు చెప్తూ ఆమె అన్నగారు బసప్ప తన చెల్లెలు హత్య జేయబడిందనీ, హంతకులను పట్టుకుని శిక్షించాలనీ పోలీసులను కోరాడట.

సిగ్నలిచ్చిన చెయ్యి అంతర్ధానం!

కేరళ గ్రామం చెంగన చెర్రికు చెందిన పద్మరాజన్ అనే వో లారీ డ్రయివరు మత్తు మందు మస్తుగా సేవించి దారినపోతూ తనని దాటి పోడానికి వో వాహనానికి సిగ్నలిస్తూ కుడి చెయ్యి బయటికి జాపేసరికా వెనుక వాహనం సర్రున వెళ్ళిపోయిందట. కొంత సేపు అయ్యాకా పద్మరాజన్ తన కుడి చెయ్యి కనబడలేదని గ్రహించి, లారీ వెనక్కి తిప్పి వెళ్ళి చూస్తే రోడ్డుమీదుందట. దాంతో సహా అతను ఆసుపత్రిలో చేరాడట.

పాల రక్షణకు మెటలు బాడీలు!

ప్రపంచంలోని ఆవులలో కల్లా అధిక పాలు పాల నిచ్చే ఆవులు స్వీడను జాతి వట. మన దేశపు ఆవుల కివి ఫది రెట్లయినా పాలు యిస్తాయట. ఆ దేశంలోని ఈ పశువుల పాలు దొంగతనాలు జరుగుతూండడం వల్ల వో కంపెనీ వారు యీ ఆవుల సైజులకు "మెటలు బాడీలు" తయారు చేసి, అమ్ముతున్నారట. ఈ మెటలు బాడి తగిలించి వీపు మీదికి లాక్ చేస్తే యిహ పాల దొంగతనానికి తావుండదని ఆ కంపెనీ ప్రకటనలిస్తోందట.



కోర్టు కెక్కిన గడ్డం సమస్య!

తాను మత పరంగా పెంచిన గెడ్డాన్ని తీయమని తన శాఖ వారు తనను శాసిస్తున్నారని కేరళకు చెందిన మహమ్మద్ ఫకీస అనే ఆయన కోర్టును శరణు జొచ్చితే మూణెళ్ళ వరకూ ఆతని గడ్డం విషయంమీద అతను పని చేస్తున్న పోలీసు శాఖ ఏ ఆర్డరూ వేయరాదని తత్కాలిక ఇంజక్షనిచ్చిందట కోర్టు.

పగతో తండ్రి హత్య!

వరంగల్ జిల్లాకు చెందిన మహబూబాబాద్ ముల్కలపల్లి గ్రామంలో 55 ఏళ్ళ షేక్ మల్సూర్ 13 వ తేదీ రాత్రి ఆరు బయట నిద్రపోతుండగా ఆతని కుమారుడు ఫకీర్ సాహెబ్ కొంతమంది అనుయాయులతో వచ్చి ఆతన్ని గొడ్డళ్ళతో, కత్తులతో, కర్రలతో కొట్టి చంపి వేశారట. ఫకీర్ సాహెబ్‌కు తన తండ్రిమీద పగకు కారణం తెలియలేదటింకా.

బలత్కార యత్నానికి కారాగార శిక్ష!

వనపర్తికి చెందిన కాశీ నగరం అనే గ్రామంలో చిన్న పెంటన్న అనే వ్యక్తి వో స్త్రీని బలత్కారం చేయ యత్నించాడన్న నేరాని కాతనికి మున్సిఫ మాజస్ట్రేటు ఆరు నెలలు కఠిన కారాగార శిక్ష విధించారట. బలాత్కారానికా, యత్నానికా ఈ శిక్ష!

విధి చేతిలో కీలు బొమ్మ!

అలనాడు టాకీ రాని కాలంలో మూకీ సినిమాలలో మూకుమ్మడిగా నటించి, బోల్డు పేరును, కొంత ధనాన్ని సంపాదించిన హాలీవుడ్ నటుడు జార్జ్ రేఫ్ట్ తన ఆస్థులను బ్రిటనులోనే నిర్మించుకున్నాడట. సినిమాలనుంచి రిటైరయ్యాక బ్రిటనులో వో జూద గృహానికి డైరెక్టరుగా పని చేస్తూ వోసారి అమెరికా వెళ్ళాడట. అతను పని చేస్తున్న జూద గృహంమీద అనేక నేరాలు మోపి, రేఫ్ట్ తిరిగి బ్రిటను రారాదని ఆ ప్రభుత్వం 1967 లో ఆజ్ఞ విధించిందట. దాంతో అక్కడి అతని ఆస్థులు పోయి, అమెరికాలో వున్న కొన్ని ఆస్థులూ టాక్సువారు తన్నుకుపోయారట. అతడు యిప్పుడు తన 84 వ ఏట వో అయిదు స్టార్ల హోటలులో రిజర్వేషను క్లర్కుగా వుద్యోగం చేస్తూ, ఏకాకి జీవితాన్ని కొనసాగిస్తున్నాట్ట. విధి నిర్ణయం చిత్రమైన దంటా రందుకే.

ఫుట్ బాల్ ఆటలో ప్రపంచ రికార్డు!

ఫ్రాన్సుకు చెందిన బోర్డియాక్సుకు చెందిన వో ఫుట్ బాలు ఆటగాళ్ళ టీము ఏకబిగిన 26 గంటలు ఆడి ప్రపంచ రికార్డు స్థాపించిందట. ఈ టీము యీ 26 గంటల్లో 8 ఆటలు గెలిచి, మూడు వోడిపోయి, రెండు డ్రా చేసిందట.

జయపూర్ మ్యూజియంలో నీళ్ల బిందెలు!

అలనాటి జయపూరు మహారాజు వైభవం చాటుతూ, ఆనాడుజైపూరులో "మాన్‌సింగ్ మహారాజు మ్యూజియం"లో వో రెండు పెద్ద సైజు నీళ్ళ బిందె లున్నాయట. ఈ బిందెలు ఒక్కొటి అయిదడుగుల నాలు గంగుళాల ఎత్తూ, 8 అడుగుల 2 అంగుళాల పరిధీ వుండి, సుమారు 308 కిలో గ్రాముల బరువు వున్నాయట. ఈ బిందెలు చేయడానికి అలనాడు 60,063 రూపాయల 7 అణాల 3 దమ్మిడీలు ఖర్చు అయిందట.

ప్రేమ కానుకగా పిస్టల్

అమెరికాలోని వో తుపాకుల కొట్టు సొంతదారుడు బిల్లీ హార్పన్ తన వ్యాపారం సమ్ముకునే సరికి వో అయిడియా వేసి, పురుషులు తాము మెచ్చే స్త్రీలకు, ప్రియులు ప్రేయసిలకు పిస్టలు ప్రజంటు యివ్వాలని, అదే అసలైన, సిసలైన ప్రేమ కానుకనీ నూటొక్క ప్రకటన్లు చేసే సరి కాతని వ్యాపారం విజృంభించిందట. అమెరికాలో యీనాటి లెక్కల ప్రకారం నిముషానికి 120 తుపాకులు అమ్ముడవుతున్నాయట. ప్రతి గంటకూ ఎక్కడో ఎందుకో యిద్దరు కాల్పుల మరణాలు పొందుతున్నారట. ఫార్వర్డ్ కంట్రీ. □



ఏమిటీ లోకం....?



లక్ష్మీ శ్రీనివాసన్

"పిల్లలేరి కమలా?" అన్నాడు ఇంట్లోకి అడుగు పెడుతూనే రమణమూర్తి.

"ఆట నుంచి ఇంకా రాలేదండీ! అదేమిటి మీరు ఉత్త చేతుల్తో వచ్చారు...బట్ట లేవి?" రమణమూర్తి మొహంలోకి చూస్తూ అంది కమల.

"తీసుకురాలేదు...అడ్వాన్సు పది రోజులు పోయాక ఇస్తా నన్నా రాయన" నిస్పృహగా అన్నాడు రమణమూర్తి.

"పండుగ కూడా పది రోజులే కదండీ వుంది....-ఆయన అడ్వాన్సు అప్పుడిస్తే బట్ట లెప్పుడు తీస్తారు?....ఎప్పుడు కుట్టిస్తారు?" ఆశ్చర్యంగా అడిగింది కమల.

"నిజమే, ఆ సంగతి నాకు తెలియక కాదు. మొన్న అడిగిన పండుగ అడ్వాన్సు ఈవేళ జీతంతో బాటు ఇచ్చేస్తారన్న వుద్దేశ్యంతో బట్టలు తెస్తానని నమ్మకంగా చెప్పాను. కానీ, ఇలా జరుగుతుందనుకోలేదు...."

"ఎలా జరిగినా పిల్లలకు కావాల్సినవి బట్టలు.... వాళ్ళ కివన్నీ అర్థం కావు!" అతడి మాటలకు అడ్డొస్తూ అంది కమల.

"అయితే నన్నిప్పుడేం చెయ్యమంటావు చెప్పు?"

"ఏమో ఏం చేస్తారో...ఒకసారా రెండు సార్లా - ఇప్పటికెన్నాళ్ళ నుండో వాళ్ళను మభ్యపెట్టుకొస్తున్నాం! ఏమైనా ఈ పండక్కి బట్టల్లేకపోతే వాళ్ళూరుకునేలా లేరు" అని టీ తీసుకు రావడానికి వంట గదిలోకి నడిచింది కమల.

కమల మాటలు మననం చేసుకుంటూ పిల్లలకేం సమాధానం చెప్పాలా అన్న ఆలోచనలో పడ్డాడు రమణమూర్తి.

తమ ఇంటి కెదురుగా వున్న ఎర్ర త్రికోణం బోర్డును చూస్తూనే....ఎక్కువ మంది పిల్లలతో ఇరుగు, పొరుగు వాళ్ళు పడుతున్న బాధల్ని చూస్తునే నలుగురు పిల్లలకు తండ్రయ్యాడు రమణమూర్తి. అతడా పట్నంలో ఓ చిన్న కార్ల రిపేర్ షెడ్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. నెలకో నాలుగు వందల యాభై వరకూ జీతం వస్తుందతనికి. కావాల్సిన వాళ్ళంటూ వున్నా ఆ పట్నంలో ఎవరూ లేరు - ఎక్కడెక్కడో వున్నా, ఎవరూ అతన్ని పట్టించుకునే స్థితిలోనూ లేరు....ఎందుకంటే...-ఇప్పటి పరిస్థితుల్ని బట్టి ఎవరి గొడవలు వాళ్ళవి - ఎవరి సంసారాలు వాళ్ళవి. అమ్మా, నాన్నా, అన్నా, తమ్ముడూ, అక్కా, చెల్లీ - అన్న రక్త సంబంధాలు కూడా పట్టించుకోని స్థితికి మనుష్యులు చేరిపోతున్నారంటే ఎవరూ ఆశ్చర్యపోనవసరం లేదు.

చాలా తక్కువ జీతం వచ్చినప్పుడు ఎంతో చక్కగా జరిగిన తన సంసారం - ఎంతో కొంత జీతం ఎప్పటి కప్పుడు పెరుగుతున్నా ఇప్పుడెందుకు జరగడం లేదో, దీనికి కారణం తనలో వుందో, రోజురోజుకూ పెరిగి పోతూన్న ధరల్లో వుందో అర్థం కాక సత మత మవుతూ సంసారం నడుపుకొస్తున్నాడు రమణమూర్తి. అదేమిటో ఎంత పొదుపుగా జరుపుకొస్తున్నా ఎప్పుడూ ఏదో కలో టే!.....

బట్టలన్నీ చిరిగి పోయాయని ఇటీవల పిల్లలొకటే గొడవ....'అదిగో....ఇదిగో....' అంటూ సుమారు సంవత్సరం నుంచి వాయిదా వేసుకొస్తున్నాడు వాళ్ళకు. పోనీ ఈ సంక్రాంతి పండక్కయినా కుట్టించి పడేద్దామంటే అదీ సాధ్యపడేటట్టు లేదు.....

"టీ తీసుకోండి!" అంటూ గ్లాసతడి కందించి - గదిలో లైటు వేసింది కమల.

రమణమూర్తి తన ఆలోచనలు కట్టి పెట్టి టీ గ్లాసలా నోటి ముందుంచుకున్నాడో లేదో-

ఉత్సాహంగా గెంతుతూ ఇంట్లోకి ప్రవేశించారు పిల్లలు. ఎదురుగా వున్న తండ్రిని చూస్తూనే "బట్టలేవి నాన్నా?" అంటూ అతడి దగ్గర చేరారు.

టీ త్రాగకుండానే గ్లాసు ప్రక్కన పెట్టి మౌనంగా వుండిపోయాడు రమణమూర్తి.

తండ్రి మౌనం చూసి తమకు బట్టలు తేలేదన్న విషయం పిల్లల కర్థమైపోయింది. "మీరు మళ్ళీ శివరాత్రికో, సంవత్సరాదికో బట్టలు కుట్టిస్తానని చెప్పాలనుకుంటున్నట్టున్నారు. ఈవేళ బట్టలు తియ్యకపోతే మేం వూరుకునేది లేదు!" అన్నాడు పట్టుదలగా పధ్నాలుగేళ్ళ ప్రసాద్.

"వినాయక చవితన్నారు. విజయదశమన్నారు. దీపావళన్నారు.... అన్ని అబద్ధాలే....మళ్ళీ మాకు అబద్ధాలు ఆడకూడదని చెప్తారు!" కాస్త ఆవేశంగా అన్నాడు పదమూడేళ్ళ ప్రకాశం.

"పండుగ చూస్తే పది రోజులు కూడా లేదు. మీరీ వేళయినా బట్టలు తేకపోతే అప్పటి కప్పుడు ఏ టైలరు కుట్టిస్తాడు నాన్నా?" అసలు సిసలైన సందేహాన్ని బయట పెట్టాడు పన్నెండేళ్ళ చిన్నారావు.

"ఆ ఎదురింటి సరోజకూ, సావిత్రికీ వాళ్ళ నాన్నగారప్పుడే పండగ బట్టలు కుట్టించి తెచ్చేశారు. మీరు మా కింకా బట్టలే తియ్యలేదు!" ఏడుపు స్వరంతో అంది వాళ్ళ ఒక్కగా నొక్క ఆడపిల్ల ఆదిలక్ష్మి.

వాళ్ళ మాటల్లో వ్యక్తమయిన ఆవేశం, నిరాశ, దీనత్వం గ్రహించిన రమణమూర్తికి గుండెల్లో సూదులు గ్రుచ్చినట్టనిపించింది. అతడంత రంగంలో అవ్యక్తమయిన బాధ ననుభవిస్తూ నిస్సహాయంగా భార్య వైపు చూశాడు.

తన అంచనాకు మించి పిల్లలు మాట్లాడిన మాటలూ, భర్త నిస్సహాయ స్థితీ చూస్తుంటే కమలకేం పాలుపోలేదు. వాళ్ళ నెలా సముదాయించాలో అర్థం కాలేదామెకు

"నాన్నకు డబ్బు అమర్లేదర్రా....సంవత్సరాదికి తప్పనిసరిగా కుట్టిస్తార్లెండి...." అంది కొన్ని క్షణాల తర్వాత.

ఆ పాత పాట వినగానే పిల్లల్లో ఆవేశం ముంచుకొచ్చింది. అది వ్యక్తపరచే ధైర్యం లేక ఏడుపు రూపం ధరించింది.

వాళ్ళనిక ఓదార్చడం కష్టమనిపించింది కమలకు. రమణమూర్తి ఉలుకూ–పలుకూ లేకుండా అలాగే కూర్చొని వున్నాడు. "నాన్నచేత నేను బట్టలు తెప్పిస్తాను గాని ముందు మీరు ఏడుపు కట్టిపెట్టి వెళ్ళి స్నానాలు చెయ్యండి!" అంది కాస్సేపటి తర్వాత ఒక నిశ్చయాని కొచ్చిన కమల.

సందేహాస్పదంగా తల్లిని చూస్తూ నిమిషం తర్వాత పిల్లలక్కడ్నుంచి కదిలారు. ఆశ్చర్యంగా కమల మొహంలోకి చూశాడు రమణమూర్తి.

"ఏదీ మీ జీతం ఎంతొచ్చిందో ఇటివ్వండి!" అంది పిల్లలటు వెళ్ళగానే కమల.

తన దగ్గరున్న నాలుగు వందల పాతికా తీసి కమల కిచ్చాడు రమణమూర్తి.

"ఈ నూట యాభై తీసుకెళ్ళి ఏవో చౌక రకం గుడ్డలు నలుగురికీ తీసుకురండి. మనం ఇచ్చిన అడ్వాన్సు ఈ నెల అద్దె క్రింద చూసుకోమని ఇంటి యజమానికి చెబుతాను. చేబదులిచ్చిన సుబ్బలక్ష్మిని వడ్డీ కట్టి వూరుకోబెడతాను...మనం చచ్చే వరకూ ఈ సమస్య లుండేవే....మాటల మత్తు మందు జల్లి మభ్యపెడుతున్నామని పిల్లల కర్థమైపోయింది. వాళ్ళిక వూరుకోరు. మీరు తొందరగా వెళ్ళొచ్చేయండి....." అంటూ ఆ డబ్బులో నూట యాభై తీసి అతడి కిచ్చింది కమల.

వింతగా భార్య వైపో మారు చూసి, మారు మాట్లాడకుండా లేచి బయటి కొచ్చాడు రమణమూర్తి. శీతాకాలపు చలి గాలి ఆవేళప్పుడే ప్రారంభమైంది. అతడు చేతులు గుండెల మీదకు చేర్చుకుని నెమ్మదిగా నడుస్తూ – అర గంట తర్వాత మెయిన్ బజార్లో ప్రవేశించాడు. అనేక రకాల షాపులతో...వాటి నలంకరించిన విద్యుద్దీప కాంతులతో బజారు వింత అందాల్ని సంతరించుకొంది. రానున్న సంక్రాంతి సంరంభంతో; క్రిక్కిరిసిన జన సందోహంతో హడావుడిగా వుంది....

పాతిక రూపాయలకే చీరని మైక్‌లో చెబుతున్నారో షాపులోంచి; తమ మిల్లు బట్టలు కొంటే ట్వంటీ ఫైవ్ పర్సంట్ తగ్గింపని పదే పదే చెబుతున్నారు మరో షాపులోంచి; నకిలీ వస్త్రాలు చూసి మోసపోవద్దు ...మీసేవలో మా కరనై ఏళ్ళని అదే పనిగా పాట పాడుతున్నారింకో షాపులోంచి. అవన్నీ వింటూ – షాపుల అందాల్ని కన్నులారా కంటూ – బజారు చివరినున్న చిదంబరంగారి బట్టల కొట్లో కడుగు పెట్టాడు రమణమూర్తి. అక్కడన్ని రకాల బట్టలూ వుంటాయి. కానీ, అవి ఎన్నాళ్ళు మన్నుతాయో చెప్పలేం!...

రమణమూర్తిని చూడగానే అతడికేం కావాలో గ్రహించినట్టు రక రకాల డిజైన్స్ గల కాటన్ రోల్స్ తీసి పడేసి వాటి రేట్లు వివరించాడు చిదంబరం....– అంతటితో ఆగకుండా తన మాటల చాతుర్యంతో రమణమూర్తిని సమ్మోహితుణ్ని చేసి–మొత్తాని కతడి చేత బట్టలు కొనిపించాడు.

తను పట్టుకొచ్చిన డబ్బులో మిగిలిన అయిదు రూపాయల చిల్లరా జేబులో వేసుకొని; చిరునవ్వుతో చిదంబరం అందించిన బట్టల ప్యాకెట్ చేత్తో పట్టుకొని ఆ కొట్లోంచి బయట పడ్డాడు రమణమూర్తి.

ఇంటికి రాగానే అతడి చేతిలో వున్న ప్యాకెట్టు కలబడి లాక్కున్నంత పని చేశారు పిల్లలు. కొత్త బట్టలమీద వాళ్ళ కున్న సరదా చూసి రమణమూర్తికి తన చిన్నతనం గుర్తు కొచ్చింది – సంక్రాంతికో జత, దీపావళికో జత కుట్టించి తను తొడుక్కు తిరుగుతుంటే ఆనందంతో పొంగిపోయే తల్లీ, తండ్రీ గుర్తొచ్చారు....'అదంతా కల. . ఓ అందమైన కల ..' అతడలా అనుకుంటూండగానే – ప్యాకెట్ విప్పి బట్టలు తీసి చూసిన పిల్లల మొహాలు మాడిపోయాయి...

"రిక్షావాడు కూడా ఏలిష్టర్ షర్టు తొడుక్కుంటున్నాడు నాన్నా!' అనేశాడు పెద్దాడు

"ఎప్పుడూ ఈ చౌక రకం గుడ్డలేనా?" అంటూ చేతిలో వున్న ఫ్యాంటు ముక్క విసిరేశాడు రెండో వాడు. మిగిలిన యిద్దరూ ఏమీ అనకపోయినా తమ హావ భావాలతో బట్టలు నచ్చలేదన్న ధోరణి వ్యక్తం చేశారు.

వాళ్ళ ప్రవర్తనకు రమణమూర్తి మనస్సు చివుక్కుమంది. అయినా అతడు కోపం తెచ్చుకోలేదు. నిజాని కతడు కోపాన్ని జయించి సహనాన్ని వరించి చానాళ్ళయింది. కమల మాత్రం వూరుకోలేదు – "ఏమిటి...ఏమిటి మీ వుద్దేశ్యం? ఇందాకట్నుంచి చూస్తున్నాను మీ వరస.... ఇంతింత లేరు గాని ఇష్టం వచ్చినట్టూ వాగుతున్నారు! చిన్న నోటికి పెద్ద మాటలు....మరొక్కసారి నోరు విప్పితే మీ వీపులు చిట్లుతాయి! ఇవి కూడా లేక ఎంతమం దేడుస్తున్నారో మీకేమైనా తెలుసా?" అంది తీవ్రంగా.

అలతనలా హెచ్చరించినా అయిదారు క్షణాలపాటు పిల్లల మూలుగులు వినిపించాయి – 'వున్న దానితో సంతృప్తి పడవలెను' – అన్న సూక్తి జ్ఞప్తికి తెచ్చుకున్నారోఏమో, "నాన్నా బట్టలు తీసుకెళ్ళి టైలరు కిచ్చేద్దాం!" అన్నారు కాస్సేపాగి.

చిరు నవ్వుతో పిల్లల వైపు చూశాడు రమణమూర్తి.

"ఇంత పొద్దు పోయాక ఎందుకు – ప్రొద్దున్నే వెళుదురు లెండి!" అంది కమల.

* * *

ఎమ్మెనాపనుండీ; చదువుకోమనీ ఎంత సేపు లేపినా నిద్ర నుంచి లేవని పిల్లలు ఆ రోజు సూర్యుడుదయించక ముందే మేల్కొని తమ అల్లరి చిల్లర పనులతో రమణమూర్తికి సుప్రభాతం పాడారు. ఏవేవో ఆలోచనలతో రాత్రి ఆలశ్యంగా పడుకున్న రమణమూర్తి నిద్ర మత్తు వదలకపోయినా లేవడం తప్పని సరైంది.

కాల కృత్యాలు తీర్చుకొని కాస్త కాఫీ కషాయం గొంతులో పోసుకొని పిల్లల్ని వెంట బెట్టుకొని నాలుగో వీధిలో వున్న మూలయ్య టైలరింగ్ షాపు దగ్గర కెళ్ళాడు రమణమూర్తి. అప్పటికే పండుగ పని తొందర్లో వున్న మూలయ్య అతడ్ని చూసీ మాట్లాడలేదు. రమణమూర్తి అదేం పట్టించుకోకుండా, "మూలయ్యా! పిల్లలకీ బట్టలు సంక్రాంతి నాటికి కుట్టివ్వాలి!" అని తన చేతిలో వున్న పేకెట్ అతని ముందు పడేశాడు.

మూలయ్య మొహం చిట్లించుకొని. – పేకెట్‌లో వున్న బట్టలు తీసి చూసి, "ఖాళీ లేదండీ!" అన్నాడు.

అదేమిటి మూలయ్యా! నే నెప్పుడు బట్టలు కుట్టించినా నీ దగ్గరే కదా నువ్వే అలా అంటే ఎలా చెప్పు? ఏదో విధంగా వీలు చేసుకొని కుట్టి పెడుదూ!" అన్నాడు బ్రతిమాలుతున్న ధోరణిలో రమణమూర్తి

అంత పని తొందర్లోనూ రమణమూర్తి మాటలకు మూలయ్య విస్తుపోయాడు అతడు తన దగ్గర బట్టలు కుట్టించి 'ఎన్నాళ్ళయిందా – ఎన్నేళ్ళయిందా?' అని అర నిమిషంపాటు ఆలోచించాడు ఆ తర్వాత ఏమనుకున్నాడో; "ఏం

చెయ్యమంటారు చెప్పండి? ఇప్పటికే నన్ను కొప్పుట్టే- టన్ని బట్టలున్నాయి....ఇస్తానని తీసుకొని ఇవ్వక- పోతే మీరు బాధ పడతారు. మీరేమనుకోక ఈ దఫా ఎవరికైనా ఇవ్వండి!" అన్నాడు నిర్మొహమాటంగా.

అంత నిర్మొహమాటంగా చెబుతున్న మనిషి నింకెలా ఒప్పించాలో తెలియక అయిదు నిమిషాలపాటు అలాగే నిలబడి పోయాడు రమణమూర్తి. అతడి ఉనికినే పట్టించుకోకుండా తన పనిలో మునిగిపోయాడు మూలయ్య.

రమణమూర్తి బరువుగా నిట్టూర్చి అక్కడ్నుంచి కదిలి వెంకటాపురంలో వున్న మరో టైలరు దగ్గరకు వెళ్ళాడు. అతడూ అదే మాట – అతడూ కాదు ఆ తర్వాత రమణమూర్తి ఎక్క డెక్కడో వున్న ఎన్నో టైలరింగ్ షాపులచుట్టూ తిరిగాడు. అదేం చిత్రమో ఏ ఒక్కరూ ఆ బట్టలు కుడతామన్న పాపాన పోలేదు. ఏ టైలరింగ్ షాపులో చూసినా కుప్ప తిప్పలుగా బట్టలు.....కళ్ళు చెదిరిపోయే ఖరీదైన బట్టలు....

ఓ టైలరు అసలు బట్టలు ముట్టుకోకుండానే, "కాటనా? టెరీకాటనా – పాలిస్టర్ లాంటి వేనైనానా?" అని అడిగేశాడు. దానికి రమణమూర్తి చెప్పిన సమాధానం విని "ఇప్పుడు తీస్తే తీశారు గాని కాటన్ బట్ట లింకెప్పుడూ తీయకండి!....అసలు కాట నిప్పు డెవడు తొడుగుతున్నాడు??.....నా మటుకు నేను కాటన్ బట్టలు కుట్టడం మాని చాలా కాలమైంది!" అన్నాడు అతి మామూలుగా.

ఆ మాటలతో మతి పోయిన రమణమూర్తి పొంగు కొస్తున్న ఆవేశాన్ని అణుచుకొని వెను దిరిగాడు – 'ఏమిటీ లోకం? ఈ లోకంలో ఇక ముందు తనలాంటి సామాన్యులకు చోటుండదా?...- .ఏదో విధాన బట్టలు తీసి పిల్లల కళ్ళ నీళ్ళు తుడవాలనుకుంటే చివరి కవి కుట్టేవాడే లేకపోయాడు.... ఆపాగరుబోతు ఏం కూశాడూ? .- చివరకు వాడిచేత మాటనిపించుకోవాల్సి వచ్చిందే!.... ఆకలి బాధ చల్లార్చుకోవడమే క్లిష్టమవుతూన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఒంటి ఒంపులు కనిపించే అపురూప వస్త్రాలు కొనుక్కోగల అవకాశం అందరికీ ఎలా వస్తుంది?. ..' ఇలా తలపోస్తూ రమణమూర్తి నడుస్తున్నాడు. అతని వెనుకే పిల్లలు నడుస్తున్నారు తిరిగి, తిరిగి వున్నారేమో వాళ్ళ కాళ్ళు పీక్కుపోతున్నాయి. అలసట వాళ్ళ మొహాల్లో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. నిరాశ వాళ్ళ మనస్సుల్లో చోటు చేసుకుంది. కాటన్ బట్టలు తీసిన తండ్రి మీద పట్టలేని కోపం పుట్టుకొచ్చింది – అప్పుడేమైనా అంటే తండ్రి తంతాడేమోనని ఎవరూ మాట్లాడ్డంలేదు.: .

"చూశారుగదా మన పాట్లు. పండ గెళ్ళాక స్థిమితంగా కుట్టించుకోవచ్చు ...పదండి ఈ దగ్గర త్రోవన ఇంటికి పోదాం!" అంటూ పిల్లలతో సౌమ్యంగా చెప్పి – ఓ ఇరుకు సందులోకి తిరిగాడు రమణమూర్తి. పైకలా అన్నాడే కాని అతడి హృదయాన్ని చెప్పలేని బాధ కుమ్మరి పురుగులా దొలుస్తోంది. కమలకి ఆలోచన ముందే వచ్చి వుంటే తనకీ పాట్లు లేకపోయేవికదా అనిపించిందా క్షణాన అతడికి.

ఆ సందులో అయిదారు గజాలు ముందుకు నడిచి అకస్మాత్తుగా దేవుడు కనిపించినట్టు ఆగిపోయాడు రమణమూర్తి. అక్కడో టైలరు ఓ పెంకుటిల్లు ముందు గదిలో మిషను పెట్టుకొని జాకెట్టేదో కుడుతున్నాడు. అతడికి మరీ అంతెక్కువ పని లేనట్టు చూడగానే తెలిసి పోయింది చివరి ప్రయత్నంగా అతడి దగ్గర కెళ్ళాడు రమణమూర్తి.

"రండి! రండి! బట్టలు తీసుకొచ్చారా. ..ఎప్పటి క్కావాలి?,..." అంటూ చేస్తున్న పని ఆపి తన ప్రక్క నున్న స్టూలు రమణమూర్తి కందించాడతను.

రమణమూర్తికి ప్రాణం లేచొచ్చింది. అంతవరకూ పడ్డ శ్రమను మర్చిపోయి ఆ స్టూలు మీద కూర్చొని బట్టల పేకెట్ అతడి కందించాడు.

అతడు బట్టలు తీసి చూసి "పిల్లలకే గాని మీరు తీసుకోలేదా?" అన్నాడాప్యాయంగా.

అతడి ఆప్యాయతకు రమణమూర్తి ముగ్ధు డయ్యాడు. ఒక మనిషి నుంచి మరో మనిషి ముందుగా ఆపాయతా, అభిమానాలనే కోరు- కుంటాడేమో – "నాదేముంది లెండి ముందు పిల్లల సంగతి చూడాలికదా!" అన్నా డొక్క క్షణం తర్వాత రమణమూర్తి.

"మీ రెంతో అమూల్యమైన మాట సెలవిచ్చారు. మీ రన్నట్టు పిల్లల ఆనందమే మన ఆనందం! వాళ్ళ చిరునవ్వులే మన జీవితాలకు వెలుగు రవ్వలు!!" అన్నాడతను.

"మీ కెంతమంది పిల్లలు బాబూ?" అన్నాడు, అతడి మొహంలోకి చూస్తూ రమణమూర్తి.

"నా కింకాపెళ్ళే కాలేదండి. కానీ, పిల్లలంటే చాలా ప్రేమ!" అన్నాడతను కాస్త సిగ్గు పడుతూ.

"అలాగా బాబూ!... చాలా సంతోషం అయితే నాలాగ మాత్రం నలుగురి పిల్లలకు తండ్రివి కావద్దు" అని ఒక్క క్షణమాగి "ఔనూ, షాపు ఇంత మారుమూల పెట్టావేమిటి బాబూ?" అన్నాడు రమణమూర్తి.

"ఏం చెయ్యమంటారు చెప్పండి! బజార్లో ఎంత ప్రయత్నించినా గది దొరకలేదు – వేలెడు వెడల్పు – పొడవూ వున్న గదైనా వేల కొద్దీ అడ్వాన్సు...తిరగ్గా తిరగ్గా ఈ ఇల్లుగలాయన వంద రూపాయలకీ గది అద్దె కివ్వటమే కాకుండా వచ్చిన వెంటనే చాలా బట్టలు కూడా ఇచ్చాడు. పండ గెళ్ళాక వాళ్ళమ్మాయి పెళ్ళట! ఇవి గాక ఇంకో అర డజను జాకెట్లు కుట్టేస్తే వాళ్ళ పనైపోతుంది. అన్నట్టు మీ కెప్పటి క్కావాలి బట్టలు?" అన్నాడతను.

"పండుగ రేపనగాఇస్తే చాలు బాబూ!" అన్నాడు రమణమూర్తి.

అతడు పైకి లేచి వరసాగ్గా పిల్లల కొలతలు తీసుకొని, "భోగి రోజు సాయంత్రానికి బట్టలు సిద్ధం చేసి వుంచుతాను. నలభై రెండు రూపాయలు తీసుక రండి" అన్నాడు.

అతని వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసి "వెళ్ళొస్తా"నని చెప్పి అక్కడ్నుంచి కదిలాడు రమణమూర్తి. అతడికి నెత్తిమీదున్న పెద్ద బరువు దిగిపోయినట్టనిపించింది. కొత్త శక్తేదో వచ్చినట్టు హుషారుగా పిల్లలతడ్ని అనుసరించారు.


* * *

అడ్డున్న పది రోజుల్నీ అవలీలగా అధిగమించి భోగి పండుగ వచ్చేసింది. సంక్రాంతి, కనుమ తప్ప భోగి రోజు సెలవు లేదు రమణమూర్తికి. ఆ రోజతను డ్యూటీకి వెళ్ళిపోతుంటే బట్టల విషయం హెచ్చరించారు పిల్లలు. వాళ్ళ ఆరాటానికి నవ్వుకొని, "సాయంత్రం వచ్చేటప్పుడు తెస్తానని" చెప్పి బయల్దేరాడతను.

అలా డ్యూటీ కెళ్ళిన రమణమూర్తి చిన్న కారేసు- కొని పదకొండు గంటలకు ఇంటి కొచ్చాడు.

"ఏమిటీ భోగిరోజు భోగం! మన యోగం ఏమైనా మారిందా?" అంది నవ్వుతూ కమల. అర్జంటుగా బయటాగిన కారు దగ్గరకు పరుగెత్తారు పిల్లలు.

"నీ మొహం...మన యోగం ఈ జన్మ కిక



మారదు!.... యెండమూరు దగ్గర మన ఎం. ఎల్. ఏ. గారి కారు ఆగిపోయిందట. నన్నూ, మరొకతన్నీ వెళ్ళి దాని ట్రబులేమిటో చూసి తీసుకు రమ్మన్నారు మా ఓనరుగారు. ఇదిగో పండుగ అడ్వాన్సు కూడా నూట యాభై ఇచ్చారు. మేము తిరిగొచ్చేసరికి ఎంత టైమవుతుందో తెలీదు. సాయంత్రానికి నేను రాకపోతే పెద్దోడ్ని వెళ్ళి బట్టలు తెచ్చుకోమని చెప్పు!" అన్నాడు రమణమూర్తి.

"పండగ పూట పూళ్ళో లేకుండా ఏమిటండీ ఇది?....కాస్త భోజనమైనా చేసి వెళ్ళకూడదూ?" అంది కమల.

"దార్లో ఎక్కడో తింటాంలే; ఇప్పటికే ఆలస్యః మైంది!..." అంటూ బయటి కొచ్చేశాడు రమణమూర్తి – పిల్లలు నలుగురూ కారులో కూర్చొని తెగ సంతోషపడి పోతున్నారు.

"ఈ కారెవరిది నాన్నా? మనకీ ఇలాంటి కారుంటే!" అన్నాడు తండ్రి కారు దగ్గరకు రాగానే ప్రసాద్.

"విమానం వద్దూ.....వెధవల్లారా....వెధవ గొంతెమ్మ కోరికలూ మీరూను. దిగండి ముందు!" అన్నాడు వస్తున్న నవ్వాపుకుంటూ రమణమూర్తి.

బిక్క మొహం లేసుకుని పిల్లలు దిగిపోయారు. గుమ్మంలో నిలబడ్డ కమలవైపు చూసి, చిన్నగా నవ్వి కారు స్టార్టు చేశాడు రమణమూర్తి.

* * *

ఓనరప్పగించిన పని పూర్తి చేసుకొని రమణమూర్తి తిరిగి ఇంటి కొచ్చేసరికి రాత్రి ఏడు గంట లైంది. ప్రసాద్ తరువాతి వాళ్ళు మొహాలు

ఏమిటీ లోకం

ముడుచుకొని మౌనంగా ఒకచోట కూర్చొనున్నారు. కమల వంటింట్లో ఏదో పని చక్కబెట్టుకుంటోంది.

"ఏమైంది కమలా! వాళ్ళలా వున్నారేం?" అన్నాడు కమల దగ్గర కెళ్ళి రమణమూర్తి.

"బట్టలు తీసుక రమ్మని ప్రసాద్‌ను పంపుతూంటే వాళ్ళు వెళ్తా నన్నారు. అందరూ ఎందుకంటే విన్లేదు.....అందుకని..'.."

"అంధుకని పండుగ పూట కొట్టావన్నమాట ..- బాగానే వుంది ...ఇంతకీ వాడెళ్ళి ఎంత సేపయింది?"

"ఆరు గంటల వరకూ మీ కోసం చూసి వాడ్ని పంపాను. ఎంచేతో ఇంకా రాలేదు" అంది కమల

రమణమూర్తి తల పంకించి, పిల్లల దగ్గర కొచ్చి కూర్చొని ఆ మాటా, ఈమాటా చెబుతూ అయిద నిమిషాల తర్వాత వాళ్ళని నవ్వించ గలిగాడు ఇంతలో కమల కూడా పని చక్క బెట్టుకొని వచ్చి వాళ్ళ దగ్గర కూర్చొంది.

మరో అరగంట గడిచి పోయింది. గాని ప్రసాద్ రాలేదు. వెళ్ళి రెండు గంట లవుతున్నా వాడెందుకు రాలేదో రమణమూర్తి కర్థం కాలేదు – 'అన్నమాట ప్రకారం టైలరు బట్టలు కుట్ట లేదా? కుట్టిచ్చేస్తాను కూర్చోవయ్యా . అన్నాడా?. .అసలా టైలరింగ్ షా పెక్కడో వాడికి తెలియనే లేదా?....కొంపదీసి డబ్బుగాని పారేశాడా??' ఆలశ్యం అయే కొలదీ ఇలాంటి అనుమానా లెన్నో రమణమూర్తి మనసులో చోటు చేసుకో నారంభించాయి.

మనిషక్కడే వున్నా మనసంతా ఇంకా రాని ప్రసాద్ మీదే వుంది కమలకు; – "నా కేదో భయంగా వుంది.....మీరు వెళ్ళి చూడండీ!" అంది మరి కొన్సేపటి తర్వాత కమల.


మరో అయిదు నిమిషాలు చూసి – ఇంటి గుమ్మం దాటాడు రమణమూర్తి సరిగ్గా అప్పుడే నీరసంగా నడిచి వస్తూ కనిపించాడు ప్రసాద్ "బట్ట లేవిరా? అన్నాడు వుత్త చేతుల్తో వచ్చిన ప్రసాద్‌ను చూసి రమణమూర్తి.

ప్రసాద్ మాట్లాడలేదు "ఏమైంది డబ్బు గాని పారేశావా?" అడిగింది కమల.

వాడు జేబులోంచి డబ్బు తీసి విసురుగా క్రింద పడేసి, ఒక్క సారిగా ఘొల్లు మన్నాడు. కంగారు పడింది కమల ..."ఏమిట్రా? ఏమైందో చెప్పకుండా ఏమిటా వెధవ్వేడుపు?" విసుగ్గా అన్నాడు రమణమూర్తి.

"ఆ టైలరు నిన్న రాత్రి ఎవ్వరికీ తెలీకుండా పరారయ్యాడట. అక్కడ మిషనూ లేదు.....బట్టలూ లేవు....." అంటూ మరోసారి బావురు మన్నాడు ప్రసాద్. అంతే; పిల్లలంతా ఆరునొక్క రాగం మొదలు పెట్టారు. నిశ్చేష్టురాలైంది కమల.

"ఏమిటీ లోకం?.....ఈ లోకంలో అంతటి దగాకోర్లూ... ఇంతటి నయవంచకులూ వున్నారా? ఎందుకీ లోకంలో ఇంతిలా మాయా, మోహాలు ప్రబలి పోతున్నాయి??" ఆవేదన, ఆవేశం సమ పాళ్ళలో పొంగు కొచ్చి కళ్ళు ఎర్రబడగా చాలాసేపు అలాగే వుండిపోయాడు రమణమూర్తి. □



28-9-1984 శుక్రవారం మొదలు 4-10-1984 గురువారం వరకు

★ **మేషం :** అనుకూలమైన మార్పులు గ్రహగతిలో కొన్ని సంభవించాయి. అందుచే ఆదాయం, ఆదరణ, అనుకూలం, అప్రయత్న ధనలబ్ధి. కళారంగాన ధనలబ్ధి చేకూరగలవారం. స్త్రీలకు : ఇలాగే యింకా కొన్ని వారాలు ధనాదాయంతో ఆనందదాయకం.

★ **వృషభం :** ప్రజా రంగాన, ప్రభుత్వ రంగాన, ఆట పాటల్లో, చాలమందికి అనుకూలం. ఆనందదాయకమైన వారంగా గమనించాలి. వ్యాపారం బాహాటంగా చేసికొనే అవకాశాలు చాలమందికి గలవు. స్త్రీలకు : అన్ని రంగాలలో ప్రగతి కనిపించటం, స్వల్పాదాయానికి కూడ అవకాశమున్నది.

★ **మిధునం :** గ్రహించండి, మీ మాటకు విలువ పెరుగుతుంది. మీ ఆలోచనలు సత్ఫలదాయకాలు కాగలవు. మీరు చేసే వ్యాపారంలో చక్కని ఆదాయం కద్దు. స్త్రీలకు : వస్తు వాహన సంపాదనకు, రాజకీయంగా సదవకాశాలకు అవకాశమున్నది

★ **కర్కాటకం :** ప్రజా రంగాన మీకు ప్రసిద్ధి ఏర్పడుతుంది. వ్యాపారమందు నూతన ప్రయోగాలు చేయగలరు గృహ నిర్మాణ కార్యక్రమమందు నిమగ్నులు కాగలరు అప్రయత్న ధనలబ్ధి అందుకోగలరు. స్త్రీలకు . ధన వసతి, ఉద్యోగ వసతి, వ్యాపారాదాయానికి అవకాశంగల వారం.

★ **సింహం :** చాలమందికి ఏలాగైనా ధన లబ్ధిగలదని చెప్పవచ్చు. వ్యాపారంలో ఆశించినంతకన్నా అధికాదాయం పుంజుకొనగల సమయం. ఉద్యోగ రీత్యా మీర్లు గావించిన యత్నాలు ఫలవంతం కాగలవు. ఆరోగ్యమందభివృద్ధి కనిపించును. స్త్రీలకు : సాహితీరంగాన సదవకాశాలు లభిస్తాయి.

★ **కన్య :** ఉన్నతాధర్మములుగల మీకు నాలుగు విధాలా లాభించే వారం. రాగల కొన్ని వారాలలో కూడ చక్కని ధనాదాయముంటుంది. గతంలో మీ సహాయం పొందినవారు సమయంలో సాయపడనున్నారు గమనించి శ్రమించాలి. స్త్రీలకు : వస్తు సేకరణ, కించిత్తు ఆదాయం, శుభ ప్రస్తావనలకు అవకాశం గల వారంగా గ్రహించాలి.

★ **తుల :** దూర ప్రాంతాలకు కొందరు ప్రయాణించగలరు. అత్యావసరమైతేనే తప్ప కదలరాదు. ఇబ్బందిదాయకమైన వారం. రాజకీయంగా కొందరకు ప్రశాంతత లోపిస్తుంది. గమనించాలి. స్త్రీలకు : ఉద్యోగమందు, ధనాదాయమందు, కుటుంబ వ్యవహారాలందు ఉత్సాహజనకమే.

★ **వృశ్చికం :** వారాంతంలో అఖండ ఫలదాయకం. లాభదాయకం, ఆనందదాయకం అని గ్రహింపగలరు. దగ్గర బంధువులతో మాట మాట పట్టింపులు రావచ్చు. వ్యవహారం అనుకూలంగా పరిష్కరింపబడుతుంది. ఆరోగ్యాభివృద్ధిగల వారం. స్త్రీలకు : కుటుంబ గౌరవాభివృద్ధి, పరోపకార చింతన.

★ **ధనుస్సు :** ఏ మాత్రం అనుకూలత చెప్ప వీలు లేదు. రావలసిన ధనం చేతికందకపోవచ్చు. విరామమెరుగని కార్యక్రమం మీముందుంటుంది. అనవసర ప్రస్తావనలలో తల దూర్చవలసి వస్తుంది. స్త్రీలకు : ఉద్యోగ వ్యవహారాలు ఆనందదాయకాలు, కొందరకు 'ప్రమోషన్' సంభవం.

★ **మకరం :** ఏదో విధంగా, సాయం చేకూరుతుంది. గ్రహ స్థితిని గూర్చి ఎలాంటి సందేహం అవసరం లేదు. రచనా విధానాన ఆదాయం చేకూరుతుంది. వస్తు సేకరణకు అనుకూల దినం. కొందరకు వృత్తి రీత్యా ఆనందం చేకూరుతుంది. స్త్రీలకు : గృహానందం, శుభ కార్యాలోచనలకు ఆస్కారమైన వారం.

★ **కుంభం :** వ్యర్ధంగా కాలక్షేపం చేసే అవకాశం చాలమంది పట్ల చెప్పదగిన ముఖ్యాంశం. మిత్ర సహాయం సమకూడుతుంది. అప్రయత్న ధనాదాయానికి, వినోద కార్యక్రమాలందు ప్రొద్దు పుచ్చుటకు అనువైన వారం.

★ **మీనం :** ధనాదాయంలో లోపం లేదు. అవసరాలు సక్రమంగా నెరవేరగలవు. వ్యాపారమందు అనుకూలత చెప్పదగిన వారం. 'సినీ' రంగానుభవం గల వారికి, నాటకానుభవం గల వారికి రాణింపునకు అవకాశమున్నది. స్త్రీలకు : ఉద్యోగ రీత్యా హాయి, ఆనందం, కించిత్తు ధనాదాయం చేకూరనున్నది.

—విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి


వ్యక్తిగతం



మయాస్తీనియా గ్రావిస్ చికిత్స కోసం అమెరికా సంయుక్త రాష్ట్రాలకి వెళ్ళిన శ్రీ అమితాబ్ ఇప్పుడు కోలుకున్నారు. ఇక ముందు ఆయన సంవత్సరానికి రెండు చిత్రాలలో మాత్రమే నటించాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితులు అంటున్నారు. మిగతా సమయాన్ని, ఆయన రాజకీయాలలో ప్రవేశించి, శ్రీమతి గాంధీకి సహాయపడటానికి, లేదా అధ్యక్ష తరహా ప్రభుత్వం వల్ల కలిగే ప్రయోజనాలని గురించి ప్రచారం చెయ్యడానికి వినియోగిస్తారట. ఇప్పుడు అసంపూర్తిగా మిగిలిపోయిన చిత్రాలని పూర్తి చేసిన వెంటనే ఆయన తమ ప్రచారాన్ని ప్రారంభిస్తారని అనుకుంటున్నారు. దక్షిణాదిలో కూడా పొంచి పలుకుబడిని సంపాదించుకున్న శ్రీ అమితాబ్ బచ్చన్కి ఈ వొత్తిడి రావటానికి కారణం సినిమా నటుడిగా ఉండి ముఖ్యమంత్రి అయిన శ్రీ ఎన్. టి. రామారావు శ్రీమతి గాంధీకి సహకరించకపోవడం వల్లనే అని అంటున్నారు......



డాక్టర్ హోవార్డ్ గ్రీన్ అమెరికా సంయుక్త రాష్ట్రాల లోని హార్వార్డ్ మెడికల్ స్కూల్లో పని చేస్తున్నారు. ఈయన మానవుల చర్మాన్ని అంటు వేసే పద్ధతిని కనిపెట్టారు. తపాలా బిళ్లల పరిమాణంకల చర్మాన్ని ఒక వ్యక్తి దేహంలోని కొన్ని భాగాల నుంచి తీసుకుని వాటిని చర్మం అభివృద్ధికి తోడుపడే ద్రావకాలుకల గాజుపాత్రలలో ఉంచుతారు ఈయన. చర్మం ముక్కలు బాగా పెద్దవి అవుతాయి. అప్పుడు వాటిని తమ పేషెంటు లకి కావలసిన దేహభాగం మీద అతుకుతారు. ఈ మధ్యనే వళ్లంతా కాలిపోయిన ఇద్దరు (5, 6 సంవత్సరాల వయస్సు) కల అబ్బాయిలకి బాగా వళ్ళు కాలితే డాక్టర్ గ్రీన్ చర్మం అంటులు వేసి రక్షించారు..... ఈ చర్మానికి జుట్టు వుండదు. చెమట గ్రంధులు కూడా వుండవు. మామూలు చర్మంకన్నా పల్చగా ఉంటుంది.



(గత సంచిక తరువాయి)

జరిగిన కథ—15 : కృష్ణ అన్న, వదినలకు భారంగా ఉండటం ఇష్టంలేక ఉద్యోగాన్వేషణకై హైద్రాబాదు వెళుతాడు. ప్రసాద్ సహాయంతో అక్కడ దీపిక పత్రికాఫీసులో ఉద్యోగంలో చేరుతాడు. 'దీపిక' పత్రికాధిపతి రాజయ్య కూతురు జయలక్ష్మి కృష్ణతో స్నేహం చేయాలని ఉవ్విళ్లూరుతుంది. కృష్ణ వేరే గది అద్దెకు తీసుకొని ప్రసాద్ ఇంటినుండి షిఫ్ట్ అయి వెళ్లిపోతాడు. కృష్ణ సహోద్యోగిని ఉష అతనికి చేరువ కావాలని ఆరాటపడుతుంది. కృష్ణ ఆమెతో తన చరిత్ర మంచిదికాదని చెప్పి తనకు దూరంగా ఉండమని హెచ్చరిస్తాడు. రాజయ్య కూతురు జయలక్ష్మి కృష్ణను ఆకర్షించాలని చేసిన ప్రయత్నం విఫలమౌతుంది. ఉషకు బ్యాంక్‌లో ఇంటర్వ్యూ వచ్చింది. కృష్ణ 'దీపిక' ప్రెస్సులో రాత్రనక పగలనక పనిచేస్తూ ఉంటాడు. ఉషకు బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. రాజయ్య 'దీపిక' పత్రికను ఆపేస్తాడు. కృష్ణకు ఉద్యోగం ఊడింది. కృష్ణ, ఉషలు తమకు ఒకరిపై ఇంకొకరికి గల ప్రేమను ఎలా తెలియచెప్పాలా ! అని ఆలోచిస్తు ఉంటారు. కృష్ణ, ఉషలు పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకొంటారు. ఉష ఇంటికి వెళ్లిన కృష్ణ వాళ్ల ఫేమిలీ ఆల్బమ్‌లో సావిత్రి ఫోటో చూసి షాక్ తింటాడు. సావిత్రి ఉషకు అక్క అని తెలుసుకొని మనశ్శాంతిని కోల్పోతాడు. తను చేసిన మోసంవల్లే సావిత్రి ఆత్మహత్య చేసుకొందని ఉషతో చెప్పేస్తాడు కృష్ణ. ఉష నిశ్చేష్టురాలవుతుంది. కృష్ణ పూర్తిగా కృంగిపోతాడు. కూతురి పెళ్లి వాయిదా పడిందని తెలుసుకొన్న ఉష తల్లి ఆందోళన చెందుతుంది.

మర్నాడు మధ్యాహ్నం సుధీర్ వచ్చాడు.

''ఇవాళ సాయింత్రం మాచ్ ఉంది ! వస్తారా ?'' అడిగాడతను.

''సారీ ! రాలేను...''

''వేరే ప్రోగ్రాముందా ?''

''ఊహు ! ఏమీ లేదు ! అయామ్ అన్‌వెల్...''

''ఓ. కే. అయితే నేను బలవంతం చేయనులెండి !'' అతను వెళ్ళిపోయాడు.

కొద్దిరోజులు గడచిపోయినయ్.

రోజులు గడుస్తున్నకొద్దీ ఆమెకు అశాంతి పెరిగిపోతోందేగాని తగ్గటంలేదు. ఎంత ప్రయత్నించినా అతనిని గుర్తుతెచ్చుకోకుండా ఉండడం సాధ్యం కావడంలేదు.

దీనంగా కళ్ళముందు మెదులుతోన్న అతని మొఖం మరీ కృంగదీస్తోంది.

అతను నిజానికి మొదట్లో తనవేమాత్రం పట్టించుకోలేదు.

తనే అతని రూపానికి ఆకర్షింపబడి అతనితో చనువు పెంచుకోడానికి ప్రయత్నించింది. అతనిని ప్రేమించి అతని మనసునికూడా తనవేపు మళ్ళించింది.

అతనికి మళ్ళీ జీవితంమీద ఆసక్తి కలిగించి మామూలు మనిషిని చేసింది. ఇప్పుడు మళ్ళీ తనే అతనిని అధోలోకానికి తోసివేసింది.

ఇందులో తనదీ తప్పుంది కొంత !

కానీ అతను చేసిన ఘోరానికి అతనికీ శిక్ష చాలదు.

జీవితాంతం అతనిలా శాపగ్రస్తుడిలా జీవితం గడపాల్సిందే !

మర్నాడు మళ్ళీ సుధీర్ వచ్చాడు.

''నిన్న మాచ్ చాలా బాగా జరిగింది. మీరు వస్తే భలే ఎంజాయ్ చేసేవాళ్ళు !'' అన్నాడు మాచ్ గురించి వివరంగా చెప్తూ.

ఆమె మౌనంగా వింటూండిపోయిందతని మాటలు.

''నిన్న ఒంట్లో బాగుండలేదన్నారుగా ! ఇప్పుడెలావుంది ?'' అడిగాడతను.

''అయామ్ ఆల్‌రైట్...''

''అన్నట్లు మీ మారేజ్ ఎప్పుడు ? అనుద్యే చేసుకుందామనుకున్నారుగా ?'' ఆమె ఓ క్షణం తటపటాయించింది.

జరిగిందంతా, చెప్పాలా లేదా అనేది తెలీటంలేదు.

''అది ఆగిపోయినట్లే...'' అంది తల వంచుకుని.

అతను నివ్వెరపోయాడు.

''ఆగిపోయిందా ?''

''ఊ !''

''ఎందుకని ?''

''అనుకోని పరిణామాలు ఎదురయినయ్.''

''పెద్దాళ్ళు ఒప్పుకోడం లేదా ?''

''అదేమీకాదు ! మీకు మరోసారి వివరంగా చెప్తాను...''

అతను ఆలోచనలో పడిపోయాడు. ఆమె వివాహం ఎందుకాగిపోయిందో ఏమాత్రం అర్థం కావటంలేదు అలా జరగడం తనకెంతో బాధ కలిగిస్తోంది.

ఆమెను తను ప్రేమించాడు. వివాహం చేసుకోవాలనుకున్నాడు. ఆమె మరెవరినో ప్రేమించిందనీ, వివాహం చేసుకోబోతోందనీ తెలిసినప్పుడు తన మనసు మార్చుకున్నాడు. తనను చేసుకోనందుకు తాను బాధపడడంలేదు. అది తన దురదృష్టం ! అంతే !

కానీ ఆమె జీవితం ఎందుకలా అపశృతి పలకాలి ? ఆమెకు ఎదురయిన సమస్యలేమిటో తెలుసుకుని తను సహాయం చేసేందుకు ప్రయత్నించవచ్చుకదా !

అసలు ప్రేమ అనే దానికి అర్థం ఏమిటి ?

ప్రేమించినవ్యక్తిని 'సుఖపడేలా' చేయడమే కదా !

ఇంకేమీ మాట్లాడలేదతను.

మరోసారి ఆమె నుంచి ఏం జరిగిందో తెలుసుకోవాలని నిశ్చయించుకున్నాడు.

ఉష మనసుని ఆఫీస్ పనిమీద కేంద్రీకరించ లేకపోతోంది. ఆమె చేసిన తప్పులు ఒకటి రెండు సుధీర్ సరిదిద్దడంతో మరింత అశాంతి పెరిగిపోయింది.

రెండురోజులు శెలవు తీసుకుని ఇంట్లో ఉండిపోవడం మంచిదనిపించిందామెకి. లేకపోతే తన మనసు పూర్తిగా గాడి తప్పేట్లుంది.

మర్నాడు పొద్దున్నే తల్లితో చెప్పేసిందామె.


''ఇవాళా రేపూ శెలవు తీసుకున్నానమ్మా ! బాంక్ కెళ్లడంలేదు.''

''ఎందుకని ?'' అని అడగాలనుకుని మౌనంగా ఊరుకుండిపోయిందామె.

తప్పక ఆమె వివాహ విషయంలో ఏవో సమస్యలు వచ్చేవుంటాయన్న తన అనుమానం ఋజువయిపోయింది.

అయితే ఆ విషయం మాట్లాడడంగానీ, ప్రశ్నించడంగానీ చేస్తే ఉష మరింత బాధపడుతుందని ఆ ప్రయత్నం విరమించుకుందామె.

ఆ రెండు రోజులూ ఇల్లు కదలకుండానే ఉండిపోయింది ఉష.



అద్దెకు తెచ్చుకున్న నవలలు రాత్రింబగళ్లు చదువుతూ గడిపేసింది.

ఏదోకపనిలో నిమగ్నమయినంతసేపే అతనిని మర్చిపోగలగుతోంది తర్వాత మళ్లీ మామూలే!

ఆరోజు సాయంత్రం లలిత వచ్చింది ఉష కోసం.

''రేపుసాయింత్రం మీటింగ్ ఉంది. నువ్వు తప్పకుండా రావాలి'' అందామె.

''ఓ ! ఎన్నిగంటలకు ?'' అడిగింది ఉష.

''ఆరింటికి !''

''ఎక్కడ ?''

''రావ్‌కోటీ హాల్లో.''

''సరే ! వస్తాన్లే.''

''ఈమధ్య అసలే మీటింగులకూ రావడం లేదు నువ్వు ! పోనీలే కొత్త ఉద్యోగం గదా అని మేమూ ప్రెస్ చేయలేదు.'' నవ్వుతూ అంది లలిత.

''అవును ! నేనూ ఆ కారణంగానే రావటం లేదు. ఇప్పుడింక ఏ సమస్యా లేదు. మీరెప్పుడు రమ్మంటే అప్పుడు వచ్చేస్తాను...''

''క్రిందటి మీటింగ్‌లో ఏమయిందో తెలుసా ? సినిమాలే కాకుండా, మన నవలలు కూడా స్త్రీ పరిస్థితిని మరింత దారుణం చేస్తున్నాయని చాలామంది మాట్లాడారు. అందుకని ఓ కమిటీని వేశారు. వాళ్ళు ఆ నవలలన్నీ చదివి ఏ యే నవలలు 'స్త్రీ'ని కించపరుస్తూ, పాతకాలంనాటి థింకింగ్‌ని ప్రోత్సహిస్తున్నాయో వాటిని రికగ్నైజ్ చేసి, రిపోర్ట్ ఈ మీటింగ్‌లో ఇవ్వాల్సి ఉంటుంది. మీటింగ్ అవగానే అందరం ప్రొసెషన్‌లో బయల్దేరి ముఖ్యమయిన పుస్తకాల షాపులనుంచి ఆ పుస్తకాలు అమ్మకం ఆపేయాలని, వాటిని పబ్లిషర్స్‌కు తిప్పి పంపేయాలనీ హెచ్చరిక చేయడం జరుగుతుంది. ఆ తరువాత మళ్ళీ ఆ షాపులకెళ్ళి చెక్‌చేసి అప్పటికీ అవి కనబడితే వాటిని చింపేయడం, తగలబెట్టడం చేస్తామన్న మాట !...''

మరికాసేపు మాట్లాడిన తరువాత ఆమె వెళ్ళిపోయింది.

మర్నాడు లంచ్ టైమ్‌లో శాంతి కలుసుకుంది మళ్ళీ.

''ఏమయిపోయావ్ ఈ రెండు రోజులూ?'' అడిగిందామె.

''లీవ్ తీసుకుని ఇంట్లో కూర్చున్నాను.''

''ఖర్మ ! లీవ్ తీసుకుని ఎంజాయ్ చేయాలి గానీ ఇంట్లో కూర్చుంటారా ఎవరయినా ?''

ఉష నవ్వేసింది. ''నువ్వూ, నీ బాయ్ ఫ్రెండూ నాగార్జునసాగర్ వెళ్తామన్నారు వెళ్ళారా ?''

''అలాంటి అవకాశం ఎవరయినా వదులుకుంటారా ?'' నవ్వుతూ అందామె.

''మీ ఇద్దరేనా ?''

''లేపోతే ఇంకో పదిమందిని తీసుకెళ్ల మంటావేమిటి ?''

''అలా అతనితో వెళ్లడానికి సిగ్గేయ లేదూ ?''

''ఇంకానయం ! 'పరాయి మగాళ్లుండేచోట ఎలాగోయ్ ఉద్యోగం చేయడం' అని నువ్వు ఈ ఉద్యోగం మానేయవేం ?''

''ఇదివేరు.''

''అదీవేరే !''

''సరే నీతో గొడవెందుగ్గానీ ఏం చేశారక్కడ ?''

''చెప్పానుగదంటే ! ఎంజాయ్ చేశాము.''

ఇద్దరికీ నవ్వొచ్చేసింది.

''వెరీబాడ్'' అంది ఉష.

''ఎందుకు ?''

''పెళ్లికి ముందే అలా ప్రవర్తించడం !''

''పెళ్లయ్యాక చేస్తే ఫరవాలేదా ?''

''అవును !''

''ష్ ! పౌరాణిక సినిమాలో హీరోయిన్ డైలాగులు చెప్పకు !''

ఉషకు అంతులేని ఆశ్చర్యంగా ఉందామె ప్రవర్తన.

''అంత తేలిగ్గా తీసుకుంటుందేం ఆ విషయం !''

"మళ్ళీ నచ్చే ఆదివారం గండిపేట వెళ్తున్నాం!"

"నువ్వు చెప్తుంటేనే భయంవేస్తోంది నాకు."

శాంతి నవ్వేసింది.

"పిరికిదానా! 'ఎలాగూ పెళ్ళి చేసుకుంటాంగా?"

"ఒకవేళ ఏ కారణం చేతనయినా మీకు వివాహం జరగకపోతే?"

"నీలాంటి కోశ్చన్‌మార్క్‌గాళ్ళకి అన్నీ కొశ్చన్‌మార్క్‌లే ఎదురవుతాయ్ జీవితంలో—"

ఇద్దరూ టీ తాగి మళ్ళీ ఆఫీస్‌లోకి చేరుకున్నారు.

సాయంకాలం 'స్త్రీ విముక్తి దళం' మీటింగ్‌కి వెళ్ళిందామె.

వెళ్ళేసరికే మీటింగ్ ప్రారంభమయిపోయింది.

స్టేజిమీద ఒకావిడ మాట్లాడుతోంది మైకులో—

"మేము ఈ కొద్ది రోజుల్లోనూ చాలా పుస్తకాలు చదివాము. అందులో కొన్ని చదువుతూంటే చాలా ఆశ్చర్యం కలిగింది. అలాంటి నవలలు ఎందుకు ప్రచురిస్తున్నారో అర్థంకాలేదు ఓ నవల్లో— మానభంగం జరిగిన స్త్రీ ఆత్మహత్య చేసుకుంటుంది. ఇంకో నవల్లో ఆమెను భర్త వదిలేస్తాడు. మరో నవల్లో హీరోయిన్ పెళ్ళికాకముందు శీలం పోగొట్టుకుని తరువాత ఇంకొకతనిని వివాహం చేసుకుని, తను పెళ్ళికి ముందు చేసిన పాపం మర్చిపోలేక నిజం చెప్పలేక గిలగిల కొట్టుకుని హాస్పిటల్లో చేరిపోయి ఆఖరి క్షణాల్లో భర్తకి నిజం చెప్పేసి చచ్చిపోతుందట! ఇంకో నవలలో తను భర్తగా భావించుకున్న వ్యక్తి చనిపోగానే తనూ విషంమింగి చనిపోతుంది! ఇంకో నవలలో హీరోయిన్ ఒకతనిని ప్రేమించి అతనికి సర్వస్వం అర్పించి తర్వాత అతను పెళ్ళికాకుండా పారిపోయేసరికి కడుపు తెచ్చుకుని ఆత్మహత్య చేసుకుంటుందిట. "అన్నిటికన్నా దారుణం ఏమిటంటే వీటిల్లో ఎక్కువ నవలలు స్త్రీలు రాసినవే కావడం! ఆడదాని అధోగతికి ఆడదే కారణం అనడానికి ఈ నిదర్శనాలు చాలు!.." అంటూ ఆ పుస్తకాల పేర్లు చదవసాగిందామె.

ఉష మనసంతా ఆలోచనల్తో నిండిపోయింది,

ఆ కథ అచ్చం సావిత్రి అక్కయ్య కథలానే ఉంది.

ఒక యువకుడిని ప్రేమించి, అతనిని నమ్మి శీలం అర్పించి, అతను మోసగాడని తెలుసుకుని ఆత్మహత్య చేసుకోవడం —

కానీ అది తప్పంటారేమిటి వీళ్ళు?

ఆత్మహత్య చేసుకోక ఇంక ఏంచేయాలి?

ఆ అమ్మాయిని ఇంకెవరు చేసుకుంటారు

జీవితం — సెంటిమెంట్

మరి? ఒకవేళ జరిగిన విషయం ఎవరికీ చెప్పకుండా మరొకతనిని వివాహం చేసుకున్నా, అతనితో సంసారం చేయటం ఎలా? ఎంత పాపం అది?

వేదికమీదకు మరో యువతి వచ్చింది.

"ఏం జరిగినా ఆడదానికి చావుతప్ప మరో గత్యంతరం లేనట్లు పరిష్కారం సూచిస్తోన్న సాహిత్యాన్ని, సినిమాలనూ మనం నిరసించాలి. మానభంగం జరిగితే ఆత్మహత్య, ఎవరయినా ఆమెను నమ్మించి శీలం దోచుకుని పారిపోతే ఆత్మహత్య, ప్రేమించిన మగాడిని పొందలేకపోతే ఆత్మహత్య, భర్త ఆమె శీలాన్ని శంకిస్తే ఆత్మహత్య, అత్తమామలు రాచిరంపాన పెడితే ఆత్మహత్య ఆమెమీద ఎవరయినా అభాండం వేస్తే ఆత్మహత్య, ఆమెకూ ఆమెతోపాటు అదే ఆఫీస్‌లో పనిచేసే మరో వ్యక్తికి సంబంధం ఉందని పుకారు వస్తే ఆత్మహత్య.

ఇలా అన్ని సమస్యలకూ ఆత్మహత్యను మించిన మందు లేదని మనవిచేసే అద్భుతమైన సాహిత్యం సృష్టిస్తున్నారు మనవాళ్ళు. ఆ సాహిత్యాన్నే తెరమీద కెక్కించి డబ్బులు చేసుకుంటున్నారు మన దర్శకులు, నిర్మాతలు. ఆయా పరిస్థితుల్లో స్త్రీ ఒక్కర్తే ఎందుకు చావాలి? మగాడెందుకు చావకూడదు? మగాడికి

స్వేచ్ఛా సూర్యుడు

చెట్లు చల్లని గాలితో
ఊపిరి పోస్తూండగా—
కొండలు శీతల జలాలతో
ప్రాణదానం చేస్తుండగా—
భూదేవి తల్లిలా పంటతో
శరీరాన్ని రక్షిస్తుండగా—
మనిషి మరో మనిషిని
ఆశ్రయించ వలెనా?
ప్రకృతి నాశ్రయించి
బ్రతకడం నేర్చుకుంటే—
ఈ బానిస బ్రతుకుల
వెట్టి చాకిరికి స్వస్తి చెప్పి
స్వేచ్ఛా సూర్యుని తనలో
తానే దర్శించ వచ్చు!

— కాణిపాకం లింగన్న

శీలం లేదా? ప్రేమ లేదా? భార్య భర్త శీలాన్ని శంకించదా? అతనిమీద ఎవరూ పుకార్లు లేవదీయరా? మరి ఆ పరిస్థితులో హీరో ఆత్మహత్య చేసుకున్నాడు అని ఎవరూ రాయరేం?"

ఉష తెల్లబోయి వింటోంది ఆమె ఉపన్యాసం.

ఆమె మాటల్లోని నిజం సూటిగా గుండెల్ని తాకుతోంది. ఈ విషయం ఇంతవరకూ తనకెందుకు తట్టలేదు? మగాడికి ఏమాత్రం పట్టింపులేని నీతిసూత్రాలన్నీ ఆడదానికే ఎందుకు పరిమితమయినాయ్? అలాంటి పరిస్థితుల్లో మగాడు ఏమాత్రం చలించనప్పుడు ఆడదెందుకు తల ఒగ్గాలి? ఎందుకు భయపడాలి?

మరోయువతి స్టేజిమీద కొచ్చింది.

"నేనీమధ్య ఓ వారపత్రికలో కథ చదివాను! అందులో ఓ అమ్మాయికి పెళ్ళి కాదు. అందుక్కారణం వాళ్ళు బీదాళ్ళు కట్నం ఇవ్వలేరు, చాలారోజులు పెళ్ళి అవుతుందనే ఎదురు చూస్తుందామె. ఎన్నో సంబంధాలు వచ్చి పోతూంటాయ్. చివరకు ఆమె వయసు దాటిపోతుంది. దాంతో వచ్చే సంబంధాలు కూడా రావు. అప్పుడు ఆమె జీవించడం అనవసరం అనుకుని ఆత్మహత్య చేసుకుంటుంది. ఈ రోజుల్లో కూడా ఇలాంటిభావాలున్న రచయిత్రులు మనకున్నారు. పెళ్ళికాకపోతే ఆడది ఒంటరిగా జీవించలేదా?

ఏదొక ఉద్యోగం చేసుకుని తన పొట్ట తను పోషించుకోలేదా? ఆ తరువాత మీటింగ్‌లోని వారందరూ ఆ చుట్టుపక్కలున్న పుస్తకాల షాపులకెళ్ళి తాము నిరసించిన నవలలను అమ్మకం నుంచి తీసేయమని కోరారు.

ఆ కార్యక్రమం ముగిశాక ఇంటికి చేరుకునేసరికి పదిగంటలయిపోయింది. మీటింగ్‌లోని విషయాలన్నీ చెబుతుంటే ఆశ్చర్యపోయి వినసాగిందామె తల్లి.

మర్నాడు బాంక్ కెళ్తుంటే జయలక్ష్మి కనిపించిందామెకి.

"ఎలా వుంది బాంక్ జాబ్?" అడిగింది జయలక్ష్మి.

"బాగానే వుంది..."

"ఐ హేట్ దట్ జాబ్..." అందామె.

"ఎందుకని?"

"ఎప్పుడూ అదే పని! దేరీజ్ నో ఛేంజ్ ఎంత బోర్‌గా ఉంటుంది?"

ఉష నవ్వి వూరుకుంది.

"మరి ఏ జాబ్ బాగుంటుంది మీకు?"

"అయ్ లైక్ ఎయిర్ హోస్టెస్ జాబ్! ప్రతి క్షణం థ్రిల్స్ అనుభవించవచ్చు! మా ఫ్రెండ్ వసంతా వాళ్ళ సిస్టర్ ఆమధ్యే సెలక్టయింది. ఆమె చెప్పే సంగతులు వింటూంటే అసలు చేస్తే ఆ జాబే చేయాలనిపించింది..."

సీటు ఖాళీ అవడంతో ఇద్దరూ సీట్లో కూర్చున్నారు.

"మీ పత్రిక ఎలా వుంది ?" అడిగింది ఉష

"అది ఇంచుమించుగా ఎత్తేసినట్లే ! ఇంకో పత్రిక పెట్టాలని చూస్తున్నారు మా నాన్నగారు "

"అదివరకే వుందిగా ఆ ఆలోచన ?"

"ఇప్పుడు మేమే కాకుండా మరికొంత మంది పార్ట్నర్స్‌నుకూడా వేసుకోవాలని ప్లాన్, ఎందుకో తెలుసా ? మా నాన్న పేరుగానీ, మా ప్రెస్ పేరుగానీ ఉంటే ఎవ్వరూ ఆర్టికల్స్ పంపరని తెలిసిపోయింది..." నవ్వుతూఅందామె. ఉష కూడా నవ్వేసింది.

"కృష్ణ ఎప్పుడయినా కనపడ్డాడామీకు?" అడిగింది జయలక్ష్మి.

"ఈ మధ్య కనిపించలే..."

"నాకు కనిపించాడు !"

"ఎక్కడ ?"

"విద్యానగర్‌లో ! అదేదో స్కూల్లో టీచర్‌గా చేస్తున్నాడట..."

"అలాగా !" అసక్తిగా అందామె.

"వాడో పెద్ద ఇడియట్ !" కసిగా అంది జయలక్ష్మి.

ఉష ఉలిక్కిపడింది.

"ఎందుకూ ?"

"ఆ మధ్య కనిపించాడు, విద్యానగర్ స్కూల్లో పనిచేస్తున్నాడట ! పోనీలే చాలా కాలానికి కనిపించాడు గదాని హోటల్‌కు రమ్మని బలవంతంచేసి తీసుకెళ్లాను. కూల్‌డ్రింక్స్ ఇద్దరికీ ఆర్డర్‌చేశాక తనకు వద్దని రిటర్న్ చేశాడు. ఏమయినా మేనర్స్ ఉందా మీరే చెప్పండి." కోపంగా అడిగింది జయ.

ఉష జవాబుగా నవ్వి ఊరుకుంది.

"ఇడియట్ కాదు. వాడో వట్టి ఫూల్ కూడా !" మళ్లీ అంది జయలక్ష్మి.

"ఏం ?"

"అవకాశాన్ని ఉపయోగించుకోవడం తెలీదు !"

"ఏ అవకాశం ?"

"నేనిచ్చిన అవకాశం .."

ఉష గుండెలు వేగంగా కొట్టుకోసాగినయ్. కుతూహలం పెరిగిపోయింది.

"ఏంజరిగింది ?" ఆత్రుతగా అడిగింది.

"నేను అతన్ని పెళ్లి చేసుకోవాలనుకున్నాను. అందంగా ఉన్నాడుగదాని ప్రేమించాను. కానీ ఇంత ఫూల్ అని నాకేం తెలుసు ? డైరక్ట్‌గా ఆ విషయం చెప్పకుండా ఎన్నోవిధాలుగా నా ప్రేమ తెలియజేశాను. ఎక్కడికయినా పిక్నిక్ వెళ్దాం రమ్మన్నాను. సినిమాకు వెళ్దామని బలవంతం చేశాను. వీటి అర్థం ఏమిటి ? ఏ టెన్త్‌క్లాస్ కుర్రాడయినా ఇట్టే గ్రహిస్తాడు. ఇతగాడు 'ఎంఏ' చదివి ఎందుకు దండగా ?"

"రానన్నాడా అతను ?"

"ఖచ్చితంగా చెప్పేశాడు. అదలా వదిలేయండి ! పోనీ వట్టి మట్టిబుర్ర అండర్‌స్టాండ్ చేసుకోలేదు అనుకుందాం ! మొన్న నానాఅవస్థ పడి అతని రూమ్ కెళ్లాను, అక్కడ సిగ్గు వదిలేసి స్పష్టంగా చెప్పేశాను అయ్‌లవ్‌యూ అయ్ వాన్ట్ టు మేరీయూ అని !"

ఉష మొఖం పాలిపోయింది. ఏదో తెలీని అలజడి !

"అదేమిటి అతన్ని పెళ్ళి చేసుకుంటారా?"

"అవును ! ఏం ?"

"అతని చరిత్ర మీకు తెలీదు అతను— అతను — ఓ అమ్మాయిని మోసం చేశాడు. ఆ అమ్మాయి పాపం — అతనివల్లే ఆత్మహత్య చేసుకుంది !"

జయలక్ష్మి పక పక నవ్వింది.

"ఆత్మహత్య చేసుకుందా ?"

"అవును !"

"ఎందుకు !"

"అతను పెళ్ళి చేసుకుంటానని ఆమెను నమ్మించి, ఆమెతో ప్రణయ కలాపాలు జరిపి మోసం చేసినందుకు —"

"అయితే అందుకు ఆత్మహత్య చేసుకుంటారా ! ఫూలిష్! దిసీజ్ మియర్ నాన్సెన్స్! అలాంటి గాళ్స్‌ని హేట్ చేస్తాను !"

ఉషకు కోపం ముంచుకొచ్చింది.

"ఎందుకు ?"

"ఎందుకేమిటి ? ఆత్మహత్యలు చేసుకోవడం ఎందుకూ పనికిరానివాళ్ళు, చేతకాని దద్దమ్మలు చేసే పని !"

"అయితే — ఆ మోసగాడిని నువ్వు పెళ్ళి చేసుకోడానికి సిద్ధమేనన్నమాట !"

"హరికథలు చెప్పకండి ఉషగారూ ! మగాళ్ళల్లో శ్రీరామచంద్రులు ఎవ్వరూ లేరు ! ఎవరికి తెలీదీ సంగతి ? అయినాగానీ, అందరూ పెళ్ళిళ్ళు చేసుకోవటంలా ? కాపురాలు చేయటంలా ? "ఒకవేళ కృష్ణలాంటివాళ్ళు అనర్హులు" అనుకుంటే దేశంలో ఆడపిల్లలందరూ పెళ్ళిళ్ళు కాకుండానే మిగిలిపోతారు ! మగాడి తాలూకూ పాస్టూ, ఫ్యూచరూ రెండూ మనం తెలుసుకోలేం ఉషగారూ ! అందుకే 'ప్రెజెంటెన్స్'ను పట్టుకుని జీవితం గడిపేయాలి ! అయినా ఇంకా అతని గొడవెందుకు లెండి ! వాడో ఇడియట్ అని చెప్పాను కదా ! నాలాంటి ఆస్తి, అందం, చదువూ వున్న పిల్ల కోరితే ఇంకెవరయినా ఎగిరి గంతేసి ఒప్పుకుంటారు. కానీ ఈ ఫూల్ నన్ను గదిలోనుంచి బయటకు గెంటినంత పని చేశాడు !"

బస్ ఆబిడ్స్‌లో ఆగింది. జయలక్ష్మి దిగి హడావుడిగా వెళ్ళిపోయింది.

ఉష తనూ బస్ దిగి బ్యాంక్‌వేపు నడవసాగింది. మనసంతా ఆలోచనలతో కల్లోలమయి పోయింది.

అతను జయలక్ష్మిని ఎందుకు కాదన్నాడు ? తనను చేసుకోడానికి ఎందుకు ఒప్పుకున్నాడు ? జయలో లేనిది తనలో ఏముందని ?

తన అందమా ? తను అతి చనువుగా మసలకపోవడమా ? ఏది ఆకర్షించింది ?

తను కాదంటే అతనిక బ్రహ్మచారిగానే ఉండిపోతాడా ?

అతను చెప్పిన మాటలు నిజమేనేమో !

తన ప్రేమ ఒక్కటే అతనికి జీవితంమీద ఆసక్తి కలుగజేస్తుందేమో !


శాంతి వెనుక కారిడార్‌లో ఓ యువకుడితో మాట్లాడుతోంది.

ఉషకు అనుమానం కలిగింది.

అతను ఆమె బాయ్‌ఫ్రెండేనా ?

మరొకసారి అతనివేపు చూసిందామె.

తెల్లగా, పొడుగ్గా, కర్లీహెయిర్, కూలింగ్ గ్లాసెస్— ఆకర్షణీయంగానే ఉన్నాడతను.



ఆంధ్రసచిత్రవారపత్రిక

రచయితలకు గమనికలు

ఆంధ్ర సచిత్ర వారపత్రికకు కథలూ, యితర రచనలు పంపదలచుకున్నవారు
సంపాదకుడు,
ఆంధ్రసచిత్ర వారపత్రిక,
గాంధీనగరం, విజయవాడ-520 003.
అన్న చిరునామాకి వ్రాయాలి.

★ కవరుమీద శీర్షికపేరు పేర్కొనడం మంచిది. రచయితలు తమ పూర్తి పేరూ, చిరునామా రచన చివరకూడా స్పష్టంగా వ్రాయాలి — హామీపత్రం జతచెయ్యాలి.

★ గేయాలు తిప్పి పంపబడవు. వీటి పరిశీలనకు కూడా సుమారు ఏడు నుంచి ఎనిమిది వారాల గడువు అవసరం.

★ కథలుగాని, యితర రచనలుగాని తిప్పి పంపబడాలని కోరుకునే వారు — వారి స్వంత చిరునామాగల తగినన్ని తపాలాబిళ్ల లంటించిన కవరు పెట్టడం అవసరం.

★ రచనల గురించి పంపిన వెంటనేగాక ఎనిమిది వారాల తరువాత మాత్రమే వాటిపై నిర్ణయంకోసం ఎదురుచూడడం మంచిది. రచనల గురించి ఉత్తర ప్రత్యుత్తరాలకి తావులేదు. కాని— తప్పనిసరి పరిస్థితులలో వాటిపై వ్రాయవలసివస్తే రచయితలు — రచన పేరు — అది పంపినతేదీ, వాటి గురించి పరిశీలించడం కష్టం.

★ మా కార్యాలయానికి రచనలు తెచ్చి ఇచ్చేవారు కూడా పై నిబంధనలన్నీ పాటించాలి. వారికి కూడా స్వంత చిరునామాగల తగినన్ని తపాలాబిళ్లలంటించిన కవరు జత చెయ్యాలి అన్న నిబంధన వర్తిస్తుంది.

★ కార్టూన్‌లు పంపేవారుకూడా ఎనిమిది వారాలలోగా మా మీద ఉత్తరాలదాడి చెయ్యకూడదు ... ప్రతీ కార్టూన్ వెనుక పూర్తి పేరు, చిరునామా వ్రాయాలి.

★ ప్రత్యేక సందర్భాలుగా వేసిన కార్టూన్‌ల కవర్లపై ఆ విషయం వ్రాస్తే వాటి పరిశీలన త్వరితంగా జరుగుతుంది.

★ రచనల ఎంపిక, తరువాత వాటి ప్రచురణ విలువెంబడి జరుగుతుంది.

★ రచయితలకు, కార్టూనిస్టులకు [ఒక్క ఉత్తరాలు, ప్రశ్నావళి, డాక్టర్ సలహాల శీర్షికలో 'పడ్డ' వారికి తప్ప తతిమ్మా అందరికి] అవి పడ్డ ''ప్రతు''లను — కాలక్రమంలో వాటి పారితోషికాలను పంపుతాము. కాపీలు టపాలో పోయే ప్రమాదం వుంటుందే తప్ప పంపకపోవడం జరుగదు.

సం॥

జీవితం - సెంటిమెంట్

మరి కాసేపు మాట్లాడి అతను వెళ్ళిపోయాడు.

శాంతి తిన్నగా ఉష దగ్గర కొచ్చింది.

''ఎవరతను ?'' అడిగింది ఉష.

''అతనే మా హీరో''

''నేననుకున్నాను''

''ఎలా వున్నాడు ?''

''నువ్వు చెప్పినంత ఎట్రాక్టివ్‌గాలేడు...''

''నా కళ్ళతో చూస్తేగాని నీకు తెలీదులే'' నవ్వుతూ అంది శాంతి.

''ఎందుకొచ్చాడతను ?''

''త్రీ డేస్‌హాలిడేస్‌వస్తున్నాయ్‌కదా బాంక్‌కి! ఇద్దరం బాంబే వెళ్దామని ప్లాన్ చేస్తున్నాం..'!

''బాబోయ్ మూడు రోజులే !''

''నాకు లేని భయం నీకెందుకు ?''

''భయం కాదు !''

''మరి !''

''ఆశ్చర్యం! అక్కడేంచేస్తారన్నిరోజులు?''

''చాలా చేయవచ్చు బాంబేలో! నువ్వెప్పుడూ వెళ్ళలేదా ?''

''ఊహుఁ !''

''అందుకే అలా అడుగుతున్నావ్ !''

ఆమె వెళ్ళిపోయింది.

మర్నాటి నుంచీ సెలవలు !

సాయంత్రం ఎ. జి. యమ్. సెక్షన్‌లో పనిచేస్తున్న అనిత వచ్చిందామె దగ్గరకు.

''సండే పిక్నిక్ పార్టీకి వెళ్తున్నాం మేము ! ఆర్ యూ ఇంట్రెస్టెడ్ ?''

''ఎక్కడికి ?''

''ఇంకా డిసైడ్ కాలేదు. యాన్ అయిడియల్‌స్పాట్ సమ్‌వేర్ !''

''ఎవరెవరు ?''

''నేనూ, రజియా, సోనీ, దీప్తి ''జెంట్స్'' అయిదుగురు.''

''సోనీ అంటే ? ...'' అనుమానంగా అడిగిందామె.

''అదే ! టేబుల్ టెన్నిస్ ఆడదూ ?''

ఉషకు అర్థమయింది.

సోనీ పేరు బాంక్‌లో అందరికీ తెలుసు. ఆమె మగాళ్లతో ఆడుతుంది. బార్స్‌కెళుతుంది. తాగుతుంది. సినిమాలకెళ్తుంది. ఇంకా చాలా కథలున్నాయ్ ఆమె గురించి ! కానీ అవన్నీ తను చూడనివి. చూడనివి నమ్మటం తనకిష్టంలేదు.

''చాలా ఎంజాయ్ చేయవచ్చు. రాకూడదూ ?'' తిరిగి అడిగింది అనిత.

''మగాళ్లెందుకు మనతో ?'' అడిగింది ఉష.

అనిత నవ్వాపుకుంది.

''వాటేఫన్నీ గాళ్ యూ ఆర్ ! వాళ్ళు లేకుండా మనంవెళ్లి ఏంచేస్తామక్కడ ? తినాలి,

తాగాలి, డిస్కో డాన్స్‌లు చేయాలి కంప్లీట్ నైట్ ఎంజాయ్ చేయవచ్చు.''

''సారీ ! నేను రాలేను,''

''ఓకే—డోంట్‌బాదర్ !...'' మరో సెషన్ లోకెళ్ళిపోయిందామె.

ఆడా మగా కలిసి అలాంటి ప్రోగ్రామ్స్ ఎరేంజ్ చేసుకుంటున్నారని తనతో అదివరకోసారి శాంతి చెప్పింది.

కానీ ఆమె కలాంటివి ఇష్టంలేదట ! అందుకే తను జాయినవలేదట, అయితే ఆ పార్టీలకెళ్ళే అమ్మాయిలు చాలా తక్కువమంది ఉన్నారు బాంక్‌లో !

''తాగిన తర్వాత ఎవరెవరెలా ప్రవర్తిస్తారో ఎవరికి తెలుసు ?— మనకు నచ్చిన వాడితో గడపడం వేరు ! ముక్కూ మొగం తెలీని వ్యక్తులతో గడపడం వేరు ! అవునా కాదా ?''

శాంతి మాటలు గుర్తుకొచ్చినాయామెకి.

శెలవులు అయిపోయాయ్.

ఆ మూడు-రోజులూ ఆలోచనలన్నీ అనిత సోనీలమీదే ఉన్నాయ్. వారంతా ధైర్యంగా విప్లవాత్మకంగా ఎలా ప్రవర్తిస్తున్నారు ? 'ఆనందం' కోసం మిగతా విలువలన్నీ ఎందుకు పక్కకు నెట్టేస్తున్నారు ?

ఆ రోజు బాంక్‌కి రాలేదు శాంతి.

'బాంబేలోనే ఉండిపోయారేమో మరోరోజు కూడా' అనుకుంది ఉష.

మధ్యాహ్నం సుధీర్ వచ్చాడామె దగ్గరకు.

''నేను ట్రాన్స్‌ఫర్ అయాను. మీకు తెలుసా ?'' అడిగాడతను.

''ఎక్కడికి ?'' ఆశ్చర్యంగా అడిగిందామె.

''మహబూబ్‌నగర్...''

''అబ్బ ! అంత దూరమే !''

''నేనే అడిగాను—అక్కడకు పంపించమని''

''ఎందుకు ? మీ నేటివ్‌ప్లేసా అది ?''

''కాదు !''

''మరి ?''

''నిజం చెప్పెయ్యమంటారా ?''

''బాగుంది !'' నవ్వుతూ అందామె.

''సరే నిజమే చెప్తాను ! కానీ ఆ మాట విని మీరేం బాధపడకూడదు...''

''అదేమిటి ?'' కలవరపాటుతో అడిగిందామె.

''ఎందుకంటే — ఆ జవాబుకి మీతో సంబంధం ఉంది కాబట్టి !''

''నాకేం అర్థంకావటంలేదు...

''మరేంలేదు. మిమ్మల్ని మర్చిపోవాలంటే అదొక్కటే మార్గం !''

ఆమె నిశ్శబ్దంగా ఉండిపోయింది.

''నేను చాలా ప్రయత్నించాను ఉషగారూ! మీ ఎదురుగ్గా ఉంటూ మీరు నాకేమీ కాలేరు'' అనుకోవడం ఎంతో బాధగా ఉంది. అందుకే దూరంగా వెళ్ళాలనుకొన్నాను..''

ఉషకు కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్. అతి కష్టంమీద దుఃఖం ఆపుకుంది. తనది నిజంగా చాలా దురదృష్టకరమయిన జాతకం తను ప్రేమించినవారినీ, తనను ప్రేమించివారినీ అందరినీ బాధపెడుతోంది. ఆఖరికి తనను తనే బాధించుకుంటోంది.

అతను వెళ్ళిపోతూ అన్నాడు.

''రిలీవ్ అయాక మీకు మళ్ళీ కనిపిస్తాను ఆఖరుసారిగా !''

రోజులెలాగ గడచిపోతున్నాయో తెలీటం లేదు. పగలంతా ఆఫీస్ పని — రాత్రంతా ఆలోచనలు.

శాంతికి సికింద్రాబాద్‌లోని బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది.

దాంతో ఆమె లేని లోటు మరింత బాధాకరంగా తయారయింది.

ఓ రోజు హఠాత్తుగా వచ్చింది శాంతి.

''ఏమిటి బాంకింగ్ అవర్స్‌లో వచ్చావ్ ? ఎగ్గొట్టావా ?'' అడిగింది ఉష.

''ఎగ్గొట్టక తప్పలేదు...'' నవ్వుతూ అందామె.

''ఏమిటి సంగతి ?''

''నా మారేజ్ !'' బాగ్‌లో నుంచి ఓ శుభలేఖ తీసి ఆమె కందించింది శాంతి.

ఉష ఆశ్చర్యపోయింది.

''పెళ్ళా ?''

''ప్రస్తుతానికి మారేజ్ అంటే అదొక్కటేగా అర్థం ఉంది ?''

''ఇంత సడెన్‌గా ఎనౌన్స్ చేస్తూంటే ఆశ్చర్యంగా ఉందోయ్ .''

శుభలేఖ చూసిందామె.

''మీ హీరో పేరు సురేష్ అన్నమాట !''

''ఛట్ ఇది అతనుకాదు''

ఉష తెల్లబోయింది.

''నువ్ మారేజ్ చేసుకుంటోంది మీ హీరోని కాదా ?''

''కాదు తల్లీ కాదు''

''అదేమిటి ?''

''మేము చేసుకోవాలంటే కొన్ని అడ్డంకులు వచ్చాయ్ !''

''ఏమిటవి ?''

''అతనికి పెళ్ళి కావలసిన అక్కయ్య ఉంది. ఆమెకు మారేజ్ అయితేగాని అతను చేసుకోడానికి వీలుండదు. మావాళ్ళేమో నా పెళ్ళి ఇప్పుడే అనాలంటున్నారు. అందుకని ఎవరికివారే యమునాతీరే అయిపోయాం''

''మరి ఇద్దరూ అంత క్లోజ్‌గా మూవ్ అయాక — ఇప్పుడు...'' తన మనసులోని మాట ఎలా చెప్పాలో తెలీక ఆగిపోయిందామె.

''దానికి ఎవరేం చేయగలరు. మనం అనుకున్నవన్నీ అనుకున్నట్లు జరుగుతాయా ?''

ఉష ఉక్కిరిబిక్కిరయింది.

ఆ విషయం ఎంత తేలికగా తీసుకుంటోందీమె ?

కేవలం ఇందుకే తన అక్కయ్య ఆత్మహత్య చేసుకుందన్న విషయం తెలుస్తే ఆమె ఎలా ఫీలవుతుంది ?

నవ్వుతుందా ? పరిహసిస్తుందా ? తను సిగ్గుపడుతుందా ?

''మరి పెళ్ళికొస్తున్నావా లేదా ?'' అడిగిందామె.

''రాకుండా ఎలా వుంటాను ?''

రాకపోతే మాత్రం చాలా గొడవయిపోతుంది మనిద్దరికీ గుర్తుంచుకో !''

''ఛ ! తప్పక వస్తానే !''


''సరే— వెళ్తాను మరి ! ఇంకొంతమందికి కార్డ్స్ డిస్ట్రిబ్యూట్ చేయాలి...''

ఆమె వెళ్ళిపోయింది.

శుభలేఖ తీసి మరోసారి చూసింది ఉష.

పెళ్ళికి సరిగ్గా రెండు రోజులుందింకా !

సాయంత్రం ఏడుగంటలకు మారేజ్ !



ఆ రెండు రోజులూ శాంతి గురించే ఆలోచనలు !

పెళ్ళికి బాంక్ నుంచి చాలా మంది హాజరయారు.

వివాహం జరుగుతూంటె శాంతినే గమనిస్తూ కూర్చుంది ఉష !

ఆమెలో ఎలాంటి మార్పూ కనిపించలేదు.

ఎప్పటిలా నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడుతోంది అందరితోనూ.

తమ నందరినీ వరుసగా భర్తకు పరిచయం చేసింది.

అతని ఫ్రెండ్స్‌ని పరిచయం చేసుకుంది.

అంతా చాలా రొటీన్‌గా, జరిగిపోతోంది.

ఆమెకు లోలోపల గిల్టీగా ఉంటుందా ?

ఏమో !

అలా కనిపించటంలేదు.

అయినా 'తప్పు' చేశాను అనుకునేవారికి 'గిల్టీనెస్' ఉంటుంది. కానీ అసలు అది 'తప్పే కాదు' అనుకుంటే ఇంక 'గిల్టీనెస్' ఏమిటి ?

డిన్నర్ అయ్యాక ఇంటికి చేరుకుందామె.

కుమారి శాంతి శ్రీమతి శాంతి అయిపోయిందివాళ.

ఆమెకూ తనకూ ఆలోచనల్లో, అభిప్రాయాల్లో, ప్రవర్తనలో ఇంత తారతమ్యం ఎందుకొచ్చింది.

పట్టణ వాతావరణమా ?

సిటీ కల్చర్ అలాంటిదా ?

ఆమె పెరిగిన పరిసరాలు, ఆమె స్నేహితురాండ్ర వల్ల ప్రభావితం అయిందా ?

లేక ఆధునిక ధోరణి అలాంటిదా ?

ఏదీ తెలీటంలేదు. మరికొద్దిరోజులు గడచిపోయినయ్.

ఆమె ఆలోచనల్లో మళ్లీ కృష్ణ చోటు చేసుకుంటున్నాడు.

అలా ఎందుకు జరుగుతుందో అర్థం కావటంలేదు.

కొద్దిరోజులు మనసులోనుంచి పూర్తిగా తొలగిపోయినట్లే ఉండి. మళ్లీ అకస్మాత్తుగా అతనే నిండిపోతాడు.

తన మనసు మీద తన కెందుకిలా అదుపు తప్పిపోతుంది ?

ఆరోజు లంచ్ టైమ్‌లో మళ్ళీ కనిపించాడు సుధీర్ !

''ఇక్కడ ఇవాళ నా ఆఖరిరోజు!'' నవ్వుతూ అన్నాడు.

''రిలీవ్ అయిపోయారా ?''

''ఇవాళ సాయంత్రంతో అయిపోయినట్లే.''

ఆమె అతనివంకచూసి చూపులు మరల్చేసుకుంది.

''ఇవాళ సాయంత్రం ఆఫీసయ్యాక కొద్దిసేపు నాతో గడుపుతారా ?'' అడిగాడతను.

జీవితం — సెంటిమెంట్

''ఎక్కడ ?'' అడిగిందామె.

''పార్క్‌కెళ్దాం !''

''సరే...''

అతను వెళ్ళిపోయాడు.

సాయంత్రం ఇద్దరూ ఇందిరా పార్క్‌కి చేరుకున్నారు.

''మీతో మాట్లాడాలనుకున్నది మీ విషయమే ఉషగారూ ! మీ మారేజ్ ఎందుకాగిపోయిందో చెప్తానన్నారు. 'తెలుసుకోవాలని' చాలా కుతూహలంగా ఉంది నాకు ! మీకు నేనేమయినా సహాయం చేయగలనేమో అన్న ఉద్దేశ్యంతోనే అడుగుతున్నా నీ విషయం.'' అన్నాడతను కొద్దిసేపు నిశ్శబ్దంగా కూర్చున్నాక.

ఉష అతని అభిమానానికి చలించిపోయింది.

మొదటినుంచీ జరిగిందంతా వివరంగా చెప్పసాగిందతనికి. ఆమె చెప్పడం పూర్తయిన చాలాసేపటివరకూ ఏమీ మాట్లాడలేకపోయాడతను.

''ఉషా ! మీరు మరోలా భావించనంటే మీకు నా అభిప్రాయం చెప్తాను'' అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

ఉష నవ్వింది.

''తప్పకుండా చెప్పండి ! మీకంటె ఆప్తులింకెవరున్నారు కనుక ?''

''మీ సిస్టర్ సావిత్రి ఆత్మహత్య చేసుకోవడం తెలివిలేని పని ! దానికిబదులుగా తనను మోసంచేసిన వ్యక్తిని జైలుపాలుచేసి ఉంటే అందరూ సంతోషించేవారు. ఆమె శీలం పోగొట్టుకోవడం తప్పుకాదుగానీ దానికోసమని తన ప్రాణం తీసుకోవడం ఆమె మూర్ఖత్వం ! శీలం పోగొట్టుకున్నంత మాత్రాన చచ్చిపోవాలా? అలా అయితే భర్త చనిపోయిన స్త్రీలూ ఆత్మహత్య చేసుకోవలసిందేగా ? అంటే ఇన్‌డైరెక్ట్‌గా సతీసహగమనం అమలుపరుస్తున్నామన్నమాట మనం !

ఈ రోజుల్లో శీలం పోతే జీవితం వృధా అనుకోవడం ఆ స్త్రీ ఔన్నత్యాన్ని తెలుపదు. పరిపక్వం చెందని ఆమె మానసిక స్థితినీ, ఆమె మూఢనమ్మకాలనూ తెలుపుతుంది.

అలాంటివాళ్ళను 'చూస్తే జాలి కలగదు. నవ్వు వస్తుంది.''

ఉష నిర్ఘాంతపోయి వింటూండిపోయిందతని మాటలు. అతని మాటల్లో ఎలాంటి అనౌచిత్యమూ కనిపించటంలేదు.

''ఇక కృష్ణ విషయం అంటారా ! ఆడపిల్లల జీవితాల్తో ఆడుకున్నందుకు అతనికి తగిన శాస్తి జరగాల్సిందే ! అయితే సావిత్రి ఆత్మహత్య అతనికి నిజంగానే పశ్చాత్తాపం కలుగజేస్తే ఇంక అతనికి వేరే శిక్ష ఎందుకు ? అతను కావాలని సావిత్రిని చంపలేదు కదా !

కనుక అతనిని క్షమించడం, క్షమించకపోవడం అనేది మీమీద ఆధారపడి ఉంది. మిగతా అన్ని నేరాల్లాగానే ఇదీ ఓ నేరంగా భావిస్తే, మిగతా అందరి నేరస్తులనూ క్షమించినట్లే ఇతనినీ క్షమించడంలో తప్పేమీలేదు —''

అతను మాట్లాడడం ఆపాడు.

ఉష మనసంతా గజిబిజిగా అయిపోయింది.

''అయామ్‌సారీ ఉషా! నా అభిప్రాయలూ, ఆలోచనలూ మీ మీద రుద్దడం నా అభిమతం కాదు ! మనసులో నేననుకున్నది చెప్పానంతే! మీరే మీ మనసుకి తోచిన విధంగా నిర్ణయం తీసుకోవడం మంచిది —

చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారిద్దరూ.

టైము చూచుకున్నాడతను.

ఎనిమిదయిపోయింది.

''ఇంక వెళ్దామా ?''

''ఊఁ !''

ఇద్దరూ రోడ్డుమీదకొచ్చారు.

''అయామ్ వెరీ హాపీ ఉషా ! వెళ్లేముందు మీతో మాట్లాడుతూ కాసేపు గడపాలనిపించింది. ఆ అవకాశం ఇచ్చారు. ఇంకొక్క విషయం గుర్తుంచుకోండి ! మీకెప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా నేనున్నాను.''

''థాంక్యూ'' అందామె.

''గుడ్‌బై''

''గుడ్‌బై''

ఆ పక్కనేఉన్న ఆటోలో కూర్చుందామె.

ఆ రాత్రంతా నిద్రపట్టలేదామెకి. ఏంచేయాలా అనే విషయం ఎటూ నిర్ధారించుకోలేకపోతోంది.

తెల్లారిపోవడం తెలుస్తూనే ఉంది.

''మిగతా అందరు నేరస్తులనూ క్షమించినట్లు అతనినీ ఎందుకు క్షమించగూడదు ?'' అన్న సుధీర్ మాటలు ఆమెను క్రమేపీ ప్రభావితం చేస్తున్నయ్.

హఠాత్తుగా ఓ నిర్ణయానికొచ్చినట్లు లేచి త్వరత్వరగా రడీఅయి ఇంట్లో నుంచి బయల్దేరిందామె.

కృష్ణ పని చేస్తున్న స్కూల్ చేరుకుని గేటుదగ్గర నిలబడి టైమ్ చూచుకుంది.

ఎనిమిదికూడా అవలేదింకా. స్కూల్ తలుపులు తెరవనేలేదు. అప్పుడప్పుడే ఒకరొకరుగా పిల్లలు స్కూలు కొస్తున్నారు.

కృష్ణ కోసం ఎదుర్చూస్తూ నిలబడిందామె.

(అయిపోయింది)



నన్ను మినహాయించండి

ఇసుకపల్లి సుజాత

సాయంత్రం అయిదు గంటలయినా సూర్యుడికింకా కసి తీరలేదు. ఆకాశంలో అలా ఏకాకిలా ఉండాల్సి వచ్చినందుకు మండిపోయి ఇంకా నిప్పులు చెరుగుతున్నాడు.

కుర్చీలో ఫ్యాన్ కింద కూర్చున్నా అసహనంగా అటూ ఇటూ కదులుతున్నాడు కృష్ణమూర్తి.

డాక్టరేమో ఇంకా రాలేదు. వచ్చిన వాళ్ళందరూ నంబర్లు తీసుకుని కూర్చుంటున్నారు. కొందరు నంబర్ తీసుకుని గాలి ఆడుతుందని అలా కాస్సేపు తిరిగి రావటానికని బైటికెళ్ళారు.

కృష్ణమూర్తికి కూడా బైటికి వెళ్ళాలనే ఉంది హాయిగా. కానీ ఒకసారి లేస్తే మాత్రం మళ్ళీ కూర్చునే చోటు దొరకదేమోనని భయం.

పిల్లలు, పెద్దలు, వృద్ధులు రకరకాల వయస్సుల వాళ్ళూ అక్కడున్నారు.

కొంతమంది పైకి కనిపించేట్టుగాను, మరి కొంతమంది లోలోపలే కుమిలిపోతూ రకరకాల బాధలతో వాళ్ళంతా అల్లాడిపోతున్నారు.

'అబ్బ! ఇంత మంది రోగులేంటో అసలు?' అని చిరాకు పడిపోయి మళ్ళీ తనలో తానే సణుక్కున్నాడు

"మరి తను వచ్చింది ఎందుకో? అన్న విషయం గుర్తుకు వచ్చి.

కొంతమంది పిల్లలు ఎవరికి తోచినట్టు వాళ్ళు ఆడుకుంటున్నారు.

మరి కొందరు మంచి నీళ్ళు కావాలనో లేకపోతే బిస్కెట్లు కావాలని పేచీ పెడుతూ పెద్ద వాళ్ళను ఏడ్పిస్తూ వాళ్ళు ఏడుస్తున్నారు.

ఏదైనా కావాలంటే నెమ్మదిగా అడగాలి కానీ ఊర్కెనే అలా ఏడుస్తారెందుకీ పిల్లలు అని విసుక్కుంటూ కాస్త హాయిగా విశాలంగా కూర్చుందామని ప్రయత్నించాడు.

కానీ కుదరలేదు. ఇంత ఇరుగ్గా ఉందేమిటని పక్కకు తిరిగి చూసేసరికి తన పక్కనే ఒక అపరిచిత వ్యక్తి కూర్చుని ఉన్నాడు.

ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి.

తనకు తెలియకుండా పైగా తన కుర్చీలోనే, తన పక్కనే అంత నేర్పుగా ఎలా ఇరికాడా అని నొసలు చిట్లించి అతని వైపు చూశాడు కృష్ణమూర్తి.

అతను నవ్వాడు.

అతని స్వరంలో అణకువ తొణికిసలాడుతోంది.

'నాది పదిహేను, మరి....మీ నంబరెంత' అడిగాడు కుతూహలంగా కృష్ణమూర్తి.

'నాది ఇరవైలెండి' అన్నాడు

అతని మొహం దిగాలుగా ఉంది.

ఆ నంబర్ విన్నాకగానీ కృష్ణమూర్తి మనస్సు నెమ్మదించలేదు. పై పెచ్చు అతను తనకంటే ఆలస్యంగానే ఇంటికి వెళ్తాడులే అని సంతోషించాడు కూడా.

'నేనే ఎప్పుడు బైటపడతానా అని ఎదురు చూస్తుంటే పాపం, ఇరవయ్యో నంబరంటే మరి మీరెప్పుడు బైట పడేటట్టు? అయినా నంబర్లు కదలటం మొదలయ్యిందంటే చిటికెలో వచ్చేస్తుందిలెండి మీ ఇరవయ్యో నంబర్' అని పైకి మాత్రం జాలి పడుతూ కాస్త ధైర్యం చెప్పాడు.

అతను చిన్నగా నవ్వాడు.

డాక్టర్ వచ్చినట్టున్నాడు.

జనంలో కలకలం బయలుదేరింది.

అయిదు నిమిషాలు గడిచాయి.

కాంపౌండర్ కేకేశాడు.

ఒక వ్యక్తి లేచి లోపలి కెళ్ళాడు.

మళ్ళీ వెంటనే తలుపు మూసుకుంది.

పావు గంటయ్యాక ఆ వ్యక్తి బైటి కొచ్చాడు.

రెండో నంబర్ వాళ్ళను రమ్మన్నాడు కాంపౌండర్.

'ఇంత లేట్‌గా ఈ ప్రకారం లైను కదుల్తుంటే నా ఇరవయ్యో నంబర్ ఎప్పుడు వచ్చేను. నే నెప్పుడింటి కెళ్ళేను. మీరే చెప్పండి' అన్నాడా వ్యక్తి బాధగా కృష్ణమూర్తితో

ఏమీ తోచక కృష్ణమూర్తి నవ్వేసి ఊరుకున్నాడు

ఒక క్షణ మాగాక ఆ వ్యక్తి కృష్ణమూర్తి భుజాన్ని తట్టి 'అదిగో.. అటు చూశారా? ఆ లోపలి కెళ్ళే వాళ్ళను గుర్తు పట్టారా? వాళ్ళంతా మన తరువాత వచ్చిన వాళ్ళే. అప్పుడే వాళ్ళు లోపలి కెళ్ళిపోతున్నారు చూడండి. అసలు ఒక రూల్ పెడ్తే అందరూ ఆ రూల్ ప్రకారమే నడవాలి కదండీ. ఇలా మధ్యలో దూరితే మాత్రం నాకు మహా ఒళ్ళు మంట. దేనికైనా న్యాయం, ధర్మం ఉండాలి. ఎప్పట్నుంచో పడిగాపులు కాస్తున్న వాళ్ళంతా ఇక్కడే ఉండిపోయారు ఆలస్యంగా వచ్చిన వాళ్ళు మాత్రం తొందరగా లోపలి కెళ్ళిపోతున్నారు. అదే మనం చేస్తే ఎక్కడలేని రూల్సూ మనకే చెప్తారు' అన్నాడావ్యక్తి ఆవేశంగా

వాళ్ళు డాక్టర్ దగ్గర అంతకు ముందే అప్పాయింట్‌మెంట్ తీస్కున్నారేమో. మనకేం తెల్సు' అని సందేహం వెలిబుచ్చాడు కృష్ణమూర్తి.

'ఆ...ఈ అప్పాయింట్‌మెంట్లన్నీ వట్టి బూటకాలే-నండీ బాబూ. అసలు ఈ విషయా లేవీ డాక్టర్‌కు తెలియవు బైట నర్సులు కాంపౌండర్‌లు ఆడే నాటకా లివి.

వచ్చిన వాళ్ళు ఎంతో కొంత ఈ నర్సులకు ముట్ట చెప్తారు. దాంతో బైట మనతో వీళ్ళు అప్పాయింట్-మెంట్ తీస్కున్నారని చెప్పి తమకు ముట్ట చెప్పిన వాళ్ళను ముందు లోపలికి పంపించేస్తారు. ఇలాంటి చెత్త పనులు చెయ్యలేని మనలాంటి వాళ్ళు మాత్రం, ఇదిగో ఇలా మిగిలిపోతూంటాం అంతే' అన్నాడా వ్యక్తి నిస్సహాయంగా.

ఆ మాట నిజమేననిపించింది కృష్ణమూర్తికి.

'కాలం మారిపోతోంది. నీతీ నిజాయితీలకు నిలువ నీడ లేకుండా పోతోంది. మనమేం చేస్తాం చెప్పండి' అన్నాడు కృష్ణమూర్తి కొంత ఓర్పుగా.

'కాలం మారుతోంది నిజమే. నేను కాదనట్లేదు. అలాగని అందరూ ఇలా చూస్తూ ఊర్కుంటే ఎలా? లంచాలు ఇచ్చి పుచ్చుకోవడం, అన్యాయాలు చెయ్యడం ఇంకా మితిమీరిపోవూ? చిన్న విషయాలే కదా అని వీటిని ఇలాగే వదిలేస్తే ఇవే రేపు పెద్దవై నెత్తిమీద పెత్తనం చెలాయిస్తాయి. అసలు నన్నడిగితే ఆస్పత్రుల్లో కంప్లయింట్ బాక్స్ పెట్టి దాని తాళం డాక్టర్ తన దగ్గరే ఉంచుకుని వచ్చిన కంప్లయింట్స్‌ని పరిశీలించి తగిన చర్యలు తీసు-కుంటే బైట ఈ నర్సులు మొదలైన వాళ్ళు చేసే ఆగడాలు కాస్త అయినా తగ్గుతాయి. లేకపోతే మనలాంటి వాళ్ళకు చాలా కష్టమైపోతుంది' అన్నాడా వ్యక్తి ఉద్వేగంగా

నన్ను మినహాయించండి

'అవును మీరు చెప్పింది నిజమే. కానీ ఈ విషయం...డాక్టర్‌తో ఎవరు చెప్తారు' అని ఆలోచిస్తూ అడిగాడు కృష్ణమూర్తి.

"ఎవరో ఎందుకండీ, నేను లేనూ. ఇప్పుడే వెళ్ళి చెప్తాస్తాను కావాలంటే. అంతేకానీ ఈ అన్యా-యాన్ని మాత్రం నేను సహించలేను.

అరె...అసలు పది నంబర్లు నడిచాయంటే ఇరవై నంబర్లు నడిచినట్లు లెక్క అవుతోంది నంబర్లు-లేని తక్కిన పది మందీ గుట్టు చప్పుడు కాకుండా నర్సుల చేతిలో డబ్బు పెట్టి తొందరగా లోపలి కెళ్ళి వచ్చి ఇంటి కెళ్ళిపోతారు. అందరూ ఏదో బాధ ఉండ బట్టేగా ఆస్పత్రికి వచ్చేది పనులన్నీ మానుకుని అనవసరంగా ఇలా పడిగాపులు కాయాల్సిందేనా?' అన్నాడా వ్యక్తి కోపంగా కుర్చీలోంచి లేస్తూ.


కృష్ణమూర్తి అతని చెయ్యి పట్టి లాగాడు.

'మీ నంబర్ రానివ్వండి. అప్పుడే ఈ విషయం చెప్పచ్చు. మధ్యలో మీ రిలా న్యాయం ధర్మం అంటూ లోపలి కెళ్ళి చెప్తే అందరూ మిమ్మల్ని వింతగా చూస్తారు బాగుండదు కూర్చోండి' అన్నాడు కృష్ణమూర్తి అర్థింపుగా.

'మనమిలా వెనకా ముందూ ఆలోచిస్తూ కూర్చుంటే ఏ వ్యవస్థా బాగుపడదు. ఆ నర్సులు డబ్బు అవసరం కొద్దీ అడుగుతారు. డబ్బిస్తే పని తొందరగా అవుతుంది కదా అని వచ్చిన వాళ్ళిస్తారు డాక్టర్‌చేత నర్సులకు బుద్ధి చెప్పిస్తే ఈ తంటా లుండవుకదా. ఉండండి ఒక్క నిమిషం ...ఇప్పుడే వెళ్ళి డాక్టర్‌తో చెప్పొస్తా నీ విషయం అదిగో ఆయన అక్కడే ఉన్నాడు' అని గబ గబా లోపలి కెళ్ళాడా వ్యక్తి

కృష్ణమూర్తి నవ్వుకున్నాడు.

'ఇతని పిచ్చి గానీ ఇత నొక్కడూ వెళ్ళి చెప్పినంత మాత్రాన ఎప్పట్నుంచో ఈ పద్ధతికి అలవాటుపడ్డ ఈ నర్సులు మానుకుంటారా? అయినా ఈ విషయం డాక్టర్‌కి మాత్రం తెలియనిదా ముఖ స్తుతికి డాక్టర్ కూడా, అలాగా ఇకమీద అలా జరక్కుండా



అన్వేషణ

చందమామకు చల్లదనము
సన్నజాజికి సౌరభమ్మును
సత్యసూక్తికి శాశ్వతత్వము
ఎవ్వడిచ్చెను? ఎవ్వడిచ్చెను?
బొండుమల్లెకు పూర్ణధవళిమ
గండశిలలకు కఠిన దేహము
నిండు గుండెకు దండి చేతులు
ఎవ్వడిచ్చెను? ఎవ్వడిచ్చెను?
కంచు గంటకు క్రమనాదము
మించు చెలువకు మేని కాంతులు
మంచి మనసుకు మంచి తలపులు
ఎవ్వడిచ్చెను? ఎవ్వడిచ్చెను?

—కనములూరు వెంకట శివయ్య

చూస్తానని ఒక్కమాట అనేస్తాడు ఆ మాట కొస్తే ఇది ఆయనకు కూడా సాధ్యమయ్యే పని కాదు. ఇటువంటివి రూపు మాపటం అంత తేలికను-కుంటున్నాడితను పాపం!' అని జాలి పడుతూ పరి పరి విధాలుగా ఆలోచిస్తున్నాడు కృష్ణమూర్తి

ఇంతలో అతను బాణంలా దూసుకుని బైటికి రానే వచ్చాడు.

కానీ అదేంటి?, జరిగిందేంటో చెప్పకుండా అలా బైటి కెళ్ళిపోతున్నాడేంటి? డాక్టర్‌తో ఏమైనా ఘర్షణ పడ్డాడా ఏంటి? అని రక రకాలుగా ఆలోచిస్తూ లేచి గబ గబా రెండడుగులు ముందు కేశాడు కృష్ణమూర్తి పోనీ పిలుద్దామంటే తనకు అతని పేరేమిటో కూడా తెలీదు.

ఏం చెయ్యాలో తోచక పరుగున వెళ్ళి అక్కడున్న కాంపౌండర్‌నే-

'ఇప్పుడే బైటికి వెళ్ళిపోయిన ఆ వ్యక్తికీ, డాక్టర్‌కీ మధ్య పోట్లాటగాని, ఘర్షణగానీ ఏమైనా జరిగిందా?' అని ఆతృతగా అడిగాడు కృష్ణమూర్తి

'పరీక్ష చేయించుకుని మందు చీటీ రాయించుకుని అతను వెళ్ళిపోతుంటే, వాళ్ళు పోట్లాడుకున్నారా అని అడుగుతావేంటి' అన్నాడు కాంపౌండర్ కృష్ణమూర్తి కేసి చిరాకుగా చూసి, పదిలంగా రెండు రూపాయల నోటు మడిచి జేబులో పెట్టుకుంటూ

అది చూసి కృష్ణమూర్తి అవాక్కయ్యాడు

చేతిలో ఉన్న పదిహేనో నంబర్ చీటీ అతన్ని వెక్కి-రించింది. □

హైదరాబాదు నోట్‌బుక్

కొత్త గవర్నర్ :

ప్రభు భక్తి పరాయణుడై గవర్నర్ శ్రీ రామ్ లాల్ తన కర్తవ్యం చక్కగా నిర్వహించి వెళ్ళిపోయిన తర్వాత డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ గవర్నరుగా వచ్చారు. శ్రీ రామ్‌లాల్‌ను తలచుకొన్నప్పుడు నాకు ఒక ద్విజేంద్రలాల్ నాటకంలోని కాబిలేస ఖాన్ అనే పాత్ర జ్ఞాపకం వస్తుంది కాబలేస ఖాన్ శంభాజీని పట్టుకొని ఔరంగజేబుకు అప్పగిస్తాడు. దానికి అతడు పొందిన ప్రతిఫలం పదవీచ్యుతి ఆధునిక రాజకీయాలలో ఇలాటివి సర్వ సాధారణం. కొత్త గవర్నర్ డాక్టర్ శర్మ ఆగస్టు 29 భాద్రపద శుద్ధ తదియ ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు డాక్టర్ శర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి, పెక్కు విషయాలలో పరిశోధన చేసిన పండితుడు. శర్మ 1918 ఆగస్టు 19 న భోపాల్‌లో జన్మించారు 1933 లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులై 1937 లో అలహాబాద్ విశ్వ విద్యాలయంలో 1939 లో ఎం. ఎ, ఎల్ ఎల్. బి పట్టాలు పొందారు. పిదప సంస్కృతాంగ్లాలలోను ఎం. ఏ. అయ్యారు రెండేళ్ళపాటు లక్నో విశ్వ విద్యాలయంలో లెక్చరర్‌గా పని చేసి, కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో చేరి రాజ్యాంగ శాస్త్రంలో డాక్టరేట్‌తో పాటు బారెట్లా పట్టం పొందారు. హార్వార్డ్ లా స్కూలు ఫెలో అయ్యారు తర్వాత కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో 1946–47 లో సంవత్సరంపాటు ఉపన్యాసకులుగా వున్నారు లక్నో విశ్వ విద్యాలయంలో విద్యార్థి నాయకుడుగా ఉన్నప్పుడు విశ్వ విద్యాలయ విద్యార్థి సంఘంలో వివిధ పదవులు నిర్వహించి క్విట్ ఇండియా ఉద్యమంలో తీవ్రంగా పాల్గొన్నారు. స్వాతంత్ర్యా నంతరం ఆయన 1948 లో భారత యూనియన్‌లో భోపాల్ సంస్థాన విలీనీకరణోద్యమానికి నాయకత్వం వహించారు దాని ఫలితంగా కారాగారవాసం పొందారు. భోపాల్ నవాబు భారత యూనియన్‌లో విలీనం కావడానికి అంగీకరించి ఒప్పందం చేసుకొన్న పిదప శర్మ కారాగారం నుంచి విముక్తి పొందారు. 1951 లో **ఆయన** భోపాల్ స్టేట్ కాంగ్రెస కమిటీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1952 లో జరిగిన తొలి సాధారణ ఎన్నికలలో భోపాల్ సంస్థానం శాసన సభకు ఎన్నికయ్యారు. పిదప ముఖ్యమంత్రి అయ్యారు. 1956 నవంబరు 1 వ తేదీన రాష్ట్ర పునర్నిర్మాణ సందర్భంగా భోపాల్ సంస్థానం మరికొన్ని ప్రాంతాలు కలిసి మధ్యప్రదేశ్ అవతరించే వరకు ముఖ్య మంత్రిగా ఉండి, మధ్యప్రదేశ్ మంత్రివర్గంలో 1957 వరకు వివిధ శాఖలు నిర్వహించారు. పిదప 1967 లో మధ్యపదేశ్ మంత్రిగా ఉన్నారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస కమిటీ అధ్యక్షులుగాను, అఖిల భారత కాంగ్రెస కమిటీ ప్రధాన కార్యదర్శిగాను ఎన్నికయారు. ప్రముఖ విద్యావేత్త కావడంవల్ల 1958–59 లో జరిగిన ప్రపంచ విజ్ఞాన సమితి ఆసియా దేశాల మహా సభలో పాల్గొన్న భారత ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించారు. ప్రజాస్వామిక అధికార వికేంద్రీకరణ పథకం వంటి పెక్కు కమ్యూనిటీ పథకాలు రూపొందించిన ప్రణాళికా సంఘ కమ్యూనిటీ ప్రాజెక్టు బృందలో సభ్యులుగాను, సెకెండరీ విద్యా స్థాయి సంఘం సభ్యులుగాను, తిరువేంద్రంలో జరిగిన అఖిల భారత విద్యా మహాసభ అధ్యక్షులుగాను, మధ్యప్రదేశ్ శాసన సభా డెలిగేటెడ్ లెజిస్లేషన్ కమిటీ అధ్యక్షుడుగాను ఉన్నారు 1971 లో లోక్ సభకు ఎన్నికయారు: కేంద్ర విద్యా సలహా సంఘం సభ్యులుగా వున్నారు 1977 లో లోక్‌సభ ఎన్నికలలో ఓడిపోయినా, 1980 లో మరల ఎన్నికయారు కేంద్ర మంత్రిగాను, కాంగ్రెస అధ్యక్షులుగాను వున్నారు. ఆయనకు క్రీడలంటే చాల అభిమానం. లక్నో విశ్వ విద్యాలయం ఈత, నౌకాయాన దళాలకు కెప్టెన్‌గా వున్నారు. మధ్యప్రదేశ్ హిందీ సాహిత్య సమ్మేళన్ అధ్యక్షులుగా వున్నారు లక్నో లా జర్నల్‌కు, ఇల్మ్ – అగ్నూర్ పత్రికకు, సోషలిస్టు ఇండియాకు సంపాదకులుగా వున్నారు

రాష్ట్రంలో నిరుద్యోగులు :

ఈ సంవత్సరం జూన్ చివరితో ముగిసిన మూడు నెలలలో వివిధ అర్హతలు గల 57,851 మంది నిరు**ద్యోగుల నుంచి దరఖాస్తులు అందాయని రాష్ట్రం** ఉద్యోగ, శిక్షణ శాఖ డైరెక్టరు ఒక ప్రకటనలో **తెలిపారు.** పైన పేర్కొన్న మూడు నెలల వరకు 21 లక్షల మంది నిరుద్యోగుల దరఖాస్తులు రాష్ట్రంలోని వివిధ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజిలలో పరిష్కారం కావున్నవని ఆయన తెలిపారు ఈ 21 లక్షల మందిలో స్త్రీలు దాదాపు మూడు లక్షలు. ఈ **సంవత్సరం** ఏప్రిల్, మే, జూను నెలలలో 11,868 ఖాళీలు ఏర్పడ్డాయని ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజి కార్యాలయాలకు తెలిసిందని, వాటిలో 8233 ఖాళీలు భర్తీ అయినట్టు ఆయా సంస్థల యజమానులు తెలిపారని ఆయన అన్నారు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజిల ద్వారా ఉద్యోగము సంపాదించిన పై వారిలో హరిజనులు 1105 మంది, గిరిజనులు 258 మంది, వెనుకబడిన తరగతుల వారు 2063 మంది, వికలాంగులు 162 మంది, మాజీ సైనికులు 107 మంది నిరుద్యోగం పెరిగి పోతున్న ఈ సమయంలో రాష్ట్ర నూతన ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పించడం అవసరం అలా కల్పించకపోతే, యువకులలో అసంతృప్తి పెచ్చు పెరిగి రాజకీయ సంక్షోభానికి దారి తీస్తుందని రాజనీతిజ్ఞులంటారు

ఉపశ్రుతి :

"ఏమిటి సార్, శ్రీ ఎన్. టి. రామారావు సభలకు పదవి లేకపోయినా లక్షలమంది జనం వస్తున్నారే, ఏమిటీ వ్యామోహం?" అనడిగారు ఒక శ్రోత. "ఏనుగు బతికినా, మరొకటయినా వేయి రూపాయలని సామెత కదండీ-" అన్నారు యువభారతి పత్రిక సంపాదకులు, మాజీ ఎం. ఎల్. సి. శ్రీ మన్నవ గిరిధరరావుగారు.

–తిరుమల రామచంద్ర

ఇటీవల గన్నవరంలో జరిగిన గూడవల్లి వెంకట సుబ్బయ్య ఎంప్లాయిస్ కల్చరల్ అసోసియేషన్ నిర్వహించిన నాటిక పోటీలలో ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ రచన, ఉత్తమ నటి బహుమతులు గెలుచుకున్న ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్, విజయవాడవారి నాటిక, "చెప్పు కింది పూలు" నటీ నట వర్గం



Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Editor : S. Radhakrishna,
Phones : P. P. X. : 61247, 61248 & 75667

ఉత్తరాలు

(4 వ పేజీ తరువాయి)

ర్శించారు. 13 సంవత్సరాల ప్రయోగాల అనంతరము కిర్లియన్ ఫోటోగ్రఫీ ప్రపంచ ఆమోద ముద్ర పొందింది.

తుర్లపాటి రాఘవేంద్రరావు, బొంబాయి

కన్నీటి బిందువులతో విషాద దండ

కోదండరామయ్యా

కోటిదండాలు మీకు! దైన్యంలో పడిపోయిన తెలుగు
జాతి
హృదయంలో ధైర్యమును పుట్టించిన సాహస
వీరుడు నీవు
మా హొసూరు వారి విషయం నే చెబుతుండేది!
నివురు గప్పిన నిప్పు నీవు! చేతులు పెట్టి కాల్చు
కొన్నవా
రనేకులు ధర్మాగ్ని నీలో జ్వలించింది నిస్వార్థ
సత్యం నీలో
నివసించింది తెలుగు భాషలో నీ ఊపిర్ని
పీల్చుకొన్నావు.
తెలుగు జాతికేదాన్ని అర్పించావు.
నీలో యువకత్వం ఎప్పుడూ ప్రవహించేది
మాలో సిగ్గును కలిగించేది
దారిద్ర్యం ఎందరినో భయపెట్టింది – కాని
అది నిన్ను భయపెట్టలేక
దాసోహం అనింది!
మెల్లగా వీచే పిల్లగాలిలా
మాటలు ప్రారంభించి –
ఎదుటివాడు
అదిరిపోయేలా ప్రళయాగ్నిని
కురిపించే స్వభావం నీది
అన్యాయాన్ని ఊతగా పట్టుకొన్న వారిని
నీ ప్రళయాగ్ని స్వభావం
చిందర వందర
చేసి వేస్తూ ఉండేది!
అయ్యా!
కోదండరామయ్యా
మాకోసం ఇంక ఎవరున్నారు?
మా బాధ్యతలను, హక్కులను
ఎరిగించి – మా
భాగోగులకు రక్తం ధారపోసే
త్యాగమూర్తులెవరున్నారు?
ఎక్కడున్నారు?
మా ప్రాంతంలో నీవు
మెట్టని మట్టిరేణువు లేదు.
పాదుకలకు కూడా కరువైపోయిన
నీ పాదాలు –
ఎండిపోయిన ఎడారి భూమిలా ఉండేది.
ఎప్పుడు ఉదయించిందో కూడా
తెలియక – రాత్రిగతా – మా
పగటికోసం మా వెలుగుకోసం
శ్రమించిన నీలాంటి
దైవమూర్తి ఇక మా కెవరున్నారు?
సాహిత్యంలో పరిశ్రమ చేసిన నీ జీవితం
మా కొక సాహిత్యంగా నిలిచిపోయింది.
చరిత్రలో శ్రమించి శ్రమించి
నీవే మాకొక్క చరిత్రగా మిగిలిపోయావు.
పాపాలను చూసి
కోపాలు పొంగే నీలో
తాపాలు చెప్పుకుంటే – వాటిని
వినడం ఎంత చల్లదనం!
నీవు, అగ్ని పర్వతాలు
పెలయేళ్లు మేళవించిన పరశురాముడవు
ప్రయత్నంలో భగీరథుడవు
కర్మయోగ సాధనలో జనకుడవు
నిన్ను మాటలతో పొడిచినవారు
వంచనతో నొప్పి పెట్టినవారు
నీ హృదయ గాంభీర్యాన్ని

దానిలో ప్రవహించిన భాషాభిమానాన్ని
ఎంతమాత్రం గుర్తించారో మేమెఱుగము!
నీలో గర్భితమైన ఆ
మృదుత్వం – సహృదయులకు
మాత్రమే గోచరమైన అమృతం!
ఎన్నో చెప్పాలనుకుంటాం కాని భూగర్భంలోని
రత్నగనిని
త్రవ్వి తీసే కృషిలా అది మాకు
అసాధ్యమైపోతుంది!
అందుకే నీ పాదాలకు మా కన్నీటి బిందువులతో
ఒక విషాద దండ సమర్పిస్తాం
అంగీకరించు!
ఆశీర్వదించు! ఆర్యా!

సి. వి. శివరామకృష్ణశర్మ, హొసూరు □

అప్పుడప్పుడు

సాహిత్య శిక్షణ శిబిరం

చిత్తూరు జిల్లా యువ రచయితల సంఘం (రిజి) త్వరలో జిల్లా యువ రచయితలకు సాహిత్య శిక్షణ శిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించింది.

సాహిత్యంలో వివిధ ప్రక్రియలలో సుప్రసిద్ధ రచయితలు శిక్షణ యిస్తారు. ఔత్సాహికులైన యువ రచయితలకు ప్రయాణపు చార్జీలు, ఉచిత, భోజన వసతి సౌకర్యాలు సంస్థ కల్పిస్తుంది.

రాష్ట్ర యువజన సేవా శాఖ ఆర్థిక సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో పాల్గొనదలచినవారు తమ దరఖాస్తులను శ్రీ పాయసం సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, జిల్లా యువ రచయితల సంఘం, కాసాతోట, శ్రీ కాళహస్తి చిరునామాకు పంపాలి.

పుస్తక ప్రదర్శన

ఈ సందర్భంగా జరుగు పుస్తక ప్రదర్శనలో తమ పుస్తకాలను ప్రదర్శింప గోరు రచయి(త్రు)తలు, ప్రచురణకర్తలు ఒక్కొక్క పుస్తకానికి రెండు ప్రతులు చొప్పున అధ్యక్షుని పేర పంపవలసిందిగా సంఘం వారు కోరుతున్నారు.


కవితలకు ఆహ్వానం

మా విద్యుత్ప్రభా సాహితీ సమాఖ్యవారు ఆగస్టు పన్నెండున "వ్యథాగీతాలు" కవితా సంకలనమును వెలువరించిన విషయం సాహితీ లోకానికి విదితమే.

ద్వితీయం ప్రయత్నంగా మేము ప్రచురించ-దలచిన సంకలమునందు ప్రచురించుటకై యువ కవులు రచయిత (త్రు)ల నుండి కవితలు (మినీ) కథలు (మినీ) జోకులు కోరుచున్నాము.

వివరాలకు రిప్లైకార్డుతో వ్రాయండి

గాధిరాజు, మధుసూదనరాజు బి. ఎ., కార్యదర్శి, విద్యుత్ప్రభా సాహితీ సమాఖ్య నేత్ర వైద్య విభాగము ప్రభుత్వ 'వైద్యశాల' నిజామాబాదు–503001 □


ఉచిత కానుక!
గ్లూకోన్-డి యొక్క
తక్షణ శక్తితోపాటుగా
Glucon-D
ఆకర్షణీయమైన
స్టైయిన్‌లెస్ స్టీల్ చెమ్చా ఒకటి.
తక్షణ శక్తినిచ్చే మీ దినసరి పానీయం. దాన్ని కలుపుకోడానికొక చక్కని సాధనం.
ఈ తళతళ మెరిసే స్టైయిన్‌లెస్ స్టీల్ చెమ్చా గ్లూకోన్-డి 400 గ్రా. ప్యాక్‌తో పూర్తిగా ఉచితం.
తాజాదనాన్నీ, చల్లగా శక్తినీ ఇచ్చే గ్లూకోన్-డి విటమిన్ డీ, కాల్షియం, ఫాస్ఫరస్‌లతో బలపరచబడినది. దాన్ని అలాగే తీసుకోండి, లేదా పళ్లరసం, పాలు, తేనీరు, కాఫీ, లేదా మంచినీళ్లలో కలిపి తీసుకోండి.
అయితే ఒక్కటి! దాన్ని గ్లూకోన్-డి ప్రత్యేక కానుక చెమ్చాతో మట్టుకు కలిపి తీసుకోండి!
HTB-GLL-9686
Glucon-D
Glucose-D
FREE
Stainless
steel spoon
GL
INGREDIENTS
Glucon-D
Glucon-D Instant Energy for the Family
400 గ్రా.
ప్యాక్‌పై
ఈ కానుకకోసం
చూడండి
స్టాకు పరిమితం, నిర్ణీత స్థలాలలో మాత్రమే లభ్యం.
తక్షణ శక్తి కోసం–గ్లూకోన్-డి
మంచి ఆరోగ్యానికి
మూలస్థానం
గ్లాక్సో

శ్రేష్ఠమైన ప్రెషర్‌కుక్కర్‌ను తెలుసుకోండి-
గృహిణులకు ప్రశ్నా పత్రం:

ాకు ప్రెషర్‌కుక్కర్ వున్నా, ఇకమీదట మీరు కొనాలనుకుంటున్నా. ॰ క్రింది ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకున్నట్లయితే—మార్కెట్లో ఉంచే శ్రేష్ఠమైన ప్రెషర్‌కుక్కర్ ఏదో మీరు ఇట్టే తెలుసుకోవచ్చు. సరైన సమాధానాలకు పేజీని తలకిందులుగా త్రిప్పి చూడండి)

	(ఎ) ☑ అవును	(బి) కాదు
1. స్టెయిన్‌లెస్‌స్టీల్ ప్రెషర్‌కుక్కర్‌లు శ్రేష్ఠమైనవా ?	☐	☐
2. ప్రతి స్టెయిన్‌లెస్‌స్టీల్ ప్రెషర్‌కుక్కర్ నాన్‌మేగ్నటిక్ AISI 304 (1.25 mm thickness) స్టెయిన్‌లెస్‌స్టీల్‌తోనే తయారుచేయబడిందా ?	☐	☐
3. చిట్లు పడటం, పగలడం, అరిగి పోవడం మొదలైనవన్నీ నాసిరకం స్టెయిన్‌లెస్‌స్టీల్ వాడటంవల్ల జరుగుతుందా ?	☐	☐
4. మిశ్రలోహం లాగా స్టెయిన్‌లెస్‌స్టీల్ ఎప్పుడైనా బద్దలవుతుందా ?	☐	☐
5. తరాలకొద్దీ స్టెయిన్‌లెస్‌స్టీల్ మనుతుందా ?	☐	☐
6. వెల్డింగులు, అతుకులు. రెండు భాగాలు కలిపి తయారుచేయడం ప్రెషర్‌కుక్కర్‌కు భద్రత లేకుండా చేస్తుందా ?	☐	☐
7. ప్రెషర్‌కుక్కర్‌లన్నిటికీ గాస్కెట్ లోపలి పార్శ్వం జారడానికి, తీయడానికి అనువుగా కాటిన్‌లా నునుపుగా వుంటుందా ?	☐	☐
8. స్టెయిన్‌లెస్‌స్టీల్ ప్రెషర్‌కుక్కర్‌లను స్టీల్ వూల్‌తోనే శుభ్రం చేయాలా ?	☐	☐
9. అన్ని రకాల కూరగాయలనూ, మాంసాన్నీ ప్రెషర్‌కుక్కర్‌లో వంట చేయవచ్చా?	☐	☐
10. స్టెయిన్‌లెస్‌స్టీల్‌కు రసాయనిక మార్పుగాని, బూజు పట్టడంగాని జరుగుతుందా ?	☐	☐
11. అన్ని ప్రెషర్‌కుక్కర్‌లకూ పదేళ్ళ గ్యారంటీ వుంటుందా ?	☐	☐
12. అన్ని ప్రెషర్‌కుక్కర్‌లకూ మంటను ఆకర్షించి, పట్టుకోడానికి ప్రత్యేకంగా తయారుచేయబడిన అడుగు భాగం వుంటుందా ?	☐	☐
13. పాత్రల తయారీలో పలవైయేళ్ళ అనుభవంకల వారితోనే ప్రతి స్టెయిన్‌లెస్‌స్టీల్ ప్రెషర్‌కుక్కర్ తయారుచేయబడిందా ?	☐	☐
14. సుదీర్ఘకాలం మన్నిక, నాణ్యత దృష్ట్యా స్టెయిన్‌లెస్‌స్టీల్ ధర ఏమాత్రం ఎక్కువ కాదు కదా ?	☐	☐

ఇప్పుడు మీ సమాధానాలు సరి చూసుకోండి. మీ ఒక్కొక్క సరైన సమాధానమూ **బటర్‌ఫ్లై** స్టెయిన్‌లెస్‌స్టీల్ ప్రెషర్‌కుక్కర్‌యొక్క ప్రత్యేక విశిష్టత. నిజంగానే. ఒక్కసారి **బటర్‌ఫ్లై**ని చూడండి. అది మీ మనసును పరవశింపజేస్తుంది. దానిని మీ ఇంటికి తీసుకుపోతే, అది మీ ఇంటిని కూడా పరవశింపజేస్తుంది **బటర్‌ఫ్లై** స్టెయిన్‌లెస్‌స్టీల్ ప్రెషర్‌కుక్కర్ ఇది దృఢమైన స్టెయిన్‌లెస్‌స్టీల్‌తో తయారు చేయబడింది !

సమాధానాలు : 1 (ఎ). 2 (బి): 3 (ఎ): 4 (బి): 5 (ఎ): 6 (ఎ): 7 (బి): 8 (బి).
9 (ఎ): 10 (బి): 11 (బి): 12 (బి): 13 (బి): 14 (ఎ):





బటర్‌ఫ్లై

స్టెయిన్‌లెస్ స్టీల్ ప్రెషర్ కుక్కర్

ఉత్పత్తిదారులు : గంగాధరం ఎంటర్‌ప్రైజెస్ 197, కారపాక్కం, ఓల్డ్ మహాబలిపురం రోడ్, మద్రాసు-600 096 ఫోను 552587, 555127, 556091

జంట నగరాలకు డిస్ట్రిబ్యూటరు : గుప్తా స్టీల్ ప్యాలస్, 1–8–27/12 & 13 చిక్కడపల్లి, హైదరాబాద్–500 000. ఫోన్:62463

కోస్తా ఆంధ్రకు డిస్ట్రిబ్యూటరు : రాఘవేంద్ర మెటల్ స్టోర్సు, గుడివాడవారి వీధి, విజయవాడ – 520 001. ఫోన్ :77716.